thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 138 | కరీంనగర్ ఆదివారం, 27 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్లోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పు తోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.



# ఒక అభ్యర్థి.. ఒకే నామినేషన్!..

## ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీకి పోటీ చేయటానికి నోచాన్స్!

## కీలక నిర్ణయాల దిశగా ఎన్నికల సంఘం

హైదరాబాద్ : గతంలో ఒక అభ్యర్థి అనేక పదవులకు పోటీచేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీపడాలనే నిబంధనను తీసుకురానున్నట్టు సమాచారం. ఒక అభ్యర్థి ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీచేసే అవకాశమూ ఈ సారి ఉండబోదని తెలుస్తున్నది. ఇలా ఈసారి స్థానిక ఎన్నికల్లో అనేక కొత్త నిబంధనలను అమలు చేయనున్నారని తెలుస్తున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల చిక్కుముడి వీడకపోయినా, షెడ్యూల్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను విభజించారు. చనిపోయినవారి పేర్లను తొలగించి, కొత్తగా ఓటర్లను చేర్చి నూతన జాబితాను రూపొందించారు. కొత్తగా నోటాను తీసుకొస్తున్నారు. 2004 నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మాత్రమే అమలులో ఉన్న నోటా ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ అమలు చేయనున్నారు. ఈ మేరకు బ్యాలెట్ పేపర్లలో నోటాను ముద్రించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నికల అధికారులు

### కుటుంబంలోని ఓటర్లు అందరికీ ఒకే పోలింగ్‌బూత్‌లో ఓటు హక్కు
### ఎంపీటీసీకి గులాబీ, జడ్పీటీసీ ఎన్నికకు తెలుపు బ్యాలెట్ పేపర్లు

ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ఎంపీటీసీ పోలింగ్ కోసం గులాబీ, జడ్పీటీసీ ఎన్నిక కోసం తెలుపు రంగు బ్యాలెట్ల పేపర్లను సిద్ధం చేస్తున్నారు. గతంలో మండలం యూనిట్ తీసుకున్నందున ఒక కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉంటే కొన్నిసార్లు వారి ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండేవి. ఈసారి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నందున కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు వేసేలా చర్యలు తీసుకోనున్నారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ఎన్నికల నాటికి కొత్త ఓటర్లకు చాన్స్...** ఎన్నికల నాటికి కొత్త ఓటర్ల చేరిక, ఉన్నవారిలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులను ఆహ్వానిస్తే వారి వివరాలతో వార్డుల వారీగా అనుబంధ జాబితానూ రూపొందిస్తారు. బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. గతంలో ఉన్న బ్యాలెట్లు, సీళ్లను పరిశీలించాలని ఇప్పటికే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశించారు. ఎంతమంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు), పోలింగ్ సిబ్బంది అవసరమని గుర్తించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారితోపాటు నలుగురు అధికారులను నియమించనున్నారు.

**కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు...** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాలను జారీచేసింది. ఎన్నికల కోసం జిల్లా స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తాజాగా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులను జారీచేసింది. బ్యాలెట్ బ్యాక్సులు, పోలింగ్ సిబ్బంది, కావాల్సిన సామగ్రి, ఇతర సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నది.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత.. నక్సల్స్‌కు డీజీపీ ఆఫర్!

ఏపీ డీజీపీ ఎదుట పలువురు కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వారి నుంచి భారీగా ఆయుధ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోస్టుల్లో అగ్రనేతలు ఉన్నారు. మావోయిస్టు పార్టీలో సుమారు 34 ఏళ్లకు పైగా పని చేసిన సీనియర్ మావోయిస్టు జోరిగె నాగరాజు అలియాస్ కమలేశ్, ఆయన భార్య అరుణ అలియాస్ మేదక జ్యోతీశ్వరి ఉన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వీరు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీశ్ కుమార్ గుప్తా ముందు శనివారం లొంగిపోయారు. ప్రస్తుతం కమలేశ్ తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీకి ఇన్చార్జిగా పనిచేస్తూ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఎస్‌జెడ్‌సీఎం హోదాలో ఉన్నారు.

మావోయిస్టు పార్టీ వైఫల్యాలు, కేంద్ర కమిటీ విధానాలపై విసుగు చెంది ఈ సిద్ధాంతం ఇక చలామణిలో అవ్వదని గ్రహించి లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఆయన భార్య అరుణ, మొబైల్ అకడమిక్ పొలిటికల్ ఆర్గనైజేషన్ స్కూల్‌కి ఇన్చార్జ్‌గా పనిచేస్తూ అదే విధంగా పార్టీ వైఫల్యాల పట్ల నిరాశ చెందారని పేర్కొన్నారు. కమలేశ్‌పై ఏపీలో 20 లక్షల రూపాయల రివార్డు, అరుణ పై 5 లక్షల రూపాయల రివార్డు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఇక, లొంగిపోయిన దంపతులకు తక్షణ ఉపశమనంగా ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున చెక్కులను డీజీపీ అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆపరేషన్ బృందాలు గత వారంలో రికవరీ చేసిన ఆయుధాలను ఏపీ డీజీపీ హరిశ్ కుమార్ గుప్తాకి అధికారులు చూపించారు. వీటిలో మొత్తం 18 ఆయుధాలు ఉన్నాయి. ఏకే-47, 2 బీజీఎల్‌లు, 5 ఎస్ఎల్ఆర్‌లు, 2 ఐఎన్ఎస్ఏఎస్ రైఫిళ్లు, 606 లైవ్ రౌండ్లు, 37 కిలోల కార్డెక్స్ వైర్లు, ఇతర పరికరాలు ఖచ్చితమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ ఈ మధ్య లొంగిపోయిన మడకం దేవా అలియాస్ భగత్ (డివిజనల్ కమిటీ సభ్యుడు) సహా 13 మంది యూజీ కేడర్‌కు రూ.22 లక్షల విలువైన చెక్కులను డీజీపీ అందజేశారు. గత ఏడాది కాలంలో మొత్తం రూ.64 లక్షల రివార్డులను వివిధ హోదాల్లో లొంగిపోయిన 48 మంది కేడర్‌కు అందజేశారు.



**ఈ మధ్య కాలంలో 5 సార్లు ఎదురు కాల్పులు..** ఈ సందర్భంగా డీజీపీ హరిశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఏపీలో ఈ మధ్య కాలంలో 5 సార్లు ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయనీ, ఇందులో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు ఉదయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ, జగన్, డివిజనల్ కమిటీ కార్యదర్శి రమేశ్ ఉన్నారని చెప్పారు. అలాగే వీరి నుంచి 8 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఏడుగురు యూజీ కేడర్ అరెస్ట్ కాగా, నలభై మంది యూజీ కేడర్ లొంగిపోయారని చెప్పుకొచ్చారు. మావోయిస్టు యూజీ కేడర్ లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. సరెండర్ పాలసీ ప్రకారం వారి లొంగుబాటుకు ఏపీ పోలీస్ శాఖ సహకరిస్తుందని చెప్పారు. వారి పై ఉన్న రివార్డ్ తో పాటు, ఇంటి స్థలం, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ రాష్ట్రాల్లో పని చేస్తున్న ఇరవై మంది ఏపీ స్థానికులు ఉన్నారని, అందులో ఐదు మంది ఎస్‌జెడ్‌సీఎం హోదాలో ఉన్నారని చెప్పారు.




## జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

హైదరాబాద్: జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్ర ఎన్నటికీ మరువలేనిదన్నారు. జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ సాకారమయ్యేది కాదని చెప్పారు. 'జైపాల్‌రెడ్డి మెమోరియల్ అవార్డు' ప్రదానోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో 40 ఏళ్లపాటు ఆయన అజాతశత్రువుగా ఉన్నారని చెప్పారు. " సమాచారహక్కు చట్టం రావడంలో జైపాల్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. సంస్కరణల అమలుకు కూడా ఆయన ఎంతో తాపత్రయపడే వారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం ఎంతో కృషి చేశారు. తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు తర్వాత అంతపేరు తెచ్చుకున్నది జైపాల్ రెడ్డి మాత్రమే. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని ఆయన చెబుతుండేవారు. తెలంగాణ కోసం జైపాల్‌రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియాగాంధీ కూడా ఓసారి చెప్పారు. ఇవాళ ఐడియాలజీ పొలిటిక్స్ కనుమరుగై.. స్విగ్గీ పొలిటిక్స్ వచ్చాయి. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళ్తున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి.. పొలిటికల్ మెనేజ్‌మెంట్ పెరిగింది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# విశ్వసనీయత మోదీ పైనే...

## అందరికంటే టాప్.. మోడీనే ఫస్ట్!

## మార్నింగ్ కన్సల్ట్‌లో అత్యధిక రేటింగ్!!



భారత రాజకీయ చరిత్రలో మరోసారి నరేంద్ర మోదీ తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకున్నారు. 2014 మే 26న ప్రధాని పదవిని స్వీకరించిన నరేంద్ర మోదీ, 2025 జూలై 25 నాటికి 4,078 రోజులు పదవిలో కొనసాగుతూ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ (4,077 రోజులు) రికార్డును అధిగమించారు.

ఈక్రమంలో ఆయన స్వతంత్ర భారతదేశంలో రెండవ అత్యధిక కాలం ప్రధానిగా పనిచేసిన నేతగా చరిత్రకెక్కారు. మోదీకి ముందున్న రికార్డు మాత్రం పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ పేరుకు చెందింది. నెహ్రూ సుమారు 16 సంవత్సరాలు పదవిలో కొనసాగారు.

**వరుసగా మూడోసారి ప్రధాని...** 2014, 2019లో పూర్తిస్థాయి మెజారిటీతో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు, మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా మెజారిటీ సాధించలేకపోయినా, ఎన్డీఏ కూటమి సహకారంతో మోదీ మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

నెహ్రూ తర్వాత వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండవ నాయకుడిగా మోదీ నిలిచారు.

**–గుజరాత్ నుంచి దేశానికి నేత...** గుజరాత్‌కు చెందిన మోదీ, 2001 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 12 సంవత్సరాలకు పైగా రాష్ట్రపాలనలో అనుభవం కలిగిన మోదీ, 2014లో జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టి ప్రధానిగా మారారు.

హిందీ మాట్లాడని రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ప్రధానిగా అత్యధిక కాలం పనిచేసిన వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు.

**–విజయం, స్థిరత్వంలో మోదీ మాంత్రికత్వం...** మోదీ నాయకత్వంలో బీజేపీ 2014, 2019, 2024 లలో వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించింది. ఇది నెహ్రూ తరువాత ఎవరూ సాధించని ఘనత. గుజరాత్ రాష్ట్ర స్థాయి ఎన్నికలు..దేశవ్యాప్త లోక్‌సభ ఎన్నికలతో కలిపి మొత్తం ఆరు ప్రధాన ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించిన ఏకైక నాయకుడిగా మోదీ నిలిచారు.

**–పాలనలో సంస్కరణలు, ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్ఠ...** మోదీ పదవీ కాలంలో మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఉజ్వల యోజన, జనధన్, ఆత్మానిర్భర్ భారత్ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలయ్యాయి. అంతర్జాతీయంగా కూడా భారతదేశం ప్రతిష్ఠను పెంచేలా మోదీ చురుకైన విదేశాంగ విధానం చేపట్టారు.

నరేంద్ర మోదీ నాయకత్వం దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తోంది. అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన నేతగా, ప్రజల నమ్మకాన్ని సంపాదించుకున్న మోదీ ఇప్పుడు దేశ చరిత్రలో రెండవ దీర్ఘకాలిక ప్రధానిగా నిలవడం గర్వకారణం. తదుపరి కాలంలో ఆయన నాయకత్వం భారతదేశ అభివృద్ధి దిశగా ఎటువంటి మలుపు తీసుకెళ్తుందో వేచి చూడాల్సిందే.



## భద్రాచలం వద్ద 32 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

భద్రాచలం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పాటు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 7 గంటలకు గోదావరి నీటిమట్టం 32.5 అడుగులు దాటి ప్రవహిస్తోంది. నీటిమట్టం పెరగటంతో స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద చాలా మెట్లు వరదనీటిలో మునిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో భద్రాచలం వద్ద నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద పర్యాటక ప్రదేశం నార చీరల ప్రాంతం వద్దకు వరద నీరు చేరడంతో పర్యాటకులను ఆపివేశారు. మరోవైపు.. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. భద్రాచలం పట్టణంలోకి స్లూయిజ్‌ల ద్వారా వరద నీరు రాకుండా అధికారులు మోటార్లను ఏర్పాటు చేశారు.



## వదలని వరుణుడు..

## హైదరాబాద్ సహా ఈ జిల్లాల్లో హైఅలర్ట్.. ఉప్పొంగుతున్న గోదావరి..

హైదరాబాద్ : తెలంగాణలో వర్షాలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్ నగరంసహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ఏపీతోపాటు తెలంగాణలోనూ వర్షాలు దంచికొడుతున్నాయి. ప్రస్తుతం వాయుగుండం తీరందాటి ద్రోణిగా రూపాంతరం చెందిందని, దీని ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి. హైదరాబాద్ జిల్లాలో వర్షం దంచికొడుతుంది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు నగర వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు.. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుటుర్కొంటున్నారు. ఎడతెరిపిలేని వర్షంతో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వర్షప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపడుతున్నారు. అయితే, హైదరాబాద్లో మరో రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. హైదరాబాద్ తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇవాళ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరో నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉండటంతో వర్షంపడే సమయాల్లో ప్రజలు చెట్ల కిందకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి నదుల ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం జలాశయం నుంచి 20వేల క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జున సాగర్‌లో నీటిమట్టం 580.20 అడుగులకు చేరింది.

283. 5924 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో వరద కొనసాగుతుండటంతో ఐదు గేట్లు ఎత్తి 95వేల 416 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం 317.390మీటర్ల నీటి మట్టం,7.444 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. కాళేశ్వరం వద్ద వరద ఉధృతి పెరిగింది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ వద్ద ఔట్ ఫ్లో 3 లక్షల 41 వేల క్యూసెక్కులుగా ఉంది. 85గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 8.700 మీటర్లుగా ఉంది.

## జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ ఉద్బోధ




హైదరాబాద్, జులై, 26: నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోందన్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్ కు ప్రమాదకరమన్న రేవంత్.. యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకు ఇబ్బంది లేదని రేవంత్ స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని కొనియాడిన రేవంత్ రెడ్డి.. పీవీ, జైపాల్ రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు. 'జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా, శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో జైపాల్ రెడ్డి గారు పని చేసి, దేశానికే తలమానికమైన పనులు చేశారని చెప్పారు.

**అలా అని సోనియాగాంధీ నాతో చెప్పారు...** స్వర్గీయ జైపాల్ రెడ్డి గొప్పతనం గురించి చెబుతూ సీఎం రేవంత్ ఇంకా ఏమన్నారంటే.. '1969 లో తొలిసారి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగుసార్లు శాసనసభ్యుడిగా, 5 సార్లు లోక్ సభ సభ్యుడిగా, 2 సార్లు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. పెట్రోలియం శాఖ నిర్వహిస్తున్న సమయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. సమాచార శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఉండాలని ఆయన విశ్వసించి ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. పార్లమెంట్ లో రాణించిన వారి నుంచి మేధావుల వరకు ఎవరితోనూ జైపాల్ రెడ్డి గారితో వ్యక్తిగత వైరం లేదు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన వ్యక్తి జైపాల్ రెడ్డి గారు. చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపై జైపాల్ రెడ్డి ఎక్కువ ఆలోచించేవారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కల్వకుర్తి ప్రాంతంలో విద్యుత్ అవసరమని గుర్తించి అభివృద్ధికి బాటలు వేశారు. రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ఆయన ప్రయత్నించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర లేకపోతే ఇవాళ తెలంగాణ వచ్చేది కాదు. చర్చ లేకుండానే పార్లమెంట్ లో తెలంగాణ బిల్ ఆమోదించేలా జైపాల్ రెడ్డి ప్రత్యేక పాత్ర పోషించారు. జైపాల్ రెడ్డి గారి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ ఒక సందర్భంలో నాతో చెప్పారు. కాంగ్రెస్ ను వీడినా, తిరిగి కాంగ్రెస్ లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం ఆయన పార్టీలు మారలేదు. ' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.



## ఐదేళ్లలో మోదీ టూర్ల ఖర్చు రూ. 362 కోట్లు!

న్యూఢిల్లీ: ఐదేళ్లలో రూ.362 కోట్లు ఖర్చు అంటే.. ఇదేదో ప్రాజెక్టుకు అనుకునేరు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల ఖర్చు. 2021 నుంచి 2025 మధ్య ఆయన విదేశీ పర్యటనలకోసం అక్షరాలా రూ.362కోట్లు ఖర్చయ్యాయి. ఒక్క 2025లోనే ఆయన పర్యటనలకోసం రూ.67కోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇందులో.. అమెరికా, ఫ్రాన్స్ ఉన్నతస్థాయి పర్యటనలు సహా ఐదు పర్యటనలు న్నాయి.

రాజ్యసభలో తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ అడిగిన ప్రశ్నకు సమ్యా దానంగా విదేశాంగ శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలను రాజ్యసభకు అందించారు. ఈ డేటా ప్రకారం, 2025లో ప్రధాని పర్యటనల్లో అత్యంత ఖరీదైనది ఫ్రాన్స్ పర్యటన. దీనికి రూ. 25 కోట్లకు పైగా.. ఆ తర్వాత అమెరికా పర్యటనకు రూ. 16 కోట్లకు పైగా ఖర్చయింది. మారిషస్, సైప్రస్, కెనడా దేశాల అదనపు సందర్శనల ఖర్చులు ఇంకా వీటికి కలపలేదు. ఇక 2024 లో రష్యా, ఉక్రెయిన్‌తో సహా 16 దేశాల్లో పర్యటించడానికి రూ.109 కోట్లు ఖర్చు చేశారు. 2023లో దాదాపు రూ.93 కోట్లు, 2022లో రూ.55.82 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చు చేశారు. 2021లో అమెరికా పర్యటనకే రూ.19 కోట్లకు పైగా ఖర్చయింది. ఇవి కేవలం పర్యటనలకే పరిమితం కాకుండా.. పర్యటనలకు సంబంధించిన ప్రకటనలు, ప్రసార ఖర్చుల వివరాలు కూడా ఇందులో ఉన్నాయి.

## చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం: మంత్రి తుమ్మల



హైదరాబాద్: మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశించారు. చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేనేత రంగంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్న తుమ్మల.. రాష్ట్రానికి చెందిన వివిధ రకాల చేనేత వస్త్రాలను జాతీయ చేనేత దినోత్సవం రోజు ఏర్పాటు చేసే ప్రదర్శనలో ఆయా సంఘాల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చేనేత రుణ మాఫీ పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి.. ఖాతాల్లో నిధులు జమచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నేతన్న పొదుపు, భరోసా పథకాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.



## ఏటీఎం ధ్వంసం చేసి నగదు చోరీ

అదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణం రామ్‌నగర్‌లోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం తెల్లవారుజామున చోరీ ఘటన కలకలం రేపింది. దుండగులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం లాకర్ కట్ చేసి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలపై బ్లాక్ స్ప్రే చల్లి అక్కడి నుంచి ఉడాయించారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు కర్రె స్వామి, సునీల్ కుమార్ పరిశీలించారు. చోరీకి గురైన నగదు వివరాలను సేకరిస్తున్నారు.

## రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే 'తెలంగాణ జాగృతి' ఊరుకోదు: కవిత




కుత్బుల్లాపూర్: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడర్' శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని అన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. "ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేడు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి. పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యేగానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే 'జాగృతి' పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది.

తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదు" అని కవిత అన్నారు.




## సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఘోర తప్పిదం.. పోలీసుల కేసు నమోదు

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో పోలీసులు ఇవాళ (శనివారం జులై 24) తనిఖీలు నిర్వహించారు. పిల్లల కోసం టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఓ మహిళ ఆశ్రయించారు. తన భర్త వీర్య కణాలతో సంతానం కలిగించాలని ఆమె కోరారు. వేరే వారి వీర్యకణాలతో సంతానం కలిగించారు వైద్యురాలు. అనుమానం వచ్చి డీఎన్ఏ టెస్ట్ చేయించారు దంపతులు. కడుపులో ఉన్న శిశువు డీఎన్ఏ వేరే వారిదిగా తేలడంతో పోలీసులను ఆశ్రయించారు దంపతులు. వారి ఫిర్యాదు మేరకు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం వచ్చిన దంపతులకు మగ బిడ్డ జన్మించింది.

బిడ్డ ఎదుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు వచ్చాయి. కొన్ని రోజుల క్రితమే పుట్టిన బాబుకి కేన్సర్ అని తేలడంతో దంపతులు షాక్‌కి గురయ్యారు. ఈ విషయం తెలియడంతో వెంటనే మరో డాక్టర్‌ను కలిశారు దంపతులు. డీఎన్ఏ టెస్ట్ చేయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తొమ్మిదేళ్ల క్రితం సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను సీజ్ చేశారు. అక్రమంగా అనుమతులు పొంది.. మళ్లీ నిర్వహిస్తున్నారు డాక్టర్ నమ్రత. రెండు గంటలుగా రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖల ఉన్నతాధికారులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్నారు. అక్రమంగా పెద్దఎత్తున వీర్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. కొంతమంది యువకులకు డబ్బు ఆశ చూపించి వీర్యం సేకరిస్తున్నారని అధికారులు గుర్తించారు. ఎవరైనా దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం వస్తేనే.. విజయవాడ నుంచి డాక్టర్ నమ్రత వస్తున్నారు. నమ్రతను విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

# అసలు ఆ దేశమే లేదు.. భారత్‌లో మాత్రం ఎంబసీ..!

అసలు ఆ దేశమే లేదు.. కానీ ఎంబసీ ఏర్పాటు చేసి ఓ వ్యక్తి జాబ్ రాకెట్ నడుపుతున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లపై ఎంబసీ స్టిక్కర్లు, దౌత్య పాస్‌పోర్టులు, విదేశీ కరెన్సీ, దేశంలోని ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకుంటున్నాడు. చివరకు ఉత్తర్‌ప్రదేశ్ టాస్క్ ఫోర్స్ చేతికి చిక్కాడు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఢిల్లీ ఎన్‌సీఆర్‌కు సమీపంలోని గాజియాబాద్‌లో హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి తాజాగా పోలీసులకు దొరికిపోయాడు. ఆ నగరంలో అతడు విలాసవంతమైన రెండు అంతస్తుల ఇంటిని అద్దెకు తీసుకొని వెస్ట్‌ఆర్కిటికా పేరుతో దౌత్యకార్యాలయాన్ని నడుపుతున్నాడు. అది అంటార్కిటికాలోని ఒక ప్రాంతం. ఒక యూఎస్ నౌకాదళ అధికారి దేశంగా ప్రకటించుకున్నాడు.కానీ దీనికి ఎలాంటి గుర్తింపు లేదు. దీని పేరుతో జైన్ విదేశాల్లో పని ఇప్పిస్తానని యువతను నమ్మిస్తూ ఓ జాబ్ రాకెట్ నడుపుతున్నాడు. అలాగే మనీలాండరింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని పోలీసులు అభియోగాలు మోపారు.

**'జేమ్స్ బాండ్'లా ఉండాలనుకుని.. అడ్డంగా దొరికిపోయి..!...** యువత అతడిని నమ్మేందుకు పలు జిమ్మిక్కులు ఉపయోగించాడు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖ నేతలతో దిగిన నకిలీ ఫొటోలను వాడుకున్నాడు. 2011లోనూ శాటిలైట్ ఫోన్ కలిగి ఉన్నాడని అతడిపై కేసు నమోదైంది కూడా. తాజాగా ఎంబసీ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ నేపథ్యంలో అతడి కార్యకలాపాలపై అనుమానం వచ్చిన పోలీసులు.. చివరకు నకిలీ ఎంబసీ గుట్టురట్టు చేశారు. వెస్ట్‌ఆర్కిటికాతో పాటు 12 మైక్రోనేషన్ల దౌత్యపాస్‌పోర్టులు, విదేశాంగ శాఖ స్టాంపులున్న దస్త్రాలు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల నగదు, దౌత్య నంబర్‌ప్లేట్లు, ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు.

**వెస్ట్‌ఆర్కిటికా..అసలు ఉందా?...** 2001లో యూఎస్ అధికారి ట్రావిస్ మెక్‌హెన్రీ దీన్ని ప్రకటించాడు. తనను తాను గ్రాండ్ డ్యూక్‌గా ప్రకటించుకున్నారు. అంటార్కిటాలో 6,20,000 చదరపుమైళ్ల మేర తనదే అని చెప్పుకున్నాడు. ఆ దేశానికి 2,536 మంది పౌరులు ఉన్నారని చెప్తున్నా.. అక్కడ ఎవరూ నివసించడం లేదు. అంటార్కిటిక్ ఒప్పందంలోని లొసుగులను ఉపయోగించుకొని దానికి తనను తాను పాలకుడిగా ప్రకటించుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం.. శాంతియుత ప్రయోజనాలు, శాస్త్రీయ పరిశోధనలకు మాత్రమే అంటార్కిటికాను ఉపయోగించుకోవాలి. మిలిటరీ, అణ్వస్త్ర కార్యక్రమాలు, వ్యర్థాలను పడేయడానికి ఏ దేశమూ దానిని వినియోగించుకోకూడదు. ఇవే నిబంధనలు ప్రైవేటు వ్యక్తుల విషయంలో లేదు. ఆ లొసుగునే ట్రావిస్ వాడుకున్నారు. ఈ వెస్ట్‌ఆర్కిటికా ఎంబసీ పేరిట ఏర్పాటు చేసిన ఇన్‌స్టాగ్రాంలో జైన్ తనను తాను ఆ దేశానికి చెందిన సంపన్నుడిగా పేర్కొన్నాడు. 2017 నుంచి దౌత్యకార్యాలయం కార్యకలాపాలు నడుస్తున్నట్లు వెల్లడించాడు. అయితే ఆర్కిటిక్ ఉత్తర ధ్రువంలో ఉండగా అంటార్కిటికాలో ఎలా వచ్చిందన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

# మెడలో గొలుసుతో ఎంఆర్ఐ స్కాన్ కు.. ప్రాణం పోయింది..

ఎమ్ఆర్ఐ స్కానింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మరోసారి స్పష్టం చేస్తూ న్యూయార్క్‌లో ఓ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మెటల్ వస్తువులను ధరించి ఎమ్ఆర్ఐ గదిలోకి వెళ్లకూడదన్న స్పష్టమైన హెచ్చరికలు ఉన్నప్పటికీ, ఇటీవల జరిగిన ఒక సంఘటనలో ఈ నిబంధనలను పాటించకపోవడం వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. లాంగ్ ఐలాండ్‌కు చెందిన అడ్రియన్ జోన్స్-మకాలిస్టర్ మోకాలి ఎమ్ఆర్ఐ పరీక్ష కోసం స్కానింగ్ రూమ్‌లో ఉన్నారు. ఆమెకు సహాయం చేయడానికి తన భర్త కీత్ మకాలిస్టర్‌ను లోపలికి రమ్మని టెక్నీషియన్‌ను కోరినట్లు తెలియజేసింది. స్కానింగ్ టేబుల్ నుండి దిగడానికి తనకు భర్త సహాయం కావాలని ఆమె చెప్పింది. అయితే, కీత్ మకాలిస్టర్ అప్పుడు సుమారు 20 పౌండ్ల బరువున్న వెయిట్ ట్రైనింగ్ చైన్‌ను ధరించి ఉన్నాడు.

అది లోహంతో (మెటల్) తయారు చేయబడినది కావడంతో ఎమ్ఆర్ఐ యంత్రం అతన్ని శక్తివంతంగా తన వైపు లాగేసింది. అతను ఒక్కసారిగా ఎమ్ఆర్ఐ యంత్రానికి అతుక్కుపోయాడు. వెంటనే అతన్ని యంత్రం నుండి విడదీయడానికి ప్రయత్నాలు చేసినా, అప్పటికే అతని శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. దీనితో అతనికి వరుసగా గుండెపోటులు రావడం ప్రారంభించాయి. వైద్యులు తీవ్రంగా శ్రమించినా, అతని ప్రాణాలను కాపాడలేకపోయారు. ఈ విషాద ఘటనపై జోన్స్-మకాలిస్టర్ మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు: "అతను నాకు గుడ్‌బై అంటూ చేయి ఊపాడు. అదే అతని చివరి ఊపిరి అయ్యింది. ఒక్కసారిగా అతని శరీరం సద్దున ఊపిరి తీయకుండా పోయింది." అని ఆమె వాపోయింది ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నప్పటికీ, వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇది మానవ తప్పిదం వల్లే జరిగిన దుర్ఘటన. ఎంత చిన్నదైనా సరే, మెటల్ వస్తువులను ఎమ్ఆర్ఐ గదిలోకి అనుమతించరాదన్న నిబంధనను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఈ సంఘటన స్పష్టం చేస్తుంది. ఎమ్ఆర్ఐ స్కానింగ్‌కు వెళ్లే ప్రతి ఒక్కరికీ ఈ సంఘటన ఒక హెచ్చరిక. తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చున్న వాస్తవాన్ని ఈ ఘటన బలంగా గుర్తుచేస్తుంది.

# దావూద్ తో కలిపి ఏడుగురు.. పాక్ రక్షణలోని భారత్ మోస్ట్ వాంటెడ్స్ వీరే!

ప్రపంచంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, వారికి ఆశ్రయం కల్పిస్తూ, వారిని తమ అనధికారిక సైన్యంగా చూసే దేశం పాకిస్థాన్ అనే సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలోనే అటు ప్రపంచానికి, ఇటు భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులైన ఏడుగురు ఉగ్రవాదులు ఆ దేశంలోనే తలదాచుకుంటున్నారు. వారిని పాక్ కంటికి రెప్పలా కాపాడుతోందని చెబుతారు. వారెవరో ఇప్పుడు చూద్దామ్..! అవును... భారత్ తో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు ఘోరాలకు పాల్పడి, వందల మంది అమాయక ప్రజల ప్రాణాలు తీసిన వారు.. ఎక్కడో అడవుల్లోనో, ప్రపంచానికి కనిపించని శిథిలాల్లోనో, గుహల్లోనో తలదాచుకుంటారని అనుకుంటే పొరపాటే. వారిని సొంత పౌరులుగా ఆశ్రయం కల్పిస్తూ, రక్షణ కల్పిస్తూ రక్షిస్తుంది పాకిస్థాన్. పైకి మాత్రం... తాము కూడా ఉగ్రవాద బాధితులమే అని చెప్పుకుంటుంది.

**హాఫీజ్ సయీద్:** యునైటెడ్ స్టేట్స్ నావల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ కార్యాలయం ప్రకారం.. హాఫీజ్ సయీద్ 1990ల ప్రారంభంలో పాకిస్తాన్ కు చెందిన ఇస్లామిక్ ఛాందసవాద మిషనరీ గ్రూపు అయిన మర్కజ్ ఉద్ దవా-వాల్ ఇర్షాద్ సైనిక విభాగంగా స్థాపించిన లష్కర్ తోయిబా ఉగ్రవాద సంస్థకు అధిపతి. ఈ ఉగ్రసంస్థ భారతదేశంపై జరిపిన దాడులు ఎన్నో ఉన్నాయి! ఇందులో ప్రధానంగా 2006లో ముంబైలో జరిపిన 26/11 ఘోరం ఒకటి. ఈ ఘటనలో సుమారు 360 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు! అంతకంటే ముందు.. 2000 సంవత్సరంలో ఢిల్లీలోని ఎర్రకోటపై లష్కర్ ఉగ్రవాదులు దాడి చేశారు. దీంతో.. ఈ దాడుల వెనకున్న హాఫీజ్ ను అమెరికా, ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదిగా ప్రకటించాయి. ఈ నేపథ్యంలో అతని తలపై %వి%10 మిలియన్ల రివార్డు ఉంది. అయినప్పటికీ ఆ ఉగ్రవాది ఎక్కడో చీకట్లో, ప్రపంచానికి తెలియని ప్రదేశంలో దాక్కొన్నాడంటే పొరపాటే! అతడు సాయుధ రక్షణలో లాహోర్ లో హాయిగా నివసిస్తున్నాడు. ఇలాంటి బ్యాచ్ ఇంకా పాక్ లో చాలా మందే ఉన్నారు.

**మసూద్ అజార్:** హాఫీజ్ అనంతరం పాకిస్తాన్ లో స్థిరపడి, ఆదేశ సైన్యం రక్షణలో ఉన్న జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత మసూద్ అజార్ ఉన్నాడు. పుల్వామా, ఉరి ఉగ్రవాద దాడులకు సూత్రధారి అయిన అజార్ ను 2019లో ఐక్యరాజ్యసమితి 'గ్లోబల్ టెర్రరిస్ట్'గా ప్రకటించింది. ఆ దాడుల్లో సుమారు 59 మంది సైనికులు మరణించగా.. పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్ లో అతడు పాకిస్తాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ లో జరిగిన ఒక ఇస్లామిక్ సెమినరీలో ప్రసంగించాడు. ఈ సందర్భంగా... భారతదేశంపై మరిన్ని ఉగ్రవాద దాడులు చేస్తామని ప్రతిజ్ఞ చేశాడు. ఈ నేపథ్యంలో... అతన్ని వెంటనే అరెస్టు చేయాలని భారత ప్రభుత్వం డిమాండ్ చేసింది. కానీ.. అతడి ఆచూకీ గురించిన సమాచారం తమ వద్ద లేదని పాక్ బొంకింది!

**జకీర్ రెహ్మాన్ లఖ్వీ:** వీరిద్దరి తర్వాత స్థానంలో జకీర్ రెహ్మాన్ లఖ్వీ ఉన్నాడు. అతడు ఒక ఇస్లామిక్ బోధకుడే కాకుండా లష్కరే తోయిబా లో సీనియర్ వ్యక్తి కూడా! 26/11 ముంబై దాడి వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి ఇతడే అనే నివేదికలు ఉన్నాయి. ఇతడిని పాక్ గతంలో జైలులో పెట్టింది. అనంతరం అతి తక్కువ కాలంలోనే బెయిల్ పై విడుదలయ్యాడు. ఇతడు 2020 నుండి ఇతర ఉగ్రవాదుల మాదిరిగానే పాక్ లో స్వేచ్ఛగా ఉన్నాడని చెబుతారు. ఈ క్రమంలో... పంజాబ్ ప్రావిన్స్, ఇస్లామాబాద్ లలో ఇతడి అడ్రస్ లు కూడా రికార్డులో ఉన్నాయని అంటారు. అతనికి పాక్ సైన్యంతో పాటు చైనా కూడా రక్షణ కల్పిస్తున్నాయని అంటారు. అతన్ని కీలక ఉగ్రవాదుల జాబితాలో చేర్చాలనే ఐరాస ప్రయత్నాన్ని బీజింగ్ అడ్డుకుంది!

**సయ్యద్ సలావుద్దీన్:** ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు సయ్యద్ సలావుద్దీన్. ఇతడు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థకు అధిపతి. కాగా.. కాశ్మీర్ లోయను భారత దళాలకు శ్మశానవాటికగా మారుస్తానని ఇతడు ప్రతిజ్ఞ చేశాడు. ఇతడు ఇప్పటికీ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో భారతదేశ వ్యతిరేక ర్యాలీలకు నాయకత్వం వహిస్తున్నట్లు చెబుతారు.

**దావూద్ ఇబ్రహీం:** ఆ తర్వాత స్థానంలో దావూద్ ఇబ్రహీం ఉన్నాడు. అపఖ్యాతి పాలైన డి-కంపెనీ క్రైమ్ సిండికేట్ అధిపతి, హత్య, కిరాయికి హత్య, దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటి ఆరోపణలపై వాంటెడ్ గా ఉన్న దావూద్ ఇబ్రహీం... ఇప్పటికే కరాచీలో ఫ్యామిలీతోపాటు క్షేమంగా ఉన్నట్లు చెబుతారు. పాక్ మాత్రం తమకు తెలియదు అని అంటుంటుంది! దశాబ్దం క్రితం ముంబైలో జరిగిన బాంబు దాడుల్లో అతని పాత్రకు గాను 2003లో భారతదేశం, అమెరికా అతన్ని 'గ్లోబల్ టెర్రరిస్ట్'గా ప్రకటించాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్.బీ.ఐ) 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో కూడా ఉన్నాడు. అతని తలపై %వి%25 మిలియన్ల రివార్డ్ ఉంది.

**భత్కల్ బ్యాచ్:** ఈ ఐదుగురితోపాటు భారతదేశంలో స్లీపర్ సెల్స్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పే ఇండియన్ ముజాహిదీన్ ను స్థాపించిన బాంబర్ ఇక్బాల్ భత్కల్.. ఆ గ్రూపును సహ వ్యవస్థాపకుడు, దానికి ఫైనాన్షియర్ గా వ్యవహరిస్తున్న అతని సోదరుడు రియాజ్ భత్కల్ ఇద్దరూ కూడా కరాచీలోనే నివసిస్తున్నారు. భారత్ పై దాడి చేయడానికి వీరంతా పాక్ ను లాంచ్ ప్యాడ్ గా ఉపయోగిస్తున్నారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యత వహించిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్)ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ.. ఇది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ముసుగు సంస్థ అని అమెరికా పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన పాక్.. పహల్గాం దాడికి, లష్కరే తయిబా కు ఎలాంటి సంబంధం లేదని.. సదరు ఉగ్రసంస్థ నెట్ వర్క్ ను తాము ఇప్పటికే ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

ఈ నేపథ్యంలో... పాకిస్థాన్ రక్షణలో ఉన్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితా మరోసారి చర్చకు వచ్చింది. ఇంతమందికి రక్షణ కల్పిస్తున్న పాకిస్థాన్.. టీఆర్ఎఫ్ విషయంలో అమెరికా ప్రకటనపై తీవ్రంగా స్పందించడంలో పెద్ద విచిత్రం లేదని అంటున్నారు. ఇదే సమయంలో ఆ ఏడుగురు మోస్ట్ వాంటెడ్స్ పైనా పాక్ ఓ ప్రకటన చేస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

# లోక్‌సభలో నిరసనలకు బ్రేక్.. అఖిలపక్ష భేటీలో విపక్షాల అంగీకారం

దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటినుంచి విపక్షాల నిరసనలతో ఉభయ సభలు స్తంభిస్తూనే ఉన్నాయి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ప్రతిరోజూ ఆందోళన చేస్తుండటంతో సభలు వరుసగా వాయిదా పడుతున్నాయి. శుక్రవారం కూడా ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ఈనేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేడు తన ఛాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలు రాజకీయ పార్టీలకు చెందిన సీనియర్ నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా సభ్యులంతా సహకరించాలని స్పీకర్ కోరారు. సోమవారం (జులై 28) నుంచి 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ జరిపేందుకు కేంద్రం అంగీకరించింది. దీనిపై ప్రతిపక్షాలు లేవనెత్తిన కొన్ని డిమాండ్లపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. కేంద్రం, ప్రతిపక్ష నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా జరగనున్నట్లు తెలుస్తోంది. పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ఒక్కో సభలో మొత్తంగా 16 గంటల సమయం కేటాయించారు. విదేశీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తిరిగొచ్చిన తర్వాత.. 28న దిగువ సభలో, మరుసటిరోజు ఎగువసభలో చర్చ ప్రారంభం కానుంది. చర్చకు మోదీ సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకూ మరోసారి స్పష్టం చేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు.

# చేతివేళ్లే మౌస్.. మెటా సంచలనం.. విప్లవాత్మక టెక్నాలజీ



ప్రపంచం టెక్నాలజీ వేగంతో దూసుకుపోతోంది. ఈ క్రమంలో సామాజిక మాధ్యమ దిగ్గజం మెటా మరో వినూత్న ఆవిష్కరణతో ముందుకు వచ్చింది. మానవ శరీరం నుండి వెలువడే విద్యుత్ సంకేతాలను ఆధారంగా చేసుకుని, కేవలం చేతి వేలు కదలికలతో కంప్యూటర్లను నియంత్రించే స్మార్ట్ రిస్ట్ బ్యాండ్‌ను మెటా అభివృద్ధి చేసింది. దీనితో ఇక కీబోర్డు, మౌస్, టచ్ స్క్రీన్, వాయిస్ కమాండ్ల అవసరం లేకుండానే కంప్యూటర్‌ను నియంత్రించే రోజులు రానున్నాయి.

**-ఏంటీ ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్?...** మెటా యొక్క 'రియాలిటీ ల్యాబ్స్' విభాగంలో రూపొందించిన ఈ బ్రేస్‌లెట్, వినియోగదారుడి మణికట్టు వద్ద ఉన్న కండరాల నుండి వెలువడే ఎలక్ట్రోమయోగ్రాఫిక్ సంకేతాలను గుర్తించి పనిచేస్తుంది. మన మెదడు ఇచ్చే ఆదేశాలతో చేతులు కదిలినప్పుడు వచ్చే అత్యంత సూక్ష్మమైన విద్యుత్ సంకేతాలను ఈ పరికరం గ్రహించి, వాటిని కంప్యూటర్‌కు అర్థమయ్యే ఇన్‌పుట్‌లుగా మారుస్తుంది.

**- ఎలా పనిచేస్తుంది?...** ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్ స్పర్శేతర పద్ధతిలో పనిచేస్తుంది. దీని ప్రత్యేకతలు.. వాడేవారి వేలు కదలికల ఆధారంగా టైపింగ్, ఇతర ఆపరేషన్లు జరుగుతాయి. మనం టేబుల్‌పై రాస్తున్నట్లుగా చేతులు కదిలిస్తే.. ఆ విషయం నేరుగా స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మనం జేబులో చేతులు పెట్టుకుని కూడా ఈ పరికరాన్ని ఉపయోగించవచ్చు. ఇది దీనికి ఉన్న అత్యంత వినూత్నమైన ఫీచర్.

**-దివ్యాంగులకు వరం!...** ఈ టెక్నాలజీ ముఖ్యంగా దివ్యాంగులు, వాయిస్ కమాండ్‌లు ఉపయోగించలేని వారు, లేదా కీబోర్డు వాడలేని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శరీరంలోకి ఎలాంటి ఇంప్లాంట్లు అమర్చాల్సిన అవసరం లేకుండానే, ఈ బ్రేస్‌లెట్ వాడటం ద్వారా సులభంగా కంప్యూటర్‌ను నియంత్రించవచ్చు. ఇది వారి దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేస్తుంది.


**- ఎస్ఈఎమ్‌జీ టెక్నాలజీతో సుసంపన్నం...** ఈ పరికరం సర్ఫేస్ ఎలక్ట్రోమయోగ్రఫీ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. అంటే, శరీరం లోపల ఉండే సంకేతాలను బయట నుంచే అత్యంత కచ్చితత్వంతో గుర్తించగల సామర్థ్యం దీనికి ఉంది. చాలా సున్నితమైన విద్యుత్ సంకేతాలను కూడా ఇది రీడ్ చేసి, వాటిని డిజిటల్ యాక్షన్లుగా మార్చగలదు.

**-వాడకాలు:** ఈ స్మార్ట్ రిస్ట్ బ్యాండ్ యొక్క భవిష్యత్ వాడకాలు విస్తృతంగా ఉండనున్నాయి. మెసేజ్‌లు టైప్ చేయడం.. డెస్క్‌ప్లే మెనూలను నియంత్రించడం.. చేతుల కదలికలతో డిజిటల్ కంటెంట్‌ను యాక్సెస్ చేయడం.. రహస్యంగా సమాచారాన్ని పంపించడం.. ఇది గోప్యతను కోరుకునే వారికి ఎంతో ప్రయోజనకరం.

**- భవిష్యత్తు దిశగా మెటా అడుగులు...** ఈ టెక్నాలజీ ఇప్పటికీ అభివృద్ధి దశలో ఉంది. మెటా సంస్థ ఈ రంగంలో మరిన్ని పరిశోధనలకు మద్దతు ఇస్తోంది. డేటా మోడళ్లు, సాఫ్ట్‌వేర్ డిజైన్లు, పరికరాల రూపకల్పనల్లో ఇతర పరిశోధకులకూ సహకరించనుంది. దీని ద్వారా మరిన్ని కొత్త టెక్నాలజీలు వస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినప్పుడు.. కంప్యూటర్ వాడకంలో గొప్ప విప్లవం సంభవించనుంది. ఇది కేవలం టెక్నాలజీ అభివృద్ధి మాత్రమే కాదు.. మనం ఎలా జీవిస్తున్నామో, ఎలా పని చేస్తున్నామో మార్చివేసే దిశగా ఒక కీలకమైన అడుగు.

# కుల గణన సర్వే.. 88 కోట్ల పేజీలా..!

సాధారణ పౌరులకు పట్టుమని పది పేజీలుచదివే ఓపిక కూడా లేని ఈ రోజుల్లో ఏకంగా 88 కోట్ల పేజీల సర్వే అంటే.. ఎవరైనా ముట్టుకుంటారా? ఎవరైనా కనీసం.. దానిని ఆమూలాగ్రం పరిశీలించే వీలుంటుం దా? అంటే.. చెప్పడం కష్టం. కానీ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం.. ఔననే అంటున్నారు. తాము ప్రతిష్టాత్మకంగా చేయించిన కుల గణన సర్వే విషయాన్ని తాజాగా ఢిల్లీలో ప్రస్తావించిన ఆయన.. తమ సర్వే రిపోర్టు 88 కోట్ల పేజీల్లో ఉందని చెప్పుకొచ్చారు. దీనిని ఎవరైనా చదువుకోవచ్చని కూడా సెలవిచ్చారు. వాస్తవానికి రాష్ట్రంలో ఉన్న జనాభానే 4.32 కోట్ల మంది. వారికి సంబందించిన కుల గణన నివేదిక మహా అయితే.. దీనికి డబుల్ వేసుకున్నా.. 10 కోట్ల పేజీల్లో ఉంటుంది. ఉండాలి కూడా. కానీ.. ఏకంగా 88 కోట్ల పేజీల్లో నివేదికలు సిద్ధం చేశామని ఆయన చెబుతున్నారంటే.. ఎవరికి మాత్రం దీనిని చదివే ఓపిక.. పరిశీలించే వెసులుబాటు ఉంటుంది. ఈ విషయాన్ని అటు ఉంచితే.. అసలు ఏ పేజీలో ఏముందో తెలుసుకునే పీఠిక ఏకంగా 32 పేజీలపైగానే ఉందని చెప్పుకొచ్చారు. దీనిని చదివేందుకు కూడా




ఓపిక ఉండాలి. ఏదైనా సర్వే చేయించినప్పుడు.. అది సాధారణ ప్రజలకు, సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. కానీ.. 88 కోట్ల పేజీల్లో ఉంది.. చదువుకోండి.. అంటే.. అది అసాధ్యం. కానీ.. సర్కారు మాత్రం ఇదే చెబుతోంది. దీంతో దీనిపై మేధావి వర్గాలు కూడా పెదవి విరుస్తున్నాయి. దీనిని చదివి అర్థం చేసుకునే సరికే.. పెద్ద సమస్య అని నిత్యం మీడియాలో ఉండే ఓ ప్రొఫెసర్ వ్యాఖ్యానించారు. దీనిని ఉద్దేశ పూర్వకంగా చేశారని అనడం లేదుకానీ.. ఇంత పెద్ద నివేదికను చదివే ఓపిక, ఓర్పు ఎవరికి మాత్రం ఉంటుందన్నదే ప్రశ్న. ఈ సర్వేను ఇతరుల మాట ఎలా ఉన్నా.. కనీసం అధికార పక్షంలో ఉన్న వారైనా చదివారా? అనేది ప్రశ్న. దీనిని చదివి అర్థం చేసుకునే సరికి పుణ్యకాలం గడిచిపోతుందని చెబుతున్నారు. పైగాదీనిని డిజిటల్ రూపంలో తీసుకువస్తున్నట్టు సీఎం చెబుతున్నారు. ఎలా చూసుకున్నా.. ఇది.. కొరకరాని కొయ్యగానే మారుతుంది. ప్రభుత్వం గొప్పగా చెబుతున్నప్పటికీ.. అది సాధారణ ప్రజలకు చేరితేనే.. ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. అంతేతప్ప.. 88 కోట్ల పేజీల్లో నివేదిక ఇచ్చామని గొప్పగా చెబుతున్నా.. అది ప్రయోజనం ఇవ్వనప్పుడు వృథానే కదా! అనేది ప్రశ్న.

# ఐటీ ఫ్రెషర్స్ కంటే ప్లంబర్సే ఎక్కువ సంపాదిస్తున్నారట..!

ఒకప్పుడు ఇంజినీరింగ్ చదివి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందితే "లైఫ్ సెటిల్ అయిపోతుంది" అనే మాట చాలా నమ్మకంగా వినిపించేది. అయితే ఈ రోజుల్లో ఆ నమ్మకం సన్నగిల్లుతోంది.

దీనికి కారణం మారుతున్న మార్కెట్ పరిస్థితులు. సాంకేతిక రంగంలో పెరుగుతున్న పోటీ, విపరీతమైన శిక్షణ అవసరం, ప్యాకేజీల తగ్గుదల వంటివి ఒకవైపు ఉంటే.. మరోవైపు నైపుణ్యం ఆధారిత వృత్తుల్లో ఆదాయం గణనీయంగా పెరిగింది. ఇప్పుడు చాలామంది ఐటీ ఫ్రెషర్స్ కంటే ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, మెషిన్ టెక్నీషియన్లు మంచి ఆదాయం సంపాదిస్తున్నారు.

**ఎందుకు ఇలా జరిగింది?...** ఈ మార్పునకు కొన్ని ప్రధాన కారణాలున్నాయి.. ప్రతి సంవత్సరం లక్షల మంది ఇంజినీర్లు గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్నారు. అయితే వీరందరికీ తగినన్ని ఉద్యోగాలు లభించడం లేదు. దీని ఫలితంగా కంపెనీలు తక్కువ జీతాలకే అసంఖ్యాకమైన రెజ్యూమ్‌లను పొందుతున్నాయి. ఫ్రెషర్లకు బేసిక్ పే సంవత్సరానికి ?3-4 లక్షల మధ్య నుండి ఎక్కువగా ఎదగడానికి సంవత్సరాలు పడుతోంది. ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్, కార్పెంట్రీ వంటి నైపుణ్యం అవసరమయ్యే వృత్తులకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ రంగాల్లో నిపుణులు కొంతకాలంలోనే నెలకు ?50,000 నుంచి




?1,00,000 వరకు సంపాదిస్తున్నారు. ముఖ్యంగా మెట్రో నగరాల్లో వీరి సేవలకు దక్కే డిమాండ్ అధికం. ఐటీ రంగంలో కూడా ఇప్పుడు కోడింగ్, డేటా సైన్స్, డెవ్‌ఒప్స్ వంటి ప్రత్యేక నైపుణ్యాలే డిమాండ్‌లో ఉన్నాయి. కేవలం సాధారణ డిగ్రీ సరిపోవడం లేదు. అదే సమయంలో, నైపుణ్యం అవసరమయ్యే కార్మిక వృత్తుల్లో కూడా ప్రాక్టికల్ నైపుణ్యాలే మంచి ఆదాయానికి మార్గం చూపుతున్నాయి. ఇంజినీరింగ్ కాకుండా ఇతర సాంకేతిక వృత్తుల అవసరం పెరిగింది. గృహ నిర్మాణం, లోహకర్మ, రిపేరింగ్ వంటి సేవలు ఇప్పటికే డిజిటల్ యాప్‌లు అర్బన్ క్లాప్, హౌస్ జాయ్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా ప్లంబర్లకు, ఇతర స్కిల్‌డ్ వర్కర్లకు పెద్ద సంఖ్యలో క్లయింట్లు లభిస్తున్నారు.

**ఐటీ ప్రొఫెషనల్స్ మాటల్లో...** ఐటీ ఉద్యోగులు ఈ పరిస్థితిని ఇలా వివరిస్తున్నారు. అమిత్ కుమార్ అనే ఐటీ ఎంప్లాయీ మాట్లాడుతూ.. "డిగ్రీ ఉన్నదంత మాత్రాన ఉద్యోగం రావడం లేదు. స్కిల్స్ లేనిదే కంపెనీలు ఆహ్వానించడం లేదు. అలాగే ?25,000 జీతానికి రోజూ 9 గంటల పని. ఫ్రీలాన్స్ ప్లంబర్స్ మమ్మల్ని మించి సంపాదిస్తున్నారు." అని తెలిపారు. 'ఫ్రెషర్లకు మారిన ప్రపంచానికి తగ్గట్టు స్కిల్స్ కావాలి. వాళ్ళు అప్‌గ్రేడ్ అవ్వాలి. లేదంటే ప్లంబర్, డ్రైవర్ జీతాలు మించిపోవడం సహజం." సునీత రెడ్డి అనే హెచ్‌ఆర్ మేనేజర్ తెలిపారు.

**-ఇదే సరైన మార్గమా?...** సాఫ్ట్‌వేర్ రంగం పూర్తిగా తప్పని చెప్పలేం. కానీ ఇప్పుడు సాధారణ డిగ్రీతో ఉద్యోగం పొందడం కష్టం. పైగా వేతనాలు తక్కువగా ఉండటం వలన మానసిక ఒత్తిడి పెరుగుతోంది. ఐటీ రంగంలో కొనసాగాలంటే, కొత్త టెక్నాలజీలు ఏఐ, ఎంఎల్, క్లౌడ్, డెవోప్స్ వంటి వాటిలో నైపుణ్యం సాధించడం అత్యవసరం. "పేరు గొప్పది కంటే పనిలో నైపుణ్యం గొప్పది" అన్న నానుడి ఇప్పుడు నిజమవుతోంది. ఎవరైనా తమ పనిని ప్రతిష్టాత్మకంగా చూసుకుంటే, ఎంత చిన్న వృత్తమైనా మంచి ఆదాయాన్ని అందిస్తుంది. ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు ఈ నిజాన్ని గుర్తించి, తమ స్కిల్స్‌ను అప్‌డేట్ చేసుకోవడమే మార్గం. లేదంటే... ప్లంబర్ మనల్ని మించిపోతాడు.. అది కేవలం ఉదాహరణ కాదు, నిష్ఠుర సత్యం.

చురకలు

## సంపాదకీయం

# అసలేంటి ధర్మస్థల హత్యల వివాదం?

కర్ణాటకలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ధర్మస్థల, ఇప్పుడు సంచలనాత్మక ఆరోపణలతో వార్తల్లో నిలిచింది. ఒక మాజీ పారిశుధ్య కార్మికుడు చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణల తీవ్రత, పోలీసుల స్పందన, సిట్ ఏర్పాటు, గతంలో జరిగిన ఘటనలు.. ఈ అంశాలన్నీ వివాదానికి మరింత ఆజ్యం పోశాయి. ధర్మస్థల ఆలయంలో గతంలో పనిచేసిన ఓ పారిశుధ్య కార్మికుడు, ఆలయ అధికారుల ఒత్తిడితో దాదాపు 100కి పైగా మృతదేహాలను రహస్యంగా ఖననం చేశానని ఆరోపించాడు. వాటిలో లైంగిక దాడులకు గురైన మహిళలు, మైనర్లు ఉన్నారని, అలాగే 400 మందికి పైగా యువతులు అదృశ్యమయ్యారని పేర్కొన్నాడు. ఈ దారుణాలకు ప్రభావవంతమైన స్థానిక నేతలు, ఆలయ యాజమాన్యం బాధ్యులని అభిప్రాయపడ్డాడు. ఈ ఆరోపణలు శ్రీ వీరేంద్ర హెగ్గడే వంటి కీలక వ్యక్తులపైనా ప్రభావం చూపాయి. అయితే, ఇప్పటివరకు భౌతిక ఆధారాలు లేకపోవడం విచారణను సంక్లిష్టం చేస్తోంది.

**-పోలీసుల స్పందనపై విమర్శలు...** పారిశుధ్య కార్మికుడు జూలై 4న ఫిర్యాదు చేసినా, పోలీసులు జూలై 11 వరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తాయి. తవ్వకాలకు సిద్ధంగా ఉన్నానని కార్మికుడు చెప్పినప్పటికీ, పోలీసులు అతడిని గుర్తించలేకపోవడం ఆలస్యానికి కారణమైంది. ఇది స్థానిక రాజకీయ ఒత్తిడులు, ఆలయ యాజమాన్యపు ప్రభావం లేదా అధికారుల నిర్లక్ష్యమా అనే అనుమానాలకు దారితీసింది.

**-సిట్ ఏర్పాటు.. పురోగతి లేకపోవడమే సమస్య...** ఈ వివాదంపై కర్ణాటక ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రణవ్ మోహంతి నేతృత్వంలో సిట్ ను ఏర్పాటు చేసింది. అయితే, దర్యాప్తులో ఎటువంటి గణనీయమైన పురోగతి కనిపించకపోవడం ప్రజల్లో విశ్వాసం కోల్పోవడానికి దారితీస్తోంది. పైగా, సిట్ అధికారికి వ్యతిరేకంగా కొందరు న్యాయవాదులు అభ్యంతరాలు వ్యక్తం చేయడం మరింత అనుమానాలకు తావిచ్చింది.

**- గతం వెనుక మరొక బాధితురాలి కథ...** ఈ వివాదానికి కొత్త ఊపునిస్తూ 22 ఏళ్ల క్రితం అదృశ్యమైన 'సౌజన్య' అనే యువతి కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. ఆమె తల్లి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తన కుమార్తె అదృశ్యంపై పూర్తిస్థాయి దర్యాప్తు కావాలని కోరింది. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న ఆరోపణలు తమ కుటుంబం అనుభవించిన బాధను గుర్తు చేస్తున్నాయని ఆమె పేర్కొనడం, పారిశుధ్య కార్మికుడి ఆరోపణలకు బలాన్ని చేకూర్చింది.

**- ప్రజలు కోరేది.. పారదర్శక దర్యాప్తు మాత్రమే...** ఇలాంటి నాజూకు అంశాల్లో మతపరమైన ఆస్తిక భావాలు, స్థానిక రాజకీయ ఒత్తిడులు అడ్డుకుంటే నిజం వెలుగు చూడదు. కాబట్టి తక్షణమే తవ్వకాలు ప్రారంభించాలి. సాక్షులకు రక్షణ కల్పించాలి.సిట్ విచారణను వేగవంతం చేయాలి.పారదర్శక నివేదికలు ప్రజలకు అందించాలి.అధికారుల పాత్రపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. ధర్మస్థల కేసు, దేశంలోని మతస్థలాల పట్ల ఉన్న గౌరవాన్ని సవాల్ చేస్తూ, న్యాయ వ్యవస్థ పారదర్శకతను పరీక్షించే అంశంగా మారింది. ఆధ్యాత్మికత కప్పిపుచ్చిన చీకటి నిజాలు వెలుగులోకి రావాలంటే, ప్రభుత్వం ధైర్యంగా ముందుకు రావాలి. లేదంటే, ఇది కేవలం మరో మూతపడ్డ కేసుగానే మిగిలిపోతుంది.

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్ - జూలై 27... మిస్సైల్ మ్యాన్ వర్ధంతి - ప్రపంచ విద్యార్థుల దినోత్సవం




అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దిన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎమ్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ఱ=ఱూ%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు.

1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (%ూఎ-×××%)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ ఫేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరైపోయాయి. మళ్ళీ తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృధ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-%××% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్‌పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోఖ్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో ఉంది. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జులై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జులై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కువ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9540595494**

# తెలుగు భాష పట్ల ఆవులకు ప్రత్యేక అభిమానం - జూలై 27... ఆవుల సాంబశివరావు వర్ధంతి




జస్టిస్ ఆవుల సాంబశివరావు (మార్చి 16, 1917...జూలై 27, 2003) జడ్జిగా, వైస్ ఛాన్సలర్ గా, లోకాయుక్తగా సుపరిచితులు. న్యాయవాది గానే కాక, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, రాష్ట్ర మొట్ట మొదటి లోకా యుక్తగా, హేతువాదిగా, ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గా పేరెన్నిక గన్నారు. గాంధేయుడుగా ఆరంభమైన ఆవుల సాంబశివరావు, క్రమేణా ఎం.ఎన్. రాయ్ ప్రభావితుడై అఖిలభారత మానవ వాద సంఘాధ్యక్షుడుగా, భారత హేతువాద సంఘ కార్యదర్శిగా, ఇండియన్ రేషనలిస్ట్ పత్రిక సంపాదకుడుగా పని చేశారు. సాంబశివరావు 1917లో మార్చి 16వ తేదీన గుంటూరు జిల్లా మూల్పూరులో ఆవుల బాపమ్మ, ఆదియ్య దంపతులకు జన్మించారు. సాంబశివరావు తొలి నాళ్లలో, సమాజంలో బానిసత్వం, విశ్వాసాలు ఇవన్నీ రూపుమాసి పోవాలంటే కమ్యూనిస్టు భావజాలమే పేదరికం, వెనకబాటుతనం, అంధ శరణ్యం అని భావించినా, ఎం.ఎన్. రాయ్ స్ఫూర్తితో నవ్య మానవవాదాన్ని అవలంబించారు. మానవ సమాజంలో మానవత్వాన్ని వెలిగిస్తే చీకట్లు తొలగిపోతాయని భావించారు. బుద్ధుడి విశ్వప్రేమ, (త్రిపురనేని - జులై 27, 2003) రామస్వామి చౌదరి సంస్కరణ, హేతువాద భావాలు ఆయన ఆలోచనలకు పునాదులు వేశాయి. అరవయ్యేళ్లకు పైగా ఏ పదవిలో ఉన్నా, ఏచోట ప్రసంగించినా, మానవత్వాన్ని శాస్త్రంతో మిళతం చేసి పని చేశారు. పాలేర్లతో పాటు తననీ కూర్చోబెట్టి అన్నం పెట్టిన తల్లి మంచి మానవతావాది అన్నారు. గుంటూరు, మద్రాసు, కలకత్తాలో విద్య నభ్యసించారు మరియు మద్రాసు యూనివర్సిటీ నుండి ఆర్ట్స్ అండ్ లా గ్రాడ్యుయేట్ చేశారు. 7 ఏప్రిల్ 1941న మద్రాసు హైకోర్టులో న్యాయ వాదిగా నమోదు చేసుకుని, ఆ కోర్టులో అలాగే గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మరియు 21 ఏప్రిల్ 1967 వరకు హైదరాబాద్ లో ప్రాక్టీస్ చేశారు. 14 జూలై 1966న 2వ ప్రభుత్వ ప్లీడర్ గా నియమితు లయ్యారు. 22 ఏప్రిల్ 1967న ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితుల య్యారు. ఆయను 25 జనవరి 1975 నుండి జనవరి 10, 1976 వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. మద్రాసు, గుంటూరు, హైదరాబాద్ లో హైకోర్టు న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా, జడ్జిగా పనిచేసిన ఆవుల... హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా స్వయంగా క్రమశిక్షణ పాటించి, జడ్జిలచే పాటింప జేశారు. తెలుగు దేశం అధినేత ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యాక తెలుగు భాషా సాహిత్యాలు, కళలు, చారిత్రక వికాసానికి ప్రత్యేకంగా ఒక విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలా తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక ఆయన కృషి ఉందని చెప్పక తప్పదు. తెలుగు విద్యార్థి పత్రికలో రెండు దశాబ్దాలకు పైగా శీర్షికను కొనసాగించారు. త్రిపురనేని రామస్వామి... పునరుజ్జీవపథం - 1997, యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం, నవభావన అనే రచనలు చేశారు. సాంబశివరావు అవసరమైతే తప్ప ఇంగ్లీషు మాట్లాడేవారు కాదు. లోకాయుక్తగా ఆయన తెలుగులో అందుకొన్న ఫిర్యాదులకు తెలుగులోనే తీర్పులు చెప్పే విధానం ప్రవేశ పెట్టారు. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులత ఆయన కుమార్తె. సాంబశివరావు 88 యేళ్ల వయసులో 2003 జూలై 27న హైదరాబాదులో కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# అనితర సాధ్యాలు...సంగం లక్ష్మీబాయి సేవలు - జూలై 27...సంగం లక్ష్మీబాయి జయంతి



తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్తశుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురాలుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్యు రాలిగా సమర్థ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి. సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 - జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం లోనే తల్లిదండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్యమైంది. కార్వే విశ్వ విద్యాలయం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యో ద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు. ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహం (1930-31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. స్వామి రామానందతీర్థ ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణలో సారథ్యం వహించారు. 1950లో భూదానో ద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947-48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరులైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలాదేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు. సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్ గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి. లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు. నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు. 1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నిక య్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. హైదరాబాదు యాదవ మహాజన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరాబాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధికారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు. ఆమె పద్దెనిమిదేళ్ల పాటు ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ బాధ్యురాలిగా కొన్నాళ్లు పని చేశారు. స్వాతంత్ర్య సమర యోధురాలిగా గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. 1979లో మరణించే వరకు లక్ష్మీబాయి స్త్రీలు, బాలికల సంక్షేమం కొరకు నిర్విరామ, అసమాన కృషి చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భద్రాద్రి రామయ్య భూముల అన్యాక్రాంతం... ఆక్రమణల వెనుక అప్రకటిత యుద్ధం



భద్రాచల రామాలయం దేశవ్యాప్తంగా భక్తుల హృదయాల్లో గాఢంగా నిలిచిన పవిత్ర క్షేత్రం. శ్రీ సీతారాముల వారి ఆలయానికి దశాబ్దాల కిందట భక్తులు, రాజులు, గ్రామస్తులు దానం చేసిన వేల ఎకరాల భూములు దేవాలయ నిర్వహణకు మూలాధారంగా ఉన్నాయి. కానీ, క్రమంగా ఈ భూములు అనేక ఆక్రమణలకు గురవుతూ, వివాదాల్లో చిక్కుకొని, అధికారిక పరిపాలన సాధికారికతను ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయి. తాజాగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్తుపల్లి రమాదేవిపై ఆక్రమణ దారులు దాడికి పాల్పడటం ఈ అంశాన్ని మరోసారి తీవ్రతతో ముందుకు తెచ్చింది. భద్రాచల రామాలయానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1050 ఎకరాల భూములు ఉన్నాయి. ప్రభుత్వం, పురుషోత్తమ పట్నంలో ఇతర సంస్థలకు, ప్రార్ధనా మందిరంకు కేటాయించిన స్థలాలు పోగా, 889 ఎకరాలు నికరంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 299 ఎకరాల భూములు ఉన్నాయి. దంతెన పల్లిలో 233 ఎకరాలు వివాదాస్పదమై కోర్టు కేసుకు గురి కావడం జరిగింది. తెలంగాణ లోనూ భద్రా చలం కు సమీపాన భూములు స్వార్థపరుల ఆక్రమణలకు గురి కాగా, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్ట లేని దుస్థితి. చాలా భాగం ఇనాం భూములుగా 20వ శతాబ్దం ప్రారంభంలోనే రికార్డులలో నమోదయ్యాయి. కానీ సమయానికి సరైన పరిరక్షణ లేక, న్యాయపరమైన స్థిరత అందక, ఇవి అనేక ఆస్తి వివాదాల్లో చిక్కుకున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచల ఆలయం తెలంగాణలో ఉండగా, దాని భూములలో కొన్ని ప్రాంతాలు ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా భూముల పట్ల పరిపాలన, రక్షణ, మరియు న్యాయపరమైన అధికారం విషయాల్లో స్పష్టత లేకుండా పోయింది.తెలంగాణ దేవాదాయ శాఖ ఈ భూముల రికార్డులను పునఃసమీక్షించి, తిరిగి ఆలయ అధికార పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉంది. కానీ, స్థానికంగా ఆక్రమణ దారుల ప్రతిఘటన తీవ్రమవుతోంది. ఈఓ రమాదేవి... ఆలయానికి చెందిన భూములను పరిశీలించేందుకు అధికారులతో కలిసి వెళ్లిన సందర్భంగా, భూములను అక్రమంగా ఆక్రమించిన కొందరు వ్యక్తులు ఆమెను అడ్డగించడమే కాకుండా ఆమె పై దాడికి పాల్పడిన సంఘటన ఆక్రమణ దారుల దౌర్జన్యానికి పరాకాష్టగా నిలిచింది. అధికారిణి పై బెదిరింపులు, మౌఖిక దాడులు జరగడం ఆలయ పరిరక్షణ బాధ్యత వహించే అధికారుల విధి నిర్వహణను అడ్డుకునే చర్యగా భావించాలి. ఇది కేవలం వ్యక్తిగత ఘటన కాదు. దేవాలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రభుత్వ యత్నాలపై చేసిన కుట్ర పూరిత మైన ప్రతీకారం. ఇది మొదటి ఘటన కాదు. భద్రాచల ఆలయానికి చెందిన అనేక భూములపై అక్రమంగా ప్రాపర్టీ డీలర్లు, రియల్టీ లాబీలు, రాజకీయ సహకారంతో కూడిన గుంపులు బోగస్ పత్రాలు సృష్టించి ఆక్రమణకు పాల్పడినట్టు అనేక నివేదికలు చెబుతున్నాయి. వాటిపై విచారణకు మళ్ళీ ఏదో చోట జాప్యం కొనసాగుతుంది. పోలీసుల సహకారం కూడా లభించని దుస్థితి దాపురించింది. కొన్నిచోట్ల స్థిరాస్తులను లీజు పేరుతో స్వాధీనం చేసుకుని, ఆ తరువాత పూర్తిగా తమ హక్కుగా మార్చుకున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు హైకోర్టులో కూడా ఆలయానికి అనుకూలంగా పలు తీర్పులు వచ్చినా, వాటి అమలు విషయంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం చట్టపరమైన వ్యవస్థల వైఫల్యం కాదు, ధర్మ పరిరక్షణ పట్ల ప్రభుత్వాల తటస్థతను సూచించే అంశం. భద్రాచల రామయ్య భూములు భక్తుల ధర్మదానం. వాటిని ఆక్రమించడం ఆధ్యాత్మిక సమాజం పైనా, నైతిక విలువల పైనా దాడిగా పరిగణించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తమ బాధ్యతను మరింత ఘనంగా నిర్వర్తించాలి. భూములపై %ఉూ% ఆధారిత సర్వే చేయాలి. ఆలయానికి చెందిన భూముల డిజిటల్ రికార్డును రూపొందించి పబ్లిక్ డొమెయిన్‌లో ఉంచాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర చర్చల ద్వారా రామాలయ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక ఒప్పందానికి రావాలి. భూ ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ఓ రమాదేవి వంటి ధైర్యవంతులైన అధికారులపై జరిగిన దాడులను తీవ్రంగా పరిగణించి న్యాయ పరమైన చర్యలు తీసుకోవాలి. అలాగే భక్తులు, పౌర సంఘాలు, హిందూ ధర్మ పరిరక్షణ సంస్థలు ఆలయ భూముల రక్షణకు ఒకటిగా నిలవాలి. భద్రాచల రామయ్య క్షేత్రం కేవలం ఒక పుణ్యస్థలం కాదు ం అది మన సంస్కృతికి ప్రతీక. అందుకే ఆ దేవాలయ భూముల్ని భద్రంగా కాపాడటం ప్రతి మనిషి ధర్మబాధ్యత. భక్తులు ధర్మాన్ని కాపాడితేనే రామ. రాజ్యం స్ఫూర్తి నిలబడుతుంది. ఈ ఓ రమాదేవిపై దాడికి న్యాయం జరిగే వరకూ, రామాలయ భూములు పూర్తి స్థాయిలో స్వాధీనం అయ్యే వరకూ ఈ పోరాటం నిలకడగా కొనసాగాలి. రాముడి భూమిని కాపాడటం రామభక్తుని పుణ్య కార్యం. అది ఒక్క అధికారిణి ఒంటరి పోరాటంగా మిగల కూడదు. భద్రాచల రామాలయ భూముల ఆక్రమణకు పాల్పడిన వారిని చట్టం ద్వారా శిక్షించి, భక్తుల ధర్మాన్ని నిలుపుదల చేయాలి. ధర్మమే గెలవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# డెంగీ పంజా

కరీంనగర్ : కరీంనగర్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు తీవ్ర జ్వరంతో బాధపడగా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డెంగీ పాజిటివ్ రావడంతో వారం కిందట చికిత్స తీసుకున్నారు. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మహిళ జ్వరంతో బాధపడుతుండగా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏటా వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలడం సర్వసాధారణం. ప్రస్తుతం జిల్లాలో సాధారణ జ్వరాలతో పాటు డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటి వరకు ఎనిమిది మందికి నిర్ధారణ అయింది. వారిలో ఇద్దరు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నలుగురు ప్రభుత్వ, ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. జ్వరాల బారిన పడిన వారి సంఖ్య పెరుగుతుండటంతో జిలావ్యాప్తంగా ఆందోళన నెలకొంది.

**ఆయా ప్రాంతాల్లో ఇలా..**

మానకొండూర్ నియోజకవర్గ పరిధిలో అన్నారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ముగ్గురు డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అధికారులు



అల్ఫాసైఫర్ మెత్రిన్ అనే దోమల మందును మంగళవారం పిచికారీ చేయించారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో ఒకరు, కరీంనగర్‌లోని లక్ష్మీనగర్, సంతోష్‌నగర్, మెహర్‌నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో మలేరియా వైద్య విభాగం అధికారులు జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో సర్వే చేసి వైద్య శిబిరాలు నిర్వహించారు. పలు రకాల దోమల మందులను పిచికారీ చేయిస్తూ ఇళ్లు, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నారు. సర్వే నిర్వహించి సాధారణ జ్వర బాధితులకు మందులు అందజేస్తున్నట్లు మలేరియా విభాగం అధికారులు తెలిపారు.

**జాగ్రత్తగా ఉండాలి**

వర్షాకాలంలో నీరు నిల్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లార్వాలు పెరగకుండా దోమలమందు పిచికారీ చేయిస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోతే చర్యలు తీసుకుంటాం. డెంగీ పాజిటివ్ వస్తే కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందిస్తాం. వసతి గృహాల్లోనూ వైద్య శిబిరాలు, జ్వర సర్వేలు చేస్తున్నాం. జ్వరాలు ఎక్కువైతే వెంటనే ఆశా కార్యకర్తలకు లేదా ఏఎన్ఎంలకు సమాచారం ఇవ్వాలి. నిర్లక్ష్యం వహించకుండా సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కరీంనగర్

# నిర్లక్ష్యపు నీడలో వైకుంఠధామాలు

ధర్మపురి : జిల్లాలో పలు వైకుంఠధామాలు నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్నాయి. గోదావరి తీరంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికలను ఉపాధిహామీ, ఇతర నిధులతో నిర్మించారు. అయితే గోదావరి ఉప్పొంగినప్పుడల్లా క్రమంగా ఇవి నీటిలో మునిగిపోవడం.. మరోవైపు స్థానిక పురపాలక, పంచాయతీ సిబ్బంది నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. ధర్మపురి, బీర్‌పూర్, వెల్గటూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో గోదావరి తీరానే నిర్మించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వరదలతో నామరూపాల్లేకుండా..**

గోదావరి తీరంలోనే శ్మశాన వాటికలను నిర్మించడం ఇంజినీర్ల లోపభూయిష్టమైన విధానమేనని భావిస్తున్నారు. ఏటా వరదలతో నామరూపాల్లేకుండా పోతున్నాయి. కొంతదూరంలో నిర్మించాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు విమర్శిస్తున్నారు. దమ్మన్నపేట, ఆరెపల్లి తదితర గ్రామాల్లో శ్మశాన వాటికలు వరదలకు అధ్వానస్థితికి చేరాయి. వీటిని మరమ్మతు చేయాలనే ఆలోచన అధికారులు చేయడంలేదు. రూ.కోటి వెచ్చించి ఆధునిక వసతులతో ధర్మపురి గోదావరి తీరంలో నిర్మించిన వైకుంఠధామం అస్తవ్యస్తంగా తయారైంది. కనీస సదుపాయాలు కరవయ్యాయి. ఆధునిక వసతులతో నిర్మించిన నాలుగు గదుల తలుపులను ఆకతాయిలు పగులగొట్టారు. బోరు వేయించినా మోటారు ఏర్పాటు చేయలేదు. ఎటువైపు చూసినా పిచ్చి మొక్కలు, ధ్వంసమైన తలుపులు కనిపిస్తున్నాయి. మందుబాబులకు అడ్డాగా మారగా.. ప్రహరీ దెబ్బతింది.

**అన్నిచోట్లా అరకొర వసతులే**

జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాల్లోని శ్మశాన వాటికలు అరకొర వసతులతో నెట్టుకొస్తున్నాయి. మెట్‌పల్లిలో ప్రహరీ, బోరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ నీటిపై ఆధార పడాల్సివస్తోంది. కోరుట్ల, గొల్లపల్లి, వెల్గటూర్ తదితర ప్రాంతాల్లోని వాటికి వసతులు కరవయ్యాయి. ధర్మపురి వైకుంఠధామంపై పురపాలక కమిషనర్ శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా.. త్వరలోనే పరిశుభ్రత పనులు చేపట్టి వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు.

# అంచుల్లో కోతలు.. నిలవని నీళ్లు

కోదాడ : భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం నదులపై చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టింది. ఈ నిర్మాణాలు నాణ్యతగా లేకపోవడంతో అంచులు కోతకు గురయ్యాయి. దీంతో చెక్ డ్యాం నిర్మించినా నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. జిల్లాలో ప్రధానమైన మూసీ, పాలేరు నదులపై ఉన్న చెక్ డ్యాంల అంచులు కోతకు గురయ్యాయి. జిల్లా నుంచి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండటంతో అసంపూర్తి చెక్ డ్యాం నిర్మాణాల్లో కదలిక వచ్చే అవకాశం ఉంది. వినియోగంలోకి రాక..

2019–20 సంవత్సరంలో చెక్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభం కాగా, చాలా ప్రాంతాల్లో పూర్తి కాలేదు. అంతలోనే అంచులు కొట్టుకుపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటికి నిధులు కేటాయించకపోవడంతో మిగతా పనులు పూర్తి కాలేదు. పాలేరు వాగుపై అనంతగిరి మండలంలోని శాంతినగర్ సమీపంలో సుమారు రూ.3 కోట్లు, పాలారం గ్రామ సమీపంలో సుమారు రూ.2.80 కోట్లు, గొండ్రియాల సమీపంలో రూ.2.34 కోట్లు, కోదాడ రూరల్ పరిధిలోని రెడ్లకుంట పరిధిలో రూ.2.70 కోట్లతో, మోతె మండలంలో మరో రెండు చెక్‌డ్యాంలు నిర్మించారు. మూసీనదిపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండలం ఎల్లారం, సోమారం గ్రామ పరిధిలో, పాలకవీడు మండలంలోని రాఘవాపురం, శూన్యపహాడ్, మూసిఒడ్డుసింగారం, మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం, గుర్రంపోడుతండా సమీపంలో నిర్మించిన చెక్ డ్యాంల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# అడిగేదెవరూ.. అంతా మా ఇష్టం



కరీంనగర్ : కరీంనగర్ నగరంతోపాటు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో నివాసిత, వాణిజ్య భవనాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మించుకుంటున్నారు. భవన అనుమతుల దరఖాస్తు ప్లాన్‌కు, వాస్తవ నిర్మాణానికి పొంతన ఉండటం లేదు. ఎక్కడ చూసినా అనుమతి ఒక రకంగా.. నిర్మాణం మరోలా ఉంటున్నప్పటికీ పట్టించుకునేవారే లేరు. నివాసిత అనుమతులు తీసుకొని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భవనాలు అనేకమున్నాయి. భవిష్యత్తు అవసరాలు, రద్దీని పరిగణనలోకి తీసుకొని నిర్మించుకోవాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**జోరుగా అక్రమ అంతస్తులు**

అనుమతి ప్రకారం భవన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. నిబంధనలు పట్టించుకోకుండా అదనంగా అంతస్తులు నిర్మించుకుంటున్నారు. జీ౦1, జీ౦2కు అనుమతి తీసుకొని రెండు, మూడు ఫ్లోర్లు నిర్మించుకుంటున్న భవనాల సంఖ్య ఇటీవల పెరిగింది. ఇలాంటి వాటిపై ఫిర్యాదులు వచ్చినా కాలయాపన చేస్తున్నారు. నోటీసులు ఇస్తున్నట్లుగా చెబుతున్నప్పటికి ఆ ఫిర్యాదు పరిష్కారం అయ్యేసరికి నిర్మాణం పూర్తవుతోంది.

**సెట్‌బ్యాక్ స్థలమేది?**

నగరంలో వాహనాలు విపరీతంగా పెరిగాయి. దానికి తగ్గట్టుగా రహదారుల విస్తరణ మాత్రం జరగడం లేదు. దీనికి తోడుగా కొత్తగా వ్యాపార, వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేస్తుండటం, పార్కింగ్ కోసం స్థలం వదలకుండా నిర్మిస్తున్నారు. అనుమతి పత్రంలో చూపినట్లు భవనం చుట్టూ సెట్‌బ్యాక్ కోసం స్థలం వదలాల్సి ఉండగా వదలడం లేదు. అంతర్గత వీధుల్లో పరిశీలిస్తే ఒక్కో డివిజన్‌లో ఆరు నెలలుగా నిర్మించిన వాటిల్లో పాతిక సంఖ్యలో సెట్‌బ్యాక్ లేని నిర్మాణాలుంటున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. కొన్నిచోట్ల ప్రశ్నించిన ఇరుగు, పొరుగువారిని బెదిరింపులకు గురి చేస్తున్నారు.

**నిబంధనలు పాటించాల్సిందే**

నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థులు 32 భవనాలు ఉన్నట్లు గుర్తించాం. వీటిని కూల్చివేస్తాం. ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అనుమతుల సమయంలో యజమానులకు వివరించేలా అవగాహన కల్పిస్తాం. లేదంటే అనుమతి ఎవరి ద్వారా తీసుకున్నారో వారి లైసెన్స్ రద్దు చేస్తాం. బషీరుద్దీన్, డీసీపీ, కరీంనగర్ నగరపాలిక

# అతివల హితం.. నగదు రహితం



పెద్దపల్లి : స్త్రీనిధిలో రుణాలు పొందిన మహిళలు వాయిదా తీరేవరకు ప్రతినెలా కిస్తీలు చెల్లిస్తున్నారు. తీరా బ్యాంకులో చూస్తే సంఘాలు, గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు జమ చేయడంలేదు. రుణ వాయిదాల చెల్లింపులో సభ్యులు కట్టిన డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఇది ఒక సంఘానిది కాదు. ప్రతి జిల్లాలో ఈ సమస్య ఏటికేటా పెరిగిపోవడంతో మహిళలు నష్టపోతున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం డిజిటల్ లావాదేవీల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తోంది. ప్రయోగాత్మక గ్రామైఖ్య సంఘాల్లో ఈ–పోస్ యంత్రాలు సరఫరా చేయడంతో.. నగదు రహిత సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

**మూడు జిల్లాల్లో ఈ–పోస్ యంత్రాలు**

ఉమ్మడి జిల్లాలో 1955 గ్రామైఖ్య సంఘాలుండగా 50,157 స్వశక్తి సంఘాల్లో 5,55,242 మంది సభ్యులున్నారు. ఏటా రూ.కోట్లలో రుణాలు పంపిణీ చేస్తున్నారు. చాలా చోట్ల అక్రమాలు జరగడంతో నగదు రహిత లావాదేవీలను వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రయోగాత్మకంగా అత్యధిక లావాదేవీలున్న గ్రామైఖ్య సంఘాలకు ఈ–పోస్ యంత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పెద్దపల్లి మినహా మిగిలిన మూడు జిల్లాల్లోని 456 గ్రామైఖ్య సంఘాలకు యంత్రాలిచ్చారు. వీటి నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం మిగిలిన సంఘాలకు పంపిణీ చేయనున్నారు.

**క్యూఆర్ కోడ్‌తో చెల్లింపులు**

గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులకు ఉచితంగా ఈ–పోస్ యంత్రాలను ఇచ్చారు. వీవో పరిధిలో ఉన్న సంఘాల నెల వాయిదాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతుంటాయి. బ్యాంకర్ల సహకారంతో ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఒక సంఘానికి సంబంధించి కోడ్ నమోదు చేస్తే నెల బకాయిలు ప్రత్యక్షమవుతాయి. సభ్యుల బకాయిల వివరాలు నమోదు చేసిన వెంటనే చెల్లింపులకు క్యూఆర్ కోడ్ ఆధారంగా ఫోన్‌లో స్కాన్ చేస్తే.. వెంటనే రశీదు వస్తుంది.

**జిల్లాల వారీగా యంత్రాలు**

జగిత్యాల: 183 సిరిసిల్ల: 180
కరీంనగర్: 93

# మురుగు శుద్ధి ప్లాంట్ నిర్మాణం ఎప్పుడో?

వేములవాడ : స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద మున్సిపాలిటీలల్లో భూగర్భ మురుగు కాలువల నిర్మాణంతోపాటు మురుగు నీటిని శుద్ధి. చేసేందుకు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వేములవాడ మున్సిపాలిటీకి రూ.27 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఆరు నెలలు గడిచినా పనులు టెండర్ దశలోనే ఉన్నాయి.

**ముందుకు సాగని మళ్లింపు పనులు**


గుడి చెరువులో, మూలవాగులో పట్టణంలోని మురుగునీరు కలవకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. ఇందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.9 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో న్యూ అర్బన్ కాలనీ నుంచి భగవంతరావునగర్, గుడి చెరువు ఎఫ్‌టీఎల్ నుంచి ఆలయ పార్కింగ్ నుంచి మొదటి బైపాస్ రోడ్డు వరకు మురుగునీటి మళ్లింపు పనులు చేపట్టారు. ఈ పనులు కొంతే పూర్తయ్యాయి. మరోవైపు మూలవాగు బైపాస్ రహదారుల మూలవాగు వెంబడి, మహాలక్ష్మి వీధి నుంచి సంకెపల్లి శివారు వరకు మురుగునీటి మళ్లింపు పైపులైన్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ రెండు మురుగునీటి మళ్లింపు పనులు పూర్తయితే పరిస్థితి మెరుగుపడుతుంది.

**నీటి వనరులు కలుషితం**

వేములవాడలోని కట్టుకాలువ, కోరుట్ల బస్టాప్, న్యూ అర్బన్‌కాలనీ, భగవంతరావు, చెక్కపల్లి రోడ్డు, తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరంతా భీమేశ్వర కాలువ ద్వారా వెళ్లి గుడి చెరువులో కలుస్తోంది. రాజన్న ఆలయ ప్రాంతం, బద్ది పోచమ్మ, సుభాష్‌నగర్, ఓల్డ్ అర్బన్ కాలనీ, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లోని మురుగు నీరు నేరుగా మూలవాగులో కలుస్తుండగా ముఖ్యమైన నీటి వనరులు కలుషితం అవుతున్నాయి.

**రూ.27 కోట్లు మంజూరైనా..**

స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద మురుగునీటి శుద్ధి. చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.27 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ ఎస్టీపీ



నిర్మాణానికి నోచుకోవడం లేదు. మహాలక్ష్మి వీధి ప్రాంతంలోని సంకెపల్లి శివారులో ఎస్టీపీ నిర్మాణానికి ప్రతిపాదించారు.

పట్టణంలో రెండువైపులా ప్రవహించే మురుగునీరు మహాలక్ష్మి వీధి నుంచి పైపులైన్ ద్వారా సంకెపల్లిలోని ఏర్పాటు కానున్న ఎస్టీపీకి కలుపనున్నారు. మురుగునీటి శుద్ధి. నిర్వహణను గుర్తింపు పొందిన ఏజెన్సీకి అప్పగించనున్నారు. మురుగునీటిని ఎస్టీపీలో శుద్ధి. చేసి తిరిగి వదిలే వరకు నిర్వహణ బాధ్యతను సంబంధిత ఏజెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఎస్టీపీ నిర్మాణాన్ని త్వరిత గతిన చేపడితే ప్రయోజనం చేకూరనుంది. మురుగునీటి మళ్లింపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. భగవంతరావునగర్ నుంచి వెళ్లే పైపులైన్ పనులు ప్రగతిలో ఉన్నాయని, మూలవాగు వైపు మళ్లింపు పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు

# కోత కాన్పులే అధికం

జగిత్యాల : సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఓవైపు ప్రభుత్వం చెబుతుండగా జిల్లాలో శస్త్రచికిత్స కాన్పులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సిజేరియన్లలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వ ఆస్పత్రులు ప్రైవేటుతో పోటీ పడుతున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 31 శాతం, ప్రైవేటులో కేవలం 14 శాతమే సాధారణ ప్రసవాలు. ప్రస్తుత సంవత్సరంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ల శాతం 88కి పెరిగింది.

**అవగాహన కల్పిస్తే ప్రయోజనం**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. 2024–25లో 5,347 ప్రసవాలు జరగ్గా ప్రైవేటులో 6,661



జరిగాయి. సర్కారు దవాఖానాల్లో 1631 సాధారణ ప్రసవాలు, 3,716 సిజేరియన్లు. ప్రైవేటులో 960 సాధారణం, 5,801 శస్త్రచికిత్సలు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు, సిజేరియన్‌కు రూ.50–70 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది.

సాధారణ ప్రసవమైతే రెండు మూడు రోజుల తర్వాత పనులు చేసుకోవచ్చు శస్త్రచికిత్స జరిగితే నెలకు పైగా విశ్రాంతి అవసరం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కువగా డబ్బుల కోసమే సిజేరియన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రసవం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్న ఆర్ఎంపీలకు కనీసం 20 శాతానికి పైగా కమీషన్లు ముడుతున్నాయి. ఇక కొందరు తేదీ, ముహూర్తం కోసం సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తున్నారు. సాధారణ ప్రసవమైతే నొప్పి తట్టుకోలేరని గర్భిణుల బంధువులు శస్త్రచికిత్సకు వెళ్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు, కిట్‌ల పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోవడం ప్రసవాలు తగ్గడానికి ఓ కారణం.

**సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తాం**

సాధారణ ప్రసవం కావాలంటే గర్భిణులు మొదటి నుంచి ఆహారం, వ్యాయామంపై శ్రద్ధ చూపాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని, ప్రైవేటులో సిజేరియన్ల సంఖ్య తగ్గించాలని కలెక్టర్ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ మేరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నాం. డా.ఎం.జైపాల్‌రెడ్డి, జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి

# కేంద్ర కొలువు.. ప్రణాళికతో సులువు

మిర్యాలగూడ : ప్రభుత్వ ఉద్యోగం సాధించడం యువత కల. దీని కోసం నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి, కోదాడ వంటి పట్టణాల్లోని గ్రంథాలయాల్లో వందలాది మంది ఉద్యోగార్థులు పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు. అయితే వీరంతా కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసమే సన్నద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సైతం ఏటా నోటిఫికేషన్లు విడుదల అవుతున్నప్పటికీ ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. దీనికి ప్రధాన కారణం ఉద్యోగార్థులకు సరైన అవగాహన లేకపోవడమేనని, కొద్దిగా దృష్టి సారించి.. ప్రణాళికతో సన్నద్ధమైతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదని నిపుణులు చెబుతున్నారు.

**పలు విభాగాల్లో**



స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఆధ్వర్యంలో భర్తీ చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పలు విభాగాల్లో ఉంటాయి. డిగ్రీ విద్యార్హతతో కొన్ని, ఇంటర్, డిప్లొమా, పదో తరగతి విద్యార్హతలతో మరికొన్ని ఉద్యోగాలు ఉంటాయి. వీటిని సీజీఎల్, సీహెచ్ఎస్ఎల్, ఎంటీఎస్, జేఈ విభాగాలు ఉంటాయి.

సీజీఎల్: కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఉద్యోగాలు డిగ్రీ అర్హతతో ఉంటాయి. వీటిలో గ్రూప్–బీ, గ్రూప్–సీ ఉద్యోగాలు ఉంటాయి. గ్రూప్–బీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, సెంట్రల్ ఎ ఎక్సైజ్‌లో ఇన్‌స్పెక్టర్, సీబీఐ, ఎన్ఐఏ, నార్కోటిక్స్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఉద్యోగాలు ఉంటాయి.

సీహెచ్ఎస్ఎల్: కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఉద్యోగాలు ఇంటర్ విద్యార్హతతో ఉంటాయి. వీటిలో డివిజన్ క్లర్క్, పోస్టల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి ఉద్యోగాలు ఉంటాయి.

ఎంటీఎస్: మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (నాన్–టెక్నికల్) ఉద్యోగాలు పదోతరగతి విద్యార్హతతోనే ఉంటాయి. పలు విభాగాల్లో క్లర్క్, అటెండర్ స్థాయి ఉద్యోగాలు ఉంటాయి.

జేఈ: జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు డిప్లొమా, ఇంజినీరింగ్ విదార్హతతో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పలు సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు ఉంటాయి.

**తొలి ప్రయత్నంలో విజయం..**

– సన్నిధి సౌమ్యశ్రీ, సీబీఐ సబ్ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ.

మాది మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామం. అమ్మానాన్నలు సన్నిధి కోటయ్య–సునీత. అన్నయ్య సాయిచరణ్ లీగల్ అడ్వైజర్, అక్క రమ్యశ్రీ డాక్టర్. నేను పదో తరగతి పట్టణంలోనే చదివి 10 జీపీఏ సాధించాను. సీబీఐ అధికారి కావడమే లక్ష్యంగా ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లాను. ఇంటర్ ఎంపీసీలో 989 మార్కులు సాధించాను. సమీకృత సివిల్స్ కోచింగ్‌తో డిగ్రీ చదివి 94 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాను. డిగ్రీ అనంతరం ఎల్ఎల్‌బీలో చేరి ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షకు సన్నద్ధమయ్యాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ప్రణాళిక బద్ధంగా చదివి 2024లో తొలి ప్రయత్నంలోనే అఖిల భారత స్థాయిలో 2,758వ ర్యాంకు సాధించి..సీబీఐ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం దిల్లీలోని సీబీఐ అకాడమీలో శిక్షణ పొందుతున్నాను.

## వ్యర్థాల లెక్కలుంటేనే నివాసయోగ్యం

హైదరాబాద్: భవన నిర్మాణ వ్యర్థాలకు (సీ అండ్ డీ) ఇక లెక్క చెప్పాల్సిందే. ఆకాశహర్మ్యాలు కట్టేసి.. అక్కడ ఉత్పత్తయ్యే నిర్మాణ వ్యర్థాలతో సమీపంలోని చెరువులు, లోతట్టు ప్రాంతాలను పూడ్చేస్తామంటే ఇకపై కుదరదు. నిర్మాణ అనుమతి జారీ నాటి నుంచి పూర్తయ్యే వరకు రోజువారీ ఉత్పత్తయ్యే వ్యర్థాలను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని సీ అండ్ డీ కేంద్రాలకు తరలిస్తేనే సదరు భవనానికి నివాసయోగ్య పత్రం(ఓసీ) జారీ అవుతుంది. ఈ నిబంధనను తీసుకొచ్చేందుకు పురపాలకశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలు, రోడ్లు, మరమ్మతు కాంట్రాక్టుల్లోనూ నిబంధనను చేర్చేందుకు అధికారులు చర్చలు జరుపుతున్నారు.

**నగరంలో నాలుగు కేంద్రాలు..**సీ అండ్ డీ వ్యర్థాలతో నగరానికి అనేక రకాలుగా నష్టం జరుగుతోంది. చెరువులు, నాలాల ఆక్రమణలతో పాటు మూసీ నది పూడ్చివేత జరుగుతోంది. కొందరు రోడ్ల పక్కన పారబోస్తున్నారు. మరికొందరు ఖాళీ స్థలాలను డంపింగ్ యార్డులుగా మార్చుతున్నారు. వరదల వంటి విపత్తులు, భూ ఆక్రమణలు, గాలి కాలుష్యానికి దారి తీస్తున్న వ్యర్థాలకు చక్కని పరిష్కారాన్ని చూపుతూ.. నగరానికి నాలుగు వైపులా సీ అండ్ డీ నిర్వహణ కేంద్రాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. జీడిమెట్ల, నాగోల్ ఫతుల్లాగూడ, శంషాబాద్, తూముకుంటలో ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు 500టన్నుల వ్యర్థాలను నిర్వహించవచ్చు. కాంక్రీటు, బండరాళ్లు, ఇతర వ్యర్థాలను యంత్రంలో వేసి.. ఇసుక, కంకర, మట్టి, ఇనుము,



తదితర వస్తువులను వేరు చేస్తాయి. వాటిని చిన్న నిర్మాణ పనుల్లో ఉపయోగించేందుకు పౌరులు కొనుగోలు చేస్తారు.

**నిబంధన ఉద్దేశం..**అండ్ డీ కేంద్రాలకు 90శాతం నిర్మాణ సంస్థలు వ్యర్థాలను తరలి ంచట్లేదు. ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇస్తుండగా.. వాళు ఖాళీ స్థలాల్లో, చెరువులు, నాలాల్లో పడేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే నిర్మాణ అనుమతుల జారీలో కొత్త నిబంధనను చేర్చాల్సిందేనని పురపాలకశాఖ నిర్ణయానికొచ్చింది. గుర్తింపు పొందిన కేంద్రాలకు వ్యర్థాలను ఇచ్చినట్టు రసీదులు చూపితేనే.. భవనానికి ఓసీ ఇచ్చేట్టు నిబంధన రూపొందించారు. రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని అమల్లోకి తేవాలా లేదా రాజధాని ప్రాంతానికి వర్తింపజేయాలా అని సమాలోచనలు చేస్తున్నారు.

## కొట్టుకుపోయి.. రాకపోకలు ఆగిపోయి..

తాండూరు : తాండూరు మండలంలో భారీ వర్షం కురిసింది. బెల్కటూరు వద్ద వంతెన నిర్మాణం కొనసాగుతుండగా పక్కనే నిర్మించిన తాత్కాలిక రహదారి వరదకు కొట్టుకుపోయింది. దీంతో కరణ్‌కోట, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టిగణాపూర్, బెల్కటూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. అదానీ, సీసీఐ సిమెంటు కర్మాగారాల లారీలు, టిప్పర్లు కి.మీ.ల పొడవునా ఆగిపోయాయి. వరద వద్ద పోలీసులు గస్తీ నిర్వహించి అటువైపు వెళ్లకుండా అవగాహన కల్పించారు. సాయంత్రం రాకపోకలను పునరుద్ధరించారు. కొత్లాపూర్‌లో ఇళ్లలోకి వరద చేరి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.

**వంతెన కష్టాలు:** బొంరాస్‌పేట మండల కేంద్రం నుంచి ధారూరు మండలం నాగారం వరకు రూ.23 కోట్లతో రెండు వరుసల రహదారి నిర్మిస్తున్నారు. మదన్‌పల్లితండా సమీపంలో చిన్నవాగు ప్రాజెక్టు అలుగు వాగుపై రూ.4.8 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు. రాకపోకలకు వీలుగా పక్కన తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించారు. పైపులు వేయకుండా నిర్మించడంతో రాత్రి కురిసిన వర్షానికి తెగిపోయింది. మదన్‌పల్లి, మదన్‌పల్లితండాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని పాఠశాలకు రావాలంటే చుట్టూ తిరిగి వేరే మార్గంలో వస్తున్నారు. మహంతిపూర్ వద్ద రూ.4 కోట్లతో వంతెన నిర్మిస్తున్న కారణంగా, పక్కనే తాత్కాలిక రహదారిని నిర్మించారు. రాత్రి వరద రావడంతో రోడ్డు తెగిపోయింది. గ్రామస్థులు మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డిని వివరణ కోరగా వరదలకు తాత్కాలిక రహదారులు తెగిపోయాయని మళ్లీ నిర్మిస్తామన్నారు.

## నగరం.. జలదిగ్బంధం

కరీంనగర్ : ఎటు చూసినా జలమే.. రోడ్లు చెరువులయ్యాయి. మొదలైన వాన గంటన్నరపాటు ఏకధాటిగా కురవడంతో కరీంనగర్ జిల్లా కేంద్రం అతలాకుతలమైంది. ప్రధాన రహదారులపై నీరు చేరడంతోపాటు పలు కాలనీలు నీట మునిగాయి. రాత్రి 7 గంటల తరువాత మరోసారి భారీ వర్షం కురవడంతో మళ్లీ రహదారులపై నీరు నిలిచింది.రాంనగర్, పద్మానగర్, గీతాభవన్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, శివ థియేటర్, విద్యానగర్, హాస్పిటల్స్ వీధి, కమాన్ ప్రాంతం, అలుగునూర్, అల్కపురి కాలనీల్లోని రహదారులు కనిపించని విధంగా నీళ్లు చేరాయి. నగరపాలక శానిటేషన్, డీఆర్ఎఫ్ అత్యవసర బృందాలు, పోలీసులు రంగంలోకి దిగి నీటిని మళ్లించారు.



కరీంనగర్ కలెక్టరేట్: భారీ వర్షాల నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల నేపథ్యంలో సహాయం కోసం 0878-2997247 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ సహాయం కోసం 98499 06694కు ఫోన్ చేయాలని తెలిపారు. వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని, పంట నష్టం వాటిల్లలేదని వివరించారు.

కంట్రోల్ రూం నంబర్లు 0878-2997247, 98499 06694

వర్షపాతం..(సెం.మీ) కలెక్టరేట్ 7.0 దుర్శేడ్ 6.1 జమ్మికుంట 7.8 కొత్తపల్లి 6.4 చింతకుంట 6.6 వీణవంక 6.8 సైదాపూర్ 6.8 మానకొండూర్ 7.5 ఆసిఫ్‌నగర్ 5.5

# జేబుకు చిల్లు.. సౌలత్‌లు నిల్





హైదరాబాద్ : వరుస ఛార్జీల పెంపుపై నగర ప్రయాణికులు గుర్రుగా ఉన్నారు. అటు ఆర్టీసీ బస్‌పాస్, టీ-24 (డే పాస్)తో పాటు మెట్రోరైల్ ఛార్జీలు పెరగడంతో అదనపు భారం పడుతోందంటూ సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదుపాయాల కల్పనపై దృష్టి సారించకుండా ఇలా ఛార్జీలు పెంచడమేంటని ప్రశ్నిస్తున్నారు. 'లాస్ట్‌మైల్ కనెక్టివిటీ', ఆర్టీసీ బస్‌షెల్టర్ల నిర్మాణం, అదనపు బస్సుల కొనుగోళ్లు, కొత్తమార్గాల్లో బస్సులను ప్రవేశపెట్టడం, పీక్ అవర్స్‌లో రద్దీ లేకుండా చూడటం తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఛార్జీల పెంపు నగరంలోని సుమారు 7.5లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడుతుండగా ప్రయాస తగ్గించే మార్గాలను అన్వేషించాలని ప్రయాణికుల సంఘాలు కోరుతున్నాయి.

**ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారమేదీ..?:** గ్రేటర్‌లో 2800 బస్సుల్లో నిత్యం 20 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం 1370 బస్‌షెల్టర్లు ఉండగా.. మరో 400కుపైగా ప్రాంతాల్లో కొత్త షెల్టర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో 120 షెల్టర్లు ఇప్పటికిప్పుడే నిర్మాణం చేపట్టాలి. అవి కేవలం ప్రతిపాదనలకే పరిమితమైపోయాయి. ప్రయాణికులతో నిమిత్తం లేకుండా కేవలం వాణిజ్య ప్రకటనలు వచ్చే చోట షెల్టర్లు నిర్మించడంపై విమర్శలు వస్తున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో పరిమితంగా బస్సులు నడపటంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు మరిన్ని బస్సులు నడపాలని, కొత్తమార్గాల్లో బస్సులు వేయాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

**లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఎప్పుడు..?**
గ్రేటర్ పరిధిలోని చాలా మెట్రోస్టేషన్లలో లాస్ట్‌మైల్ కనెక్టివిటీ సమస్య వేధిస్తోంది. ఎల్బీనగర్, మియాపూర్, మెట్టుగూడ, హైటెక్‌సిటీ, రాయదుర్గం, దుర్గంచెరువు స్టేషన్లకు మినహా ఇతర స్టేషన్ల నుంచి గమ్యస్థానాలకు చేరుకునే సదుపాయాలు లేవు. గతంలో ఆర్టీసీ షటిల్ బస్సులను నడిపినా కొన్నిస్టేషన్లకే అవి పరిమితమయ్యాయి. కొన్ని చోట్ల కార్యాలయాలకు చెందిన వాహనాలు నడుపుతుండగా ఇంకొన్ని చోట్ల ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతున్నారు. ఇలాంటి సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# పూజల పేరిట గృహిణులకు టోకరా



హైదరాబాద్ : నూరేళ్లకోసారి వచ్చే అమావాస్య ఇది.. ఈ సమయంలో ప్రత్యేక పూజలు చేస్తే ఇంట్లో శుభం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటన చూసిన ఓ గృహిణి వాట్సప్ ద్వారా నిర్వాహకులను సంప్రదించింది. ఆమె నుంచి కుటుంబ వివరాలు సేకరించి, రిజిస్ట్రేషన్ తదితర పేర్లతో రూ.40వేలు వసూలు చేశారు. రోజులు గడుస్తున్నా స్పందన రాకపోవటంతో మోసపోయినట్లు ఆమె గ్రహించారు.

ఈ నాణెం మీ వద్ద ఉంటే అద్భుత శక్తులు సొంతం చేసుకోవచ్చు. యూట్యూబ్‌లో వీడియో చూసిన ప్రైవేటు ఉద్యోగి రూ.లక్ష చెల్లించాడు. విదేశాల నుంచి తెప్పించేందుకు అదనంగా రూ.25వేలు డిమాండ్ చేయటంతో ఇదంతా మాయగాళ్ల పనిగా గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలో ఇటీవల ఈ తరహా మోసాలు పెరుగుతున్నాయి. అంతర్జాలం, సామాజిక మాధ్యమాల్లో ఆధ్యాత్మిక అంశాలు వెతికే వారు మోసగాళ్ల వలకు చిక్కుతున్నారు. కొన్నిసార్లు వాట్సప్ ద్వారా బురిడీ కొట్టిస్తున్నారు. దేశంలోని ప్రముఖ ఆలయాల్లో పూజలు, వ్రతాలు, ప్రసాదాల పేరిట సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. కుటుంబ సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం చూపుతామంటూ భరోసానిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్‌లను రూపొందించి కుచ్చుటోపీ పెడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకునే ప్రకటనలతో అందినంత దోచుకుంటున్నారు. పెద్దమొత్తంలో సొమ్ము పోయినప్పుడు మాత్రమే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. రూ.2-3వేల లోపు చెల్లించిన వారు ఠాణా చుట్టూ తిరగాల్సి వస్తోందనే ఉద్దేశంతో మిన్నకుండిపోతున్నారు. ఈ తరహా మోసాల బారిన పడుతున్న వారిలో అధికశాతం గృహిణులే ఉంటున్నారు.

**ఫిర్యాదు చేస్తే మేలు..**
దేశంలోని ప్రముఖ ఆలయాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామంటూ నమ్మకం కలిగిస్తున్నారు. పిల్లల వివాహాలు, విదేశీయానం, ఉన్నత చదువులకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు పరిష్కారం చూపుతామంటూ వల విసురుతున్నారు. అన్నదానం చేసేందుకు సహకరించమంటూ బుట్టలో పడేస్తున్నారు. ప్రార్థన మందిరాలు నిర్మించేందుకు విరాళాలు సేకరిస్తున్నామని నమ్మించి ఇచ్చినంత కాజేస్తున్నారు. మోసపోతే టోల్‌ఫ్రీ 1930కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# కసరత్తుకు కష్టాలు!



కరీంనగర్ : నగర, పురపాలికల్లోని ప్రజలందరికీ ఆరోగ్యం కల్పించాలనే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాలు, పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వీటికి మంచి ఆదరణ లభించింది. పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు నిత్యం వీటిని ఉపయోగించుకుంటున్నారు. ప్రతి చోట పదికిపైగా వివిధ రకాల వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం వీటి నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల వ్యాయామ పరికరాలు పాడైపోతూ మూలన పడుతున్నాయి.

**పట్టించుకునే వారెవరు?**
ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత పుర, నగరపాలక అధికారులు వాటి నిర్వహణ విస్మరించారు. 2018లో ఏర్పాటు చేసినవి పూర్తిగా చెడిపోగా కనీస మరమ్మతులు చేయకుండా వదిలేశారు. 2021-22లో కొనుగోలు చేసిన పరికరాలకు రెండేళ్ల వరకు సదరు ఏజెన్సీ వారు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. వారు పట్టించుకోకపోవడంతో పరికరాలు విరిగినా.. ప్రమాదకరంగా ఉన్నా మరమ్మతులు చేసే వారు కరవయ్యారు.

కొత్తగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన చోట సిమెంట్ ఫ్లోరింగ్ కింద రబ్బర్ షీట్లు వేశారు. వాటిని గమ్‌తో అతికించడంతో కొన్నాళ్లకే అవి ఊడిపోయాయి. వర్షం పడితే పైకి తేలుతున్నాయి. వీటి వల్ల విమర్శలు రావడంతో అధికారులు మెత్తని టైల్స్ వేయడం ప్రారంభించారు.

**ప్రస్తుత పరిస్థితి ఇలా..**
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో రూ.5.50 కోట్లతో మొత్తం 60 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయగా అందులో అయిదు చోట్ల పాత పరికరాలు పని చేయడం లేదు.

హుజూరాబాద్ పట్టణంలో రూ.25 లక్షలతో బోర్నపల్లి, ఇప్పల నర్సింగాపూర్, జూనియర్ కళాశాల మైదానం, మోడల్ చెరువు దగ్గర, గణేశ్‌నగర్‌లో మొత్తం ఆరు చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో రెండు పని చేయడం లేదు.

జమ్మికుంటలో నాలుగేళ్ల కిందట అయిదు ఏర్పాటు చేయగా కొన్ని చోట్ల పరికరాలు పని చేయడం లేదు. ఫ్లోరింగ్ మ్యాట్లు ఊడిపోవడంతో వాటిని తొలగించారు. గడ్డి పెరిగి ఇబ్బందికరంగా మారుతోంది.

సిరిసిల్లలో మొత్తం 17 ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. రూ.6 లక్షలతో ఒక్కోటి ఏర్పాటు చేశారు. కార్గిల్ లేక్, పద్మనగర్ పార్కు వద్ద ఉన్న జిమ్ పరికరాలు మరమ్మతులు లేక మొరాయిస్తున్నాయి.

పరిశీలించిన పుర, నగరపాలికలు : 9
మొత్తం ఓపెన్ జిమ్‌లు : 112
కసరత్తుకు అనుకూలంగా లేనివి : 26

## నక్షత్ర శోధనకు నిర్లక్ష్య గ్రహణం

అమీర్‌పేట : ఎంతో ప్రాధాన్యం కలిగిన అమీర్‌పేటలోని నిజామియా అబ్జర్వేటరీ ప్రాంగణం అధ్వాన స్థితికి చేరింది. నక్షత్రాల అధ్యయనం, ఖగోళ రహస్యాలు, గ్రహగతుల తీరును తెలుసుకునేందుకు 1909లో ఏర్పాటు చేసిన ఈ అబ్జర్వేటరీని పరిరక్షిస్తామని గతంలో అధికారులు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఇందుకు అప్పట్లో పరిశోధనల కోసం ప్రస్తుత సెంటర్ ఫర్ సోషల్ ఎకనామిక్ స్టడీస్(సెస్) ప్రాంగణంలో టెలిస్కోపుల కోసం నిర్మించిన రెండు డోమ్‌లే సజీవ సాక్ష్యం. వీటిని చారిత్రక సంపదగా గుర్తించి పరిరక్షించాల్సిన అధికారులు గాలికొదిలేశారు. ఈ అబ్జర్వేటరీని 1969లో అమీర్‌పేట నుంచి జపాల్ రంగాపూర్ గ్రామానికి తరలించారు. అనంతరం ఈ అబ్జర్వేటరీ మూతపడింది. దీనిని పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు చేసిన అధికారులు అమీర్‌పేటలోని నిజామియా అబ్జర్వేటరీ పరిరక్షణను విస్మరించారు.

**నిజాం హయాంలోనే..** 1907లో ఖగోళ రహస్యాలు, నక్షత్రాల అధ్యయ



నం కోసం నిజాం సర్కారు అమీర్‌పేట, బేగంపేట, పంజాగుట్టకు సమీపంలో సీఎం క్యాంపు కార్యాలయం వెనుక 20 ఎకరాల స్థలాన్ని సేకరించింది. నిజామియా అబ్జర్వేటరీ ద్వారా పరిశోధనలకు శ్రీకారం చుట్టారు. ఓయూ ఆధ్వర్యంలో నక్షత్ర పరిశోధనలు సాగాయి. ఇక్కడి రెండు భారీ టెలిస్కోపుల ద్వారా సుమారు 4 లక్షల వరకు నక్షత్రాలను అధ్యయనం చేశారు. తర్వాత అబ్జర్వేటరీ తరలిపోయినా అమీర్‌పేటలో డోమ్‌లు, పరిశోధనల కోసం నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరలేదు. ఈ ప్రాంతాన్ని చారిత్రక సంపదగా గుర్తించారు.

**నిధులు కేటాయించినా..**
నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్‌గా పనిచేసిన ఈ ప్రాంతంలో సెస్ (సామాజిక, ఆర్థిక అధ్యయన కేంద్రం), జెనిటిక్ ఆసుపత్రులు ఏర్పడ్డాయి. అనంతరం నిజామియా అబ్జర్వేటరీ ప్రాంగణాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టారు. చారిత్రక ప్రాధాన్యం కల ప్రాంతంగా హెచ్ఎండీఏ గుర్తించడంతో శిథిలావస్థకు చేరిన డోమ్‌లు, మరో భవనానికి సెస్ మరమ్మతులు చేయించారు. ఇందుకు రూ.30 లక్షలు కేటాయించారు. ఆరేళ్లు అవుతున్నా ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడంతో ప్రస్తుతం ఉన్న డోమ్‌లు శిథిలావస్థకు చేరాయి. ఎవరికీ ప్రవేశం కల్పించడం లేదు.

## పచ్చని పండగొస్తోంది..!

నల్గొండ : పర్యావరణ పరిరక్షణలో.. జీవవైవిధ్యాన్ని కాపాడటంలో చెట్లు ప్రధానపాత్ర పోషిస్తాయి. ఆరోగ్యకరమైన తాజా గాలిని మానవాళికి అందించడమే కాకుండా సమయానుకూలంగా తగినంత వర్షాన్ని కురిపిస్తాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కనీసం 33 శాతం మేర అడవులు ఉండితీరాలని భారతీయ జాతీయ అటవీ విధాన పత్రం (1988) నిర్దేశించింది. కానీ జిల్లాలో అటవీ విస్తీర్ణం 9.57 శాతం మాత్రమే ఉంది. దీన్ని మరింత విస్తరింపజేయాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. మొక్కలు నాటడమనేది ఎవరి పనో కాదు.. మన విధి. ఎక్కడ పచ్చదనంతో ప్రకృతి హర్షిస్తుందో అక్కడ వర్షం వరిస్తుంది.

**అంతా సిద్ధం**
జిల్లాలో 11 విడత వన మహోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేశారు. గుంతలు తీసి సిద్ధంగా ఉన్న గ్రామాల్లో వీటిని నాటుతున్నారు. తెలంగాణ సర్కార్ ఊరూరా నర్సరీలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రకాలను పంపిణీ చేసేందుకు గ్రామ నర్సరీల ఏర్పాటుకు పంచాయతీ రాజ్ పటిష్ఠంగా ఏర్పాట్లు చేసింది. ప్రతి గ్రామంలో గ్రీన్ ప్లాన్ చేసి దాని ప్రకారంగా మొక్కలను పెంచారు. ఇప్పటికే గ్రామస్థులకు అవసరమైన వాటిని ఎంపిక చేసి గ్రామ నర్సరీల్లో సిద్ధం చేశారు. గృహ అవసరాలకు, రైతులకు ఉపయోగపడేవి, ఇతర ప్రాంతాల్లో నాటే వాటితో పాటు ఇతర లాభదాయకమైన 40 రకాల మొక్కలను పెంచారు. ఈ ఏడాది జిల్లాలో 68.708 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో గత పది విడతల్లో 3.24 కోట్ల మొక్కలను నాటారు.

**చట్టబద్ధమైన పని..**
తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం మొక్కల పెంపకం అనేది చట్టబద్ధమైన పని. పంచాయతీలో నాటిన ప్రతి మొక్కను బతికించాల్సి ఉంది. కొత్త చట్టం ప్రకారం వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. గ్రామ కార్యదర్శి, సర్పంచులు బాగోగులు చూసుకోవాలి. మూడేళ్ల వ్యవధిలో 85 శాతం మొక్కలు బతికితేనే కార్యదర్శి కొలువు. సర్పంచి పదవికి భరోసా ఉంటుంది. లేకపోతే కార్యదర్శి ఉద్యోగం, సర్పంచి పదవిని కోల్పోవాల్సి వస్తోంది. నాటిన మొక్కలను సంరక్షించేందుకు సంరక్షకులను నియమించే అవకాశం ఉంది. వీరికి ఉపాధి పథకం కింద చెల్లింపులు చేయవచ్చు.

## నిరుపయోగం.. శ్రద్ధపెడితే వినియోగం

నాగార్జునసాగర్ పైలాన్ వద్ద ఉన్న దృశ్య కేంద్రం శిథిలావస్థకు చేరి పర్యాటకులకు దూరమవుతోంది. సాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రం కావడంతో నిత్యం దేశ విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అలా వచ్చిన వారికి సాగర్ గురించి వివరించడానికి డ్యాం అథారిటీ ప్రధాన జలాశయాన్ని ఆనుకొని దృశ్య కేంద్రం పేరుతో మినీ మ్యూజియం ఏర్పాటు చేసింది. దీనిలో జలాశయం, క్రస్టు గేట్లకు సంబంధించిన నమూనాలు, డ్యాం నిర్మాణానికి సంబంధించిన ఫొటోలను ఏర్పాటు చేశారు. దీనిని సందర్శించిన వారిందరికీ జలాశయం గురించి పూర్తిస్థాయిలో అవగాహన వస్తుంది. అంతే కాకుండా ఇది ప్రధాన డ్యాంకు సమీపంలో ఉండడంతో గేట్ల ద్వారా విడుదలవుతున్న నీటి సుందర దృశ్యం ఎంతో కనువిందు చేస్తుంది. మొదట్లో పర్యాటకశాఖ ఇక్కడ గైడ్ ఏర్పాటు చేసి వచ్చిన పర్యాటకులకు దీని గురించి వివరించే వారు. జలాశయానికి తీవ్రవాదుల ముప్పు ఉన్నదని డ్యాంతో పాటు మట్టి కట్టల పైకి ఎవరినీ అనుమతించడం లేదు. దృశ్య కేంద్రం కూడా ప్రధాన డ్యాంకు ఆనుకొని ఉండటంతో దీనిని కూడా సెఫ్టీ జోన్‌లోకి తీసుకొని ఇక్కడికి ఎవరినీ అనుమతించడం లేదు. గతంలో ప్రభుత్వం సాగర్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల్లో భాగంగా దీనికి కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు తయారు చేసింది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ రూపుదాల్చలేదు. దీనిపై ఎన్నెస్పీ ఎస్ఈ మల్లికార్జునరావునువివరణ కోరగా.. దృశ్య కేంద్రం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# కుట్టు.. ఉపాధికి మెట్టు

భువనగిరి : మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. డీఆర్డీఏ పర్యవేక్షణలో జిల్లా, మండల మహిళా సమాఖ్యల ద్వారా స్కూల్ యూనిఫామ్ కుట్టే పనులు జరుగుతున్నాయి. గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాల్లోని ఔత్సాహిక మహిళలతో కుట్టిస్తున్న విషయం విధితమే. దుస్తులు కుట్టగా ఛార్జీల కింద గత ఏడాది సుమారు 900 మందికిపైగా మహిళా సంఘాల సభ్యులకు రూ.75 లక్షలు సముపార్జించగా.. ఈ ఏడాది తొలి విడతగా రూ.63.26 లక్షలు ఛార్జీల కింద విడుదలయ్యాయి.

ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈ సారి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున కూలి డబ్బులు కూడా పెరగనున్నాయి. జిల్లాలో సుమారు 920 మంది మహిళా సంఘాల సభ్యులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. వీరిలో 350 మంది కట్టింగ్, దుస్తులకు ఖాజాలు, గుండీలు కుట్టడంతో పాటు దుస్తులను కూడా కుడుతున్నారు. పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు జతకు రూ.75, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల యూనిఫామ్ కుట్టినందుకు రూ.100 చొప్పున కూలీ ఇస్తున్నారు.

మండలానికి రెండు చొప్పున కట్టింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖాజాలు, గుండీలు కుట్టేందుకు ప్రత్యేక మిషన్లు సమకూర్చారు. కుట్టులో అనుభవం ఉన్న మహిళా సంఘాల సభ్యులు ఇళ్ల వద్దనే బాల, బాలికల దుస్తులను కుట్టి మండల సమాఖ్యలు



సంబంధిత పాఠశాలు, గురుకులాలకు ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు. విద్యాశాఖ ఆధీనంలోని పాఠశాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, టీజీఆర్ఈఎస్ సంస్థల విద్యార్థులకు 37,212 జతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులకు 1364 జతలు, బీసీ హాస్టల్ విద్యార్థులకు 738 జతలు కుట్టు పూర్తయి విద్యార్థులకు ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖల జిల్లా అధికారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం గత రెండు నెలలుగా వీరు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 79,696 జతల దుస్తులను కుట్టించి ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటికే పాఠశాలల విద్యార్థులకు 39,314 జతల దుస్తులను కుట్టి అందజేశారు.

**మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా : టి.నాగిరెడ్డి, డీఆర్డీవో**

మహిళకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా సమాఖ్యల ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాం. సెర్ఫ్ సంస్థ ఆదేశాల మేరకు కుట్టులో నైపుణ్యం ఉన్న మహిళా సంఘాల సభ్యులు 920 మందిని గుర్తించి వారికి శిక్షణ ఇచ్చాం. ఇళ్ల వద్దే ఉంటూ వీటిని కుడుతూ జతకు రూ.75 సంపాదిస్తున్నారు.

# నైపుణ్యమస్తు!

ఖమ్మం : యువతలో కంప్యూటర్, కృత్రిమ మేధ నైపుణ్యాలు పెంపొంది ంచి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదోతరగతి అర్హతతోనే అధునాతన సాంకేతిక శిక్షణనిచ్చి భవితపై భరోసా కల్పిస్తోంది. పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మార్చగా.. అందులో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల చొరవతో నాలుగు ఏటీసీలు మంజూరయ్యాయి. వీటికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది.

**మొదటి విడత కేంద్రాల్లో ప్రవేశాలు**

కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్) భాగస్వామ్యంతో రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లను ఏర్పాటుచేస్తున్నారు. మొదటి విడతలో ఖమ్మం, మణుగూరు, రుద్రంపూర్(కొత్తగూడెం), కృష్ణసాగర్(బూర్గంపాడు) ఐటీఐలను ఏటీసీలుగా మార్చారు. ఆయాచోట్ల భవన నిర్మాణాలు తుది దశకు చేరాయి. యంత్రాలు, ఇతర పరికరాలు వచ్చాయి. వీటిని అమర్చాల్సి ఉంది. ఇప్పటికే ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో విద్యార్థులు చేరగా శిక్షణ ఇస్తున్నారు. ఏటీసీలలో పాత ఐటీఐ కోర్సులతో పాటు అదనంగా అధునాతన ఆరు కోర్సులు ఉంటాయి.

**స్థలాల అన్వేషణ**

రాష్ట్ర ప్రభుత్వం టీటీఎల్‌తో కలిసి తెలంగాణలో మరో 46 ఏటీసీలను ఏర్పాటు చేస్తోంది. వీటిలో జిల్లాకు నాలుగు కేంద్రాలు మంజూర య్యాయి. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం, వైరా నియోజక వర్గం ఏన్కూరు మండలం తూతక్కపేట, మధిర నియోజకవర్గం సిరిపురం, సత్తుపల్లి



నియోజకవర్గం తుంబూరులో ఇవి ఏర్పాటు కానున్నాయి. వీటికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఒక్కో కేంద్రానికి రూ.45.15కోట్లు వెచ్చించనుంది. స్థలాలను అధికారులు అన్వేషిస్తున్నారు. టీటీఎల్ తనవాటా కింద యంత్రాలు, సాఫ్ట్‌వేర్, టూల్స్, పరికరాలు అందించనుంది. వర్క్‌షాప్స్, బోర్‌వెల్స్, మున్సిపాల్టీ నుంచి నీరు, విద్యుత్తు సరఫరా, పనులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, గ్రంథాలయం, ఫర్నిచర్, శిక్షణ, పుస్తకాలు, శానిటరీ, తదితరాలకు నిధులను ప్రభుత్వం సమకూరుస్తుంది.

**కోర్సుల వివరాలు**

ఏడాది కాలవ్యవధి
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్
ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ)
రెండేళ్ల వ్యవధి
వర్చువల్ ఎనాలసిస్(బీడీవీవీ), డిజైనర్(ఎఫ్ఈఎం)
కంప్యూటర్ న్యూమరిక్ కంట్రోలర్(సీఎన్‌సీ-కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో పరికరాల తయారీ)
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్(ఎంఈవీ).

ఏటీసీలుగా మారిన ఐటీఐలలో పాత కోర్సులతోపాటు కంప్యూటర్ బేస్డ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఖమ్మం ఏటీసీలో యంత్రాలు అమర్చాల్సి ఉంది. ఇప్పటికే విద్యార్థులను చేర్చుకొని శిక్షణ ఇస్తున్నాం.
శ్రీనివాసరావు, ఐటీఐల జిల్లా కన్వీనర్

# మరమ్మతులు లేక.. విస్తరణకు నోచుకోక..



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారింది. అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారిన దారిపై నీరు నిలవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అటు విస్తరణకు నోచుకోక, ఇటు మరమ్మతులు లేక వానాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

**రెండు జిల్లాలకు రాకపోకలు**

గతంలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులోని అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాల నిర్వాసితులకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసింది. రూ.2 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మించింది. గతంలో ఈ రహదారిపై రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండేళ్ల కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో రోజుకు దాదాపు వెయ్యి వాహనాలు నడుస్తున్నాయి.

**విన్నపాలు బుట్టదాఖలు**

రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామస్థులకు పునరావాసం కల్పించిన సింగరేణి సంస్థ దాదాపు పదేళ్ల కిందట కాలనీ వరకు సింగిల్ రోడ్డు వేసింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు.

పునరావాస కాలనీ నిర్మాణం వరకే తమ బాధ్యత అని, రహదారి మరమ్మతుతో తమకు సంబంధం లేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు. మరోవైపు రహదారిని ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించకపోవడంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోవడం లేదు. రహదారిని రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లికి మధ్య 2 కిలోమీటర్ల దూరం ఉండగా సుమారు ఎనిమిది మలుపులున్నాయి. మలుపులు, గుంతలతో ఈ మార్గంలో వారానికి ఒక ప్రమాదం జరుగుతోంది.

**సీఆర్ఆర్ నిధులకు ప్రతిపాదనలు**

శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి

సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు రహదారి విస్తరణ కోసం సీఆర్ఆర్ నిధుల మంజూరుపై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశముంది.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

వేముల లక్ష్మయ్య, చిన్నఓదాల

రహదారిపై మలుపులున్న చోటనే గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వరుసలుగా విస్తరించడం ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. వానాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటేనే భయమేస్తోంది.

# బాధితులకు భరోసా.. సీఈఐఆర్ అండ




గోదావరిఖని: ప్రస్తుత కాలంలో చరవాణులు ఎంత కీలకమో అందరికి తెలిసిందే. అలాంటిది చేతిలో ఉండాల్సిన ఫోన్ ఎవరైనా చోరీ చేస్తే.. లేదంటే ఎక్కడైనా పోతే తిరిగి దక్కించుకోవటం కష్టమే. కాని పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ పోయిన ఫోన్లు తిరిగి పొందటానికి ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో అయితే సెల్‌ఫోన్ చోరీకి గురైతే తిరిగి మళ్లీ చేతికి రావటం కష్టమే. అలాంటిది ఎత్తుకెళ్లిన వారిని వెంటనే గుర్తించి వారి నుంచి స్వాధీనం చేసుకోవడానికి పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్ బాధితులకు భరోసా కల్పిస్తోంది.

**6,683 ఫిర్యాదులు**

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పోర్టల్ ప్రారంభమైన నుంచి 6683 ఫిర్యాదులు రాగా.. 2020 పోయిన సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించారు. చోరీకి గురైనా.. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డు నంబరుతో బాధితులు వెంటనే మరో సిమ్ తీసుకోవాలి. వివరాలు సీఈఐఆర్(సెంట్రల్ ఎంక్వయిరీ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేయాలి. లేదా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు చేస్తారు. ఎవరైనా పోయిన ఫోన్‌ను వినియోగించిన వెంటనే ఎక్కడుందన్న సమాచారం పోర్టల్‌కు చేరుతోంది. ఏప్రిల్ 2023లో ఈ అప్లికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వివిధ ఠాణాల పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పోలీసులు ట్రాక్ చేసి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగిస్తున్నారు. తాజాగా కమిషనరేట్ పరిధిలో 120 సెల్‌ఫోన్‌లను అప్పగించారు. దీని కోసం సీసీఎస్, ఐటీ సెల్ పోలీసు బృందాలు ప్రత్యేక దృష్టి సారించి చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

**నమోదు చేయాల్సిన వివరాలు**

ఐఎంఐ నంబరు
కొనుగోలు చేసిన రశీదు బిల్లు
ఏదైనా గుర్తింపు కార్డు


ప్రతి ఠాణాలో ప్రత్యేక విభాగం

చోరీకి గురైన సెల్‌ఫోన్‌ల కోసం సీసీఎస్ పోలీసులతో పాటు ప్రతి ఠాణాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. బాధితులు వివరాలు అందిస్తే వాటిని అప్లికేషన్‌లో నమోదు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లో చోరీకి గురైన ఫోన్ బ్లాక్ అవుతోంది. వేరే సిమ్‌కార్డు వినియోగించిన సమాచారం అందుతోంది.
అంబర్ కిషోర్ ఝా, రామగుండం సీపీ

# వన మహోత్సవానికి సన్నద్ధం

మెట్‌పల్లి: పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ఈ సారి గ్రామాల్లో, పట్టణాల్లో లక్ష్యం మేర మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో జిల్లాలో 48.98 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకనుగుణంగా ఆయా శాఖలకు లక్ష్యాలను కేటాయిస్తూ కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు, అయిదు పురపాలికలున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ ఏర్పాటు చేసి 47,67,400 మొక్కల పెంపకం చేపట్టారు. అటవీ శాఖతో పాటు పురపాలికల్లోనూ నర్సరీల్లో మొక్కలు పెంచారు. సుమారు 76 రకాల మొక్కలను పెంచుతున్నారు. గ్రామాలు, పట్టణాల విస్తీర్ణం ఆధారంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. అవెన్యూ, కమ్యూనిటీ, కాలువలకు ఇరువైపులా, రైతుల పొలంగట్లు, ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో గుంతలు తవ్వే పనులు చేపడుతున్నారు. వర్షాలు తగినంత కురిస్తే మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 1800 ప్రాంతాల్లో మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించారు. ఇంటింటికీ సుమారు 12 లక్షల మొక్కలు అందించేందుకు పూలు, పండ్ల రకాలకు చెందిన మొక్కలను సిద్ధం చేశారు. వన మహోత్సవాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ కూడా ముఖ్యమని, అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని



పలువురు అభిప్రాయపడుతున్నారు.

**నర్సరీల్లో పెంచిన రకాలు**

జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, మామిడి, బాదం, కర్జూర, ఈత, మారేడు, ఉసిరి, చింత, సీతాఫలం, టేకు, వేప, గుల్‌మోహర్, కానుగ, కదంబ, వెదురు, సుబాబుల్, రేలా, అవిస, పొగడ, తుమ్మ, సీమచింత, శ్రీగంధం, జిట్రేగు, మందార, గులాబీ, మల్లె, అడవి తంగేడు, కరివేపాకు, స్పైడర్‌లిల్లీ, తులసి, పారిజాతం, కనకాంబరం, గన్నేరు.

# ఇక పక్కాగా డ్రైవింగ్ పరీక్షలు

ఖమ్మం : లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి వాహన డ్రైవింగ్ పరీక్ష కఠినతరం కానుంది. రవాణాశాఖ కార్యాలయాల్లో పరీక్ష సమయంలో ఎలా పడితే అలా వాహనం నడిపితే ఇకపై లైసెన్సు ఇవ్వడం కుదరదు. రానున్న రోజుల్లో వాహన ప్రమాదాలను నియంత్రించాలనే లక్ష్యంతో పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విధానంలో మార్పులు చేర్పులు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 18 రవాణాశాఖ కార్యాలయాల్లో నూతన పద్ధతిని అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. ఇందులో ఖమ్మం జిల్లా రవాణాశాఖ కార్యాలయం సైతం ఉంది. త్వరలోనే నూతన డ్రైవింగ్ విధానం అమల్లోకి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇది కార్యరూపం దాల్చితే డ్రైవింగ్ పరీక్షలు సక్రమంగా జరిగి అర్హులు మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు పొందే అవకాశం ఉంటుంది.

**నడిపించేస్తున్నారిలా..!**

జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో ప్రస్తుతం టూవీలర్, త్రీవీలర్, ఫోర్‌వీలర్ వాహనాల లైసెన్స్‌లకు వాహనదారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ చేసుకొని వస్తే అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి కౌంటర్ నంబర్ ఇస్తున్నారు. అనంతరం డ్రైవింగ్ పరీక్షకు వెళ్లాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అన్నింటినీ పూర్తిస్థాయిలో నడిపే అవకాశం ఉండటం లేదు. పెద్ద వాహనం నడిపితే చిన్నవి నడపకుండానే మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు లైసెన్సులను జారీ చేస్తుంటారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైనా ట్రాక్, 8 అంకెపై నడపకపోతే లైసెన్సు మంజూరును



నిలిపివేయవచ్చు. చాలా సందర్భాల్లో ఇది జరగడం లేదు. నూతన విధానంతో దీనికి అడ్డుకట్ట పడనుంది.

**సెన్సార్ల వినియోగం**

ఇకపై డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేయాలంటే తప్పనిసరిగా సిమ్యులేటర్‌పై పరీక్ష పాస్ అవ్వాలి. ఖమ్మంలో గతంలో ఏర్పాటు చేసిన పరికరం మూలకు చేరింది. దీన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది. ఖమ్మం కార్యాలయంలో ప్రస్తుత డ్రైవింగ్ ట్రాక్ స్థానంలో అత్యాధునిక సదుపాయాలతో నూతన ట్రాక్‌ను నిర్మించేందుకు కసరత్తు చేపట్టనున్నారు. హెచ్, ఎస్, 8 ఆకారాలతో పాటు రివర్స్, ట్రాక్‌పై సక్రమంగా నడుపుతున్నారో లేదో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలతో పాటు ఆధునిక సెన్సార్లను వినియోగించనున్నారు.

**త్వరలోనే అందుబాటులోకి..: వాకదాని వెంకటరమణ, ఆర్టీఓ, ఖమ్మం**

అధునాతన ట్రాక్‌తో పాటు సిమ్యులేటర్‌పై పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సేవలు త్వరలోనే జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే కార్యాచరణ రూపొందించి పనులు చేపడతాం.జిల్లాలో సగటున ఒక్కరోజుకు డ్రైవింగ్ లైసెన్సులకు వచ్చే
దరఖాస్తులు: సుమారు 70-80
లెర్నింగ్ లైసెన్సులు: సుమారు 60-70

# మన్యం వాసులకు మంచి రోజులు

కొత్తగూడెం : ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్యం వాసులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటివరకు యూజీ వైద్యవిద్య ఉన్నచోటే పీజీ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్యకళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ కళాశాలలు నెలకొల్పాలని నిర్ణయించగా.. అందులో భద్రాచలం పట్టణానికి చోటు కల్పించింది.

**బోధనాసుపత్రిగా ఏరియా వైద్యశాల**

పీజీ కళాశాల ఏర్పాటుతో భద్రాచలంలో 200 పడకలు కలిగిన ఏరియా వైద్యశాల పీజీ కోర్సుల కోసం బోధనాసుపత్రిగా మారనుంది. స్థానికంగా అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులకు ఉన్నతస్థాయి వైద్యచికిత్స సులువుగా అందుతుంది. ప్రత్యేక వైద్యసదుపాయాలు(కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్ వంటివి) భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో లభ్యమవుతాయి. రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. ముఖ్యంగా పీజీ సీట్ల సంఖ్య పెరగటంతో జిల్లా యువతకు వైద్యవిద్యలో అవకాశాలు మెరుగుపడతాయి.

**జిల్లాకు మరో మణిహారమే..**

మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్యులెవరూ ఆసక్తి చూపించని ప్రస్తుత పరిస్థితుల్లో పీజీ వైద్యకళాశాల ఏర్పాటు.. వైద్యరంగం పరంగా జిల్లాకు మణిహారంగా మారనుంది. పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో స్పెషలిస్టు డాక్టర్ల(ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్)ను తయారుచేస్తాయి. వీరు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అవకాశముంటుంది. కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. పీజీ కళాశాలలు వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తాయి. దీనివల్ల కొత్త చికిత్స పద్ధతులు, ఔషధాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించే డెంగీ, మలేరియా, టీబీ రోగాల నివారణకు ఇవి సహాయపడతాయి.

**భద్రాచలం అభివృద్ధికి బాటలు..**

కళాశాల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్తు, అంతర్జాల సేవల వంటి మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు (వసతిగృహాలు, దుకాణాలు) పెరుగుతాయి. ఇవి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. గిరిజన సమాజం ఆధునిక వైద్యవిద్య, సేవల్లో ఏకీకృతమవుతుంది. గిరిజన సంస్కృతికి గౌరవం లభిస్తుంది. పేద గిరిజనులకు ఆధునిక వైద్యం ఉచితంగా అందుతుంది. భద్రాచలంలో పీజీ వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. వైద్యకళాశాల ఏర్పాటైతే వైద్యపరంగా జిల్లావాసులకు మంచిరోజులు వచ్చినట్లే. వివిధ విభాగాల్లో విద్యనభ్యసించేవారు ఉండటం వల్ల ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.డా.ఎం.రామకృష్ణ, సూపరింటెండెంట్, భద్రాచలం ఏరియా ఆసుపత్రి

## సిఫార్సులే కొలమానం.. నచ్చినోళ్లకు స్థలం

అమలాపురం : గ్రామాల్లో ఇళ్లు కాదు.. ఏకంగా ఊళ్లే నిర్మిస్తున్నామంటూ గత వైకాపా పాలకులు ఆర్భాటం చేశారు. పేదలకు స్థలాల ముసుగులో అక్రమాలకు పాల్పడ్డారు. గూడులేక అల్లాడుతున్న వేలాదిమందిని గాలికొదిలేసి అనర్హులకు కట్టబెట్టారు. దీంతో నేటికీ ప్రతి లేఔట్‌లోనూ ఖాళీ స్థలాలే దర్శనమిస్తున్నాయి. వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు తాజాగా సర్వే చేయగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.గత పాలకులు తమకు నచ్చినవారి పేర్లను వాలంటీర్ల ద్వారా నమోదు చేయించి జగనన్న లేఔట్‌లలో స్థలాలు కేటాయించారని ఆదినుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. అదే విషయం తాజా సర్వేలో తేటతెల్లమైంది. సొంత ఇళు ఉన్నవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, స్థానికేతరులు, దీర్ఘకాలికంగా వలసవెళ్లిన వారికి కూడా పట్టాలిచ్చారు. కొందరు అమ్మకాలకు పెట్టారు. ఒక్కొక్క పట్టా రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు చెబుతున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రులో ఇప్పటికే సగంపైగా చేతులు మారినట్లు సమాచారం. గోడి గ్రామంలో సొంత ఇళ్లు ఉన్న కొందరికి నేతల సిఫార్సులతో అక్కడి లేఅవుట్‌లో స్థలాలిచ్చారు. ఇళ్లు నిర్మించకుండా ప్రస్తుతం విక్రయించే పనిలో ఉన్నారు.



**తూతూమంత్రంగానే..**

జగనన్న లేఔట్‌లలో పట్టాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని ఆదేశాలు జారీచేసింది. అయితే క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి నిబద్ధతతో సర్వే చేయలేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు వైకాపా నాయకులతో కుమ్మక్కై జాగ్రత్త పడ్డారనే ఆరోపణలున్నాయి. తాజాగా తయారు చేసిన అనర్హుల జాబితాలో ప్లాట్లు అమ్మకాలు చేసినవారి వివరాలు లేకపోవడం ఇందుకు నిదర్శనం.

**జిల్లాలో ఇలా..**

జిల్లావ్యాప్తంగా 22 మండలాల పరిధిలో మొత్తం మొదటి విడతలో 766 లేఔట్‌లు ఏర్పాటుచేశారు. దానిలో 67,418 మంది లబ్ధిదారులు రెండు సెంట్ల చొప్పున ఇంటిస్థలం కేటాయించి పట్టాలను పంపిణీ చేశారు. తాజా సర్వేలో వీరిలో 1,062 మందిని అనర్హులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

**ప్రభుత్వానికి నివేదిస్తాం– రాజకుమారి, డీఆర్వో**

లబ్ధిదారుల జాబితాపై పునఃపరిశీలన చేశాం. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

## పైన గుమ్మడికాయలు.. కింద గోవులు

కిర్లంపూడి: మూగజీవాలను గుట్టుచప్పుడు కాకుండా కబేళాకు తరలించేందుకు వాహనచోదకులు అనేక కుయుక్తులు పన్నుతున్నారు. రవాణా ఆటోలో అడుగున పది ఆవులను ఉంచి మధ్యలో చెక్కను అమర్చి వాటిపై గుమ్మడికాయల మూటలువేసుకుని జాతీయ రహదారిపై విజయవాడకు తరలిస్తున్న వాహనాన్ని తనిఖీలో భాగంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం జాతీయరహదారిపై టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్‌కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా కూరగుమ్మడికాయల మూటలు వేసుకుని వెళ్తున్న ఆటోను ఆపి



పరిశీలించారు. మూటల కింద ఆటోలో కబేళాకు తరలిస్తున్న పది ఆవులు, దూడలను పోలీసులు గుర్తించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం నామవరం గ్రామానికి చెందిన కురందాసు బాస్కరరావు, కిర్లాడ అప్పారావు నర్సీపట్నం ప్రాంతం నుంచి విజయవాడ కబేళాకు తరలించేందుకు బేరం కుదుర్చుకున్నట్లు కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆవులను వీరినుంచి విడిపించి గోకవరంలోని గోశాలకు తరలించారు. వాహనచోదకులు ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## మగ్గానికి మద్దతు.. నేతన్నకు వరం..!

సీతానగరం : చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ముద్ర పథకం ద్వారా రుణాలు మంజూరుచేసి చేనేత కార్మికులను ఆదుకుంటున్నాయి. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని చేయూతను అందిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,420 మందికి రూ.7.10 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని.. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 54 చేనేత సహకార సంఘాల్లో దాదాపు 9,750 మంది సభ్యులు ఉన్నారు. సిల్క్, జాందానీ, పట్టు తదితర చేనేత కార్మికులు వస్త్రాలు నేస్తున్నారు. ఉప్పాడ కొత్తపల్లి చీరలకు అంతర్జాతీయ, పెద్దాపురం పట్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించాయి. ఆయా ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు నేతన్నలకు భరోసా కల్పిస్తున్నారు.

**ఎంత ఇస్తారంటే..**

ఓవైపు యార్న్ ధర పెరగడం, సాంకేతిక మార్పులు, తక్కువ ధరకు మిల్లు ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడంతో చేనేత వస్త్రాల అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఈ విషయాన్ని దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రుణ సాయాన్ని పెంచారు. ఒక్కో కార్మికుడు ముద్ర పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణం తీసుకోవచ్చు. ఈ మొత్తంలో ప్రభుత్వం 20 శాతం రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలానికి ఆరు శాతం వడ్డీ చెల్లించాలి. సొంత మగ్గం ఉండి.. చేనేత కార్మికుడిగా గుర్తింపుపొందినవారికి రాయితీపై రుణం మంజూరు చేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,420 మందికి రుణాలు అందించాలని నిర్ణయించి ఇప్పటివరకు 210 మందికి రూ.1.05 కోట్లు మంజూరు చేశామని చేనేత జౌళి శాఖ కాకినాడ ఏడీ కె.పెద్దిరాజు తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు.

## లక్ష్యం బాగున్నా.. స్పందన లేదాయె!




గుత్తి : గుత్తిలో నివాస స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో వైకాపా ప్రభుత్వం మూడేళ్ల కిందట లచ్చానిపల్లిరోడ్డులో జగనన్న కాలనీలో మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల సాకారం చేసేందుకు లేఅవుట్‌ను వేసింది. పట్టణానికి సుమారు 2 కి.మీ దూరంలో 6 ఎకరాల్లో ప్లాట్లు సిద్ధం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు 800 మందికి ఇళ్లపట్టాలిచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు 600 పట్టాలను పేదలకు మంజూరు చేసింది. ప్రస్తుతం అక్కడ నివాస గృహాలు వెలిసి జగనన్న కాలనీగా ఏర్పాటైంది.

**ప్రైవేట్‌పై ఆసక్తి...**

మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. గుత్తిలో సెంటు రూ.2–3 లక్షలు దాకా ధర ఉంది. అయినా ప్రజలు ప్రైవేట్ లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ లేఅవుట్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లేఅవుట్ వద్ద డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలోని చెత్తను తెచ్చి పడేస్తున్నారు. డండింగ్‌యార్డుతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

కాలనీలో యార్డు లేకుండా తరలించాలని ప్రజలు కోరుతున్నారు. యార్డు ఉండటంతోనే ప్రభుత్వ లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలుకు మధ్యతరగతి ప్రజలు ముందుకు రాలేకపోతున్నట్లు గ్రహించిన అహుడా అధికారులు యార్డు ఎత్తివేయాలని పురపాలిక అధికారులను ఆదేశించారు. యార్డు ఎత్తివేతకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే రూ.34 లక్షలకు టెండర్లు వేశారు. అక్కడే మురుగుశుద్ధి ప్లాంట్ నిర్మాణంలో ఉంది.

**మౌలిక సదుపాయాలు కల్పిస్తాం**

**– రేవంత్, డీఈఈ, అహుడా, అనంతపురం**

గుత్తిలోని ఎంఐజీ లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తాం. ఇప్పటికే డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలించే ప్రక్రియ జరుగుతోంది. మౌలిక సదుపాయాలు కల్పించి ప్లాట్ల కొనుగోలు విషయమై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

**రూ.2.95 కోట్లు ఆర్జించాలని..**

కాలనీ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా మార్జినల్ ఇన్‌కమ్ గ్రూపు(ఎంఐజీ)లేఅవుట్ మాత్రం అలంకారప్రాయంగా ఉంది. లేఅవుట్‌లో అహుడా అధికారులు 123 ప్లాట్లు వేశారు. ఒక్కో ప్లాట్‌ను రూ.2.40 లక్షలకు విక్రయించాలనుకున్నారు. మొత్తం రూ.2.95 కోట్ల ఆదాయాన్ని ప్లాట్ల నుంచి ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఇప్పటి వరకు ఒక్క ప్లాట్‌ను కూడా విక్రయించలేదు. లేఅవుట్‌లోని ప్లాట్లు మూలనపడ్డాయి.

## ప్రయాణికుల ప్రాంగణం.. ఆక్రమణలే అధికం



పుట్టపర్తి : హిందూపురం నడిబొడ్డున ఉన్న పరిగి ప్రయాణికుల ప్రాంగణం ఆక్రమణలకు అడ్డాగా మారింది. పట్టణంలో రెండు ప్రయాణ ప్రాంగణాలు ఉన్నాయి. ఇందులో పరిగి బస్టాండు నిత్యం కిటకిటలాడుతుంటుంది. కర్ణాటక సరిహద్దున ఉండటంతో నిత్యం రెండు రాష్ట్రాలకు చెందిన 20 వేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు పరిగి బస్టాండు ఏడెకరాలు ఉండేది. కూరగాయలు, పండ్ల మార్కెట్, ఆలయాలు, బడి.. ఇలా ఒక్కోదానికి కొంత స్థలం కేటాయించారు. ప్రస్తుతం సుమారు 60 సెంట్లకు చేరుకుంది. ఈ ప్రాంగణంలోనే 40 వాణిజ్య దుకాణాలు నిర్మించారు. దుకాణాల ముందు చిరువ్యాపారులకు స్థలమిచ్చి (తోపుడు బండ్లకు) అద్దె వసూలు చేస్తున్నారు. దీంతో మరింత ఆక్రమణలకు గురికావడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. చిరువ్యాపారుల ఏడాదిపాటు రోజూ సుంకం వసూలు చేసుకునేందుకు టెండరు పిలిచారు. ఓ వ్యక్తి రూ.22.30 లక్షలు చెల్లించి టెండరు దక్కించుకున్నాడు. వారి నుంచి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వైకాపా ప్రభుత్వం 2023 చివర్లో హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల పేరుతో 18 మందికి అద్దె ప్రాతిపదికపై తాత్కాలిక దుకాణాల ఏర్పాటు కు అధికారులు అనుమతించారు. పురపాలక సంఘం ఆమోదానికి గాను కొంతమంది కౌన్సిలర్లకు రూ.80 వేల నుంచి రూ.3 లక్షల వరకు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. మొత్తం 18 మందికి తాత్కాలిక అనుమతి ఇవ్వగా వీరితో మరో ఆరుగురు కలిసి మొత్తం 24 దుకాణా లు ప్రయాణ ప్రాంగణంలో నిర్మించుకోవడం గమనార్హం. ఇందుకోసం అధికారులు, కొందరు కౌన్సిలర్లకు ఎవరికి ఎంత ఇచ్చారో పుస్తకంలో రాసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక సదరు దుకాణాలను ఖాళీ చేయాలని అధికారులు చెప్పడంతో వారు కోర్టుకు వెళ్లారు.

**తక్షణమే చర్యలు తీసుకుంటాం**

**– మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్**

పరిగి బస్టాండులో ఆక్రమణలు, ప్రయాణికులు ఇబ్బందులు తొలగించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటాం. చిరువ్యాపారుల బండ్లను ఎక్కడపడితే అక్కడ పెట్టుకోకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో చర్చించి ఆక్రమణలను తొలగిస్తాం.

## అక్రమాలకు ఊరుకో 'కొండ' గుర్తు



విశాఖపట్నం : వైకాపా పాలనలో జిల్లాలోని పలు కొండలను కొల్లగొట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా అదే తీరు కొనసాగుతోంది. పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో గ్రావెల్ తరలించేస్తున్నారు. భారీ యంత్రాలతో పగలు, రాత్రి తవ్వేస్తున్నారు. లే–అవుట్లకు ఈ గ్రావెల్‌ను తరలించి కొందరు నాయకులు జేబులు నింపేసుకుంటున్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండల పరిధిలో కొన్ని కొండల గుర్తులు చెదిరిపోతున్నాయి. అంతలా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి.ఇది గిడిజాలలోని 'ఒక సెంటు' ప్లాట్ల కాలనీ సమీపంలోనిది. రైతులకు కేటాయించిన లే–అవుట్‌లో రోడ్లకు గ్రావెల్ పేరుతో ప్రైవేటుకు భారీగా తరలించేస్తున్నారు. జేసీబీతో నిత్యం తవ్వకాలు సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 5 ఎకరాల మేర కొండను మింగేశారు. ఈ కొండ చందక రెవెన్యూ గ్రామ పరిధిలోని పందలపాక సమీపంలోనిది. ప్రతి రోజూ 50కిపైగా లారీలతో గ్రావెల్ తరలిస్తున్నారు. 3 యూనిట్ల టిప్పర్ అయితే దూరాన్ని బట్టి రూ. 4–5వేలకు, ఏడు యూనిట్ల లారీలైతే రూ.10వేలకు అమ్మేస్తున్నారు. ఇది తర్లువాడ రెవెన్యూ పరిధిలోని ప్రకృతివానిపాలెం లే–అవుట్ సమీప కొండ. ప్రతిరోజూ గ్రావెల్ తవ్వి బయటకు తరలిస్తున్నారు. గ్రావెల్‌తో సమీపంలో చదును చేసిన స్థలాల్లో అనధికారికంగా ఇళ్ల నిర్మాణాలు సైతం చేస్తున్నారు. ఇప్పటికే ఈ కొండలో రెండు ఎకరాలపైగా మట్టిని కొల్లగొట్టారు.

**అడ్డే లేదుగా...:** పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు కళ్లుమూసుకుంటున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పందలపాక సమీపంలోని కొండ నుంచి మట్టి తరలిస్తున్నట్లు గతంలో ఫిర్యాదులు రావడంతో కొన్ని లారీలను పట్టుకున్నారు. అయితే ఇప్పటికీ చర్యల్లేవు. ఇదే అదునుగా కొండను నిత్యం తవ్వి దర్జాగా ఎర్రమట్టి తరలిస్తున్నారు. వైకాపా హయాంలో చెలరేగిన మాఫియాలో కొందరు ఎర్రమట్టి తరలింపులో చక్రం తిప్పుతూ ఇప్పటికీ హవా సాగిస్తున్నారు. విజిలెన్స్, మైనింగ్ శాఖలు ఈ తవ్వకాలపై దృష్టిపెడితే తప్ప సహజ సిద్ధమైన కొండలను కాపాడుకోలేమని స్థానికులు చెబుతున్నారు.

## కన్నీట మాయాపట్నం..

కొత్తపల్లి : ప్రశాంతంగా ఉండే కడలి కన్నెర్ర చేసింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలోకి పరుగులు తీశారు. ఏం జరిగిందో తెలుసుకునేలోపే గ్రామాన్ని సముద్రపు నీరు ముంచెత్తింది. తీరాన్ని ఆనుకుని ఉన్న గృహాలు నేలమట్టమయ్యాయి. పదుల సంఖ్యలో దెబ్బతిన్నాయి. ఉదయం ఏడు గంటల సమయంలో యు.కొత్తపల్లి మండలం మాయాపట్నంలో పరిస్థితి ఇది. ఇక్కడ ఎటుచూసినా మోకాలిలోతు నీరే. పంచాయతీ, రెవెన్యూ అధికారులు హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నాలుగు గంటల అనంతరం సముద్రం శాంతించింది. ఉప్పాడ, సూరాడపేట, జగ్గరాజుపేట, అమీనాబాద్ ప్రాంతాలు సైతం కోతకు గురయ్యాయి.

**విధ్వంసం సృష్టించి..**

ఏడాదికి రెండు నుంచి మూడుసార్లు సముద్రం విధ్వంసం సృష్టించి గ్రామాలను కలిపేసుకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సముద్రకోత నివారణపై ఇప్పటికే దృష్టి సారించారు. ఎన్నికల ముందు పలుమార్లు పర్యటించి కోత ప్రభావం, పరిస్థితి, నివారణ చర్యలపై తెలుసుకున్నారు. అధికారంలోకి



వచ్చాక మళ్లీ పర్యటించారు. ఇటీవల వాకలపూడి నుంచి అమీనాబాదు వరకు కోత నివారణ నిమిత్తం రక్షణగోడ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఇది పూర్తయితేనే ముప్పు తప్పుతుంది.

**చిన్న గుడిసెలో 8 మంది ఉంటున్నాం– చొక్కా గోవిందమ్మ**

తుపాను, విపత్తుల సమయంలో మా ఇళ్లు పోయింది. ఒకే గది ఉన్న చిన్న గుడిసెలో 8 మంది ఉంటున్నాం. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే మాకు రాదన్నారు. ఇప్పుడు ఈ గుడిసె కూడా మునిగిపోయింది. ఎక్కడ ఉండాలో తెలియడంలేదు.

**ఇంటి పన్ను ఉందని స్థలం ఇవ్వలేదు– చిట్టెమ్మ**

సముద్రంలో ఇళ్లు పోయినా మా పేరు మీద పన్నులు, విద్యుత్తు మీటర్లు ఉన్నాయని గత ప్రభుత్వంలో స్థలాలు ఇవ్వలేదు. చిన్నపాటి పూరింట్లో బతుకుతున్నాం. ఇప్పుడు అదీ కూడా మునిగిపోయింది. న్యాయం చేయాలి.

**గ్రామస్థులకు సహాయం చేయండి**

ఉప్పాడ తీరంలో అలల ఉద్ధృతి పెరగడంతో మాయాపట్నం గ్రామం జలమయమైన విషయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రజలకు సహాయ చర్యలు చేపట్టాలని, పాలు మంచినీళు వంటివి అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందిని, ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. భారీ వర్షసూచన ఉండటం వల్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడ రక్షణ గోడ జియో ట్యూబ్ తదితర అంశాలపై ఆరా తీశారు.

**ఏడాది కాలంలో ఇలా..**

మండలం: యు.కొత్తపల్లి

ప్రభావిత గ్రామాలు : ఆరు

కోతకు గురైన ప్రాంతం : 50 మీటర్లు పైబడి

నేలకూలిన ఇళ్లు: 15

దెబ్బతిని ప్రమాదకరంగా మారిన ఇళ్లు: 30

ధ్వంసమైన రోడ్లు : 8

## ఇక.. చక్రాలు అరిగితే ఇక్కడే సరిచేస్తారు..!

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలోని దక్షిణ మధ్య రైల్వే మెము కార్‌షెడ్‌లో రైళ్ల నిర్వహణ సామర్థ్యం పెంచే దిశగా రైల్వేశాఖ అడుగులేస్తోంది. ఇప్పటి వరకు రైళ్ల కోచ్‌లకు మరమ్మతులు, సర్వీసింగ్ వరకు ఇక్కడే చేసేవారు. కానీ అరిగిన రైళ్ల చక్రాలను సరిచేసే యంత్రాలు అందుబాటులో లేవు. ఆ చక్రాలను విజయవాడ, తిరుపతిలకు పంపించి, సరి చేయించేవారు. ప్రస్తుతం అలాంటి చక్రాలను కూడా ఇక్కడే సరిచేసే యంత్రాలను సమకూర్చుడానికి (ఫిట్ వీల్ లేత్) రూ.9 కోట్లు మంజూరు చేశారు.దీనికి సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెము (మెయిన్ లైన్ ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) కార్‌షెడ్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు గతంలో రూ.6.81 కోట్లు మంజూరు చేశారు.



తాజాగా రూ.9 కోట్లతో అరిగిన రైలు చక్రాలును రీప్రొఫైలింగ్ చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ః రైళ్ల నిర్వహణకు 1999లో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో మెము కార్‌షెడ్‌లో ప్రారంభించారు. ప్రతిరోజూ మూడు, నాలుగు రైళ్లకు మరమ్మతులు, వాటర్ సర్వీసింగ్ ఇక్కడ చేస్తున్నారు. 108 సర్వీసులుగా నడిచే 28 రైళ్లకు సంబంధించి 257 బోగీ(కోచ్)లకు పూర్తిస్థాయిలో నిర్వహణ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న రెండు ఫిట్‌లు (బోగీల మరమ్మతులకు వీలుగా ఉండే ప్రత్యేక ట్రాక్‌లు) ఉన్నాయి. వీటి సామర్థ్యం పెంచడం ద్వారా మరిన్ని రైళ్ల నిర్వహణ కూడా ఇక్కడే చేపట్టాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

# పక్కా పరిశీలనతోనే 'ఫలం'

చిత్తూరు, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలాఖరుకు మామిడి సీజన్ పూర్తికానుంది. దాదాపు రెండు నెలలుగా సాగుతున్న కొనుగోళ్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుంది. తర్వాత ఉద్యానశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో రైతుల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులకు పంపనున్నారు. అనంతరం ప్రభుత్వం ప్రకటించినట్లు టన్నుకు రూ.4వేల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఈ విషయంలో అధికార యం త్రాంగం పారదర్శకంగా వ్యవహరించినప్పుడే సర్కారు సాయానికి సార్థకత చేకూరుతుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 48,000 మంది మామిడి రైతులున్నారు. గతంలో ఎకరాకు రెండు నుంచి మూడు టన్నులు వస్తే.. ప్రస్తుతం ఐదారు టన్నుల దిగుబడి వచ్చింది. మరోవైపు గుజ్జు పరిశ్రమలు 45 వరకే ఉండటం వీటి సామర్థ్యం రోజుకు 10,000 టన్నులే కావడంతో దిగుబడులతో వాహనాలు ఫ్యాక్టరీల ఎదుట వరుసకట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం టన్నుకు రూ.8వేలు చెల్లించాలని ఆదేశించినా లెక్కచేయలేదు. చివర్లో సరకు అవసరం కాబట్టి కొంతవరకు ఆ ధరకు కొనుగోలు చేశాయి.

**తమిళనాడు నుంచి తెప్పించి**

తమిళనాడులో ఈ ఏడాది టన్ను తోతాపురి రూ.4-5 వేలు మాత్రమే



పలికింది. మన రాష్ట్రంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.4వేలు తోడు పరిశ్రమలు రూ.5-6 వేలు చొప్పున చెల్లించాయి. దీంతో గుడిపాల మండలంలోని పరిశ్రమలకు కొందరు తమిళనాడు నుంచి ట్రాక్టర్లలో తెప్పించి అమ్మారు. అప్పట్లో హడావుడిలో ఉద్యానశాఖ సిబ్బంది వీరి వివరాలు నమోదు చేశారు. వీరికి నిజంగా భూమి ఉందా? ఉన్నా మామిడే వేశారా? దిగుబడి ఎంత ఉండవచ్చు? వంటి వివరాలు ఆరాతీయాల్సి ఉంది. లేదంటే అనర్హులకు ప్రభుత్వ సాయం అందుతుంది. 10- 15 శాతం మంది రైతులకు మామిడి ఉన్నా ఈ-పంటలో నమోదు చేసుకోలేదు. ఇలాంటి అన్నదాతలకు అన్యాయం చేయకూడదు.

**4.17 లక్షల టన్నుల కొనుగోలు**

ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4.17 లక్షల టన్నుల మామిడిని పరిశ్రమలు, ర్యాంపులు, మండీ వ్యాపారులు కొన్నారు. అందులో 3.27 లక్షల టన్నుల దిగుబడి ఒక్క చిత్తూరు జిల్లా నుంచే వచ్చింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వమే టన్నుకు రూ.4వేల చొప్పున చెల్లిస్తుందని ప్రకటించినా తాజాగా మార్కెట్ జోక్య పథకం (ఎంఐఎస్) కింద కేంద్రం కొంత భరించేందుకు సిద్ధమైంది. మొత్తంగా 1,62,500 టన్నులకే కొనుగోలును పరిమితం చేయగా దిగుబడులు పెరిగినందున ఈ మొత్తాన్ని పెంచాలని రాష్ట్రం కోరనుంది.

**రాజకీయాలకు అతీతంగా చేస్తేనే..**

మరోవైపు పరిశ్రమల వద్ద ట్రాక్టర్లు బారులు తీరిన సందర్భంలో రాజకీయ పలుకుబడితో కొందరు టోకెన్లు పొందారు. ముందుగా తమ దిగుబడులను లోపలకు తరలించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదు. ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది.. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా వ్యవహరించాలి. మామిడిని అమ్మిన ప్రతిఒక్కరికీ సాయం చేయాలనే ఉద్దేశంతో సర్కారు ఉంది. అటువంటప్పుడు స్థానిక నేతల ప్రమేయాన్ని నిరోధించి ఎలాంటి పక్షపాతం లేకుండా అధికారులు అర్హుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది.

# అన్నదాతల.. నిరీక్షణకు తెర

చిత్తూరు : కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ సర్వీసుల జారీ, నియంత్రికల బిగింపు ఊపందుకుంది. వైకాపా హయాంలో అప్పటి మంత్రి అండతో కొందరు ఉన్నతాధికారుల అడ్డగోలు నిర్ణయాలతో పెద్దసంఖ్యలో వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండిపోయి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 3,240 సర్వీసులు పెండింగ్‌లో ఉండేవి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ 30 రోజుల్లోనే 510 సర్వీసులు జారీ చేశారు. ఇందులో పలమనేరు డివిజన్‌లోనే అధికంగా ఉన్నాయి. జారీతోపాటు సత్వరమే నియంత్రికలు, అనుబంధ పరికరాలు అమర్చే దిశగా ఏఈఈలు సేవలందిస్తున్నారు. నెలలతరబడి పొలాల్లో దర్శనమిస్తున్న నియంత్రికలను అమర్చేలా చర్యలు చేపట్టారు. అలాగే అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. అలసత్వం ప్రదర్శిస్తున్న ఇద్దరు ఏఈఈలకు మెమోలు జారీ చేశారు. మార్చుకోకపోతే వేటు తప్పదని హెచ్చరించారు.



**లెక్క తేలుస్తున్నారు..!**

గత వైకాపా పాలనలో పలమనేరు డివిజన్‌లో జరిగిన అవినీతి అక్రమాలకు అంతేలేదు. కొందరు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చిన్న పరికరం నుంచి నియంత్రికల వరకు లెక్కాపక్కా లేకుండా విక్రయించి రూ.లక్షలు దోచేశారు. కొన్ని మండలాలకు సామగ్రి తీసుకెళ్లడమే తప్ప అమర్చింది లేదు. అవి ఎక్కడున్నాయో తెలియదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక అధికారులు నియంత్రికలు, అనుబంధ పరికరాల లెక్క తేలుస్తున్నారు.

**సమస్యలుంటే ఫిర్యాదు చేయండి**

వ్యవసాయ సర్వీసుల జారీ శరవేగంగా సాగుతోంది. నియంత్రికలు, అనుబంధ పరికరాల సమస్య ఎక్కడా లేదు. అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయి. మార్గదర్శకాల ప్రకారం సర్వీసుల జారీ ప్రక్రియ పూర్తి చేస్తున్నాం. ఎక్కడైనా జాప్యమవుతుంటే రైతులు మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం. టోల్‌ఫ్రీ 1912కి చేయొచ్చు.
ఇస్మాయిల్ అహ్మద్, విద్యుత్తు ఎస్ఈ

# రెండోసారి హాజరు తప్పనిసరి



కొత్తవలస: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జాతీయ చరవాణి పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్)లో రెండోసారి తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ తరపున ఓ బృందం జిల్లాలో పర్యటించింది. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండోసారి హాజరు వేయకపోవడంతో మరుసటి రోజు యాప్ తొలగించి.. తిరిగి డౌన్లోడ్ చేయాల్సివస్తోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉత్తర్వులు జారీచేశారు.

**ఇవీ నిబంధనలు..**

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మొదటిసారి హాజరు చిత్రం నమోదు చేసిన 4 గంటల తర్వాత రెండోసారి తప్పనిసరిగా చేయాలి.

అప్‌లోడ్ సమస్య ఎదురైతే చిత్రాలను సేవ్ చేసి.. అదే రోజు రాత్రి 12 గంటల లోపు అప్లోడ్ చేయాలి.

మాన్యువల్ మస్టర్ అప్రూవల్‌కు సరైన కారణం ఎంపిక చేయాలి.

రెండోసారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేట్‌లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనూ యాప్ తొలగించి, తిరిగి ఇన్‌స్టాల్ చేయకూడదు. పనికి హాజరైన కూలీల ఫొటోలు ఒక విడత మాత్రమే నమోదు చేస్తే.. మరుసటి రోజు నమోదుకు ఇకపై అవకాశం ఉండదు. అవకతవకలకు అవకాశం లేకుండా ఏఐ సాయంతో పటిష్ఠ పరిచినట్లు చెబుతున్నారు.

**అలసత్వం తగదు..**

క్షేత్ర సహాయకులు తీసే చిత్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. మండల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన వాటిలో 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు పంపించాలి. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే కార్యదర్శి, మండల, జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జాబ్‌కార్డులు : 3.86లక్షలు
వేతనదారులు : 6.88 లక్షలు
మనుగడలో ఉన్నవి : 3.46 లక్షలు
పనికి హాజరవుతున్న శ్రామికులు: 5.72 లక్షలు

విధిగా రెండుసార్లు ఫొటో తీయాలి: పద్మజ, ఏపీడీ, విజయనగరం, ఎస్.కోట క్లస్టర్ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు పనిప్రదేశంలో హాజరైన వేతనదారులకు విధిగా రెండు విడతలుగా ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. లేకుంటే మరుసటి రోజు ఉపాధి కల్పించే అవకాశం ఉండదు.

# కళ్లెదుటే మురుగు.. కలగానే మెరుగు..!



శ్రీకాకుళం : పేరుకే అవి పట్టణాలు.. చెప్పుకోవడానికి మాత్రమే అది నగరం.. ఓసారి వీధుల్లో నడిస్తే తెలుస్తుంది. అడుగడుగునా కాలువల్లో పూడిక.. రోడ్లపై మురుగు దర్శనమిస్తాయి. ఏటా స్థానిక సంస్థలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా వర్షాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పట్లేదు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాల్లో కాలువల నిర్వహణ సక్రమంగా లేక లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. మురుగు రోడ్లపైకి చేరి వీధులు దుర్గంధభరితంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో రూ.వెయ్యి కోట్లతో కాలువల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన పాలకుల మాటలు ఆచరణకు నోచుకోవట్లేదు. ఫలితంగా పాలకొండ రహదారి, అరసవల్లి మిల్లుకూడలి, ఇల్లీసుపురం, రైతుబజార్, పాత బస్టాండ్ పరిసరాలు, గుజరాతీపేట తదితర ప్రాంతాల్లో వర్షం పడితే నీరు రోడ్లపైనే తిష్ఠ వేస్తోంది. భారీ వర్షాలు, తుపాన్ల సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. నగరాభివృద్ధి దృష్ట్యా సుమారు 200 కి.మీ. మేర అదనంగా కాలువలు నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు. మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేక కాశీబుగ్గ ప్రాంతంలో వర్షం పడితే నరకం కనిపిస్తోంది. ప్రధానంగా మేదర వీధి నుంచి సంతోషి మాత కోవెల వరకు కాలువ లేకపోవడంతో మురుగు రోడ్డెక్కుతోంది. సంతోషిమాత కోవెల వద్ద కాలువలో చెత్త అడ్డుపడితే పక్కనే పూజారి వీధి వాసులు మురుగుతో ఇబ్బంది పడుతున్నారు. జంట పట్టణాల్లోని నీరు ఎటూ వెళ్లలేక శివారు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లోనే ఉండిపోతోంది. ఇచ్ఛాపురం పట్టణంలోనూ పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. పురుషోత్తపురం, బెల్లుపడ, కొండపోలమ్మ కాలనీలు, రత్తకన్న, ఎన్టీఆర్ నగర్‌లో నివాసాల మధ్యనే మురుగు నిల్వ ఉంటోంది. ఇంకా పలు వీధుల్లో 30 కిలోమీటర్ల వరకు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

ఆమదాలవలస పురపాలిక ఏర్పడి 30 ఏళ్లు పైబడినా కాలువల పరిస్థితి అధ్వానంగానే ఉంది. ఆక్రమణలు పెరిగిపోవడంతో చాలా చోట్ల కాలువల్లో పూడిక తీసేందుకు వీల్లేకుండా పోతోంది. కొద్దిపాటి వర్షానికే పూజారిపేట, కంద్రపేట, శ్రీకాకుళం రహదారి, ఆమదాలవలస గేటు, తదితర రోడ్లపైకి నీరు చేరుతోంది. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీటమునుగుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

వర్షపు నీరు, మురుగు శివారు ప్రాంతాల్లోని కాలువలు, చెరువులు, నదుల్లోకి చేరేందుకు వీలుగా ప్రధాన కాలువల వ్యవస్థ సక్రమంగా లేదు. చాలా చోట్ల పూడికతో నిండిపోతున్నాయి.

మరోవైపు కాలువలపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నవాటిని పునరుద్ధరించేందుకు యంత్రాంగం శ్రద్ధ చూపట్లేదు. పురపాలక సంఘాలు కాలువల నిర్వహణను విస్మరిస్తున్నాయి. నిత్యం పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాల సేకరణతో పాటు కాలువల్లో పూడిక కూడా తీయాలి. పర్యవేక్షణ లేకపోవడంతో వారు కేవలం చెత్త సేకరణకే పరిమితమవుతున్నారు.

కాలువల్లో మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గిపోతోంది.

**కమిషనర్లు ఏమంటున్నారంటే..?**

'కాలువల నిర్వహణపై దృష్టి సారిస్తున్నాం. కొత్త వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. కాలువల్లో ఆక్రమణలు తొలగిస్తాం' అని ఆయా పుర, నగరపాలిక కమిషనర్లు చెబుతున్నారు.

# బడి మెట్లెక్కని.. బాలలు

కేవీబీపురం : ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై 43 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ బడిముఖం చూడని విద్యార్థులు 179 మంది పైగా ఉంటున్నారు. కేవీబీపురం మండలంలో పాఠశాలల విలీన ప్రక్రియలో పారదర్శకత లోపించడంతో మూడు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు తమ పిల్లలను పంపలేమని తల్లిదండ్రులు ఇంటివద్దనే నిలిపివేశారు. ఇందులో భాగంగానే బంగారమ్మకండ్రిగ 54, వగత్తూరు 34, పాతపాళ్లెం 38, ఏపీపురం 16, గురుకులకండ్రిగ 13, వగత్తూరు ఎస్సీ, ఎస్ఎల్‌పురం ఎస్టీ, కాట్రపల్లి ఎస్టీ కాలనీలల్లో 24 మంది పిల్లలు ఇంటికే పరిమితమయ్యారు. సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, బీఎన్‌కండ్రిగ మండలాల్లోనూ వీరి సంఖ్య అధికంగా ఉంది.

**అంట్లు తోముకోమంటున్నారు..**

మా ఊళ్లో బడి మూసేసి నాలుగు కి.మీ. దూరంలోని మరో బడికి పోవాలని సార్ చెప్పారు. అమ్మానాన్న కూలి పనులకు వెళ్తున్నారు. అక్కడికి వెళ్లలేవని ఇంటి పని, అంట్లు తోముకోమంటున్నారు. దీంతో వేసవి సెలవులు ముగిసినా ఇంటివద్దనే ఉండిపోయా.పావని, నాలుగో తరగతి, ఏపీపురం



**తల్లిదండ్రులు రెండురోజులు రారు..**

అమ్మానాన్న పనులకు వెళ్తే రెండుమూడు రోజులైనా ఇంటికి రారు. ఊర్లో ఉన్న బడికిపోతూ అవ్వ, తమ్ముడితో కలిసి ఇంటివద్ద ఉండేదాన్ని. పక్క ఊళ్లో బడి చాలా దూరంగా ఉంది. అక్కడికి పోవాలంటే బస్సులు ఉండవు. అందుకే ఇంటికాడనే ఉంటున్నా.కుమారి, నాలుగో తరగతి, బంగారమ్మకండ్రిగ

# ఆదిలోనే.. 'వర్రీ'

సూళ్లూరుపేట : గిట్టుబాటు ధరల్లేక ధాన్యం రైతులు మరోసారి దగాపడుతున్నారు. వారంరోజుల కిందటి వరకు ఎంటీయూ 1010 వరి రకం బస్తా (75కిలోలు) రూ.1450 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. నాటికి వంద తెగ్గోశారు. కేఎన్ఎం 1638 రకం బస్తా ధర రూ.1470 వరకు పలుకుతోంది. ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యవసాయాధికారులతో పాటు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో జిల్లాలో ఏప్రిల్ తర్వాత వర్షాలు పడటంతోపాటు తెలుగుగంగ నీరు విడుదల చేయడంతో అన్నదాతలు ముందస్తు ఖరీఫ్ కింద (ఎడగారు) వరి పెద్దఎత్తున సాగుచేశారు. ప్రస్తుతం కోతలు మొదలయ్యాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, సత్యవేడు ప్రాంతాల్లో సాగు అధికంగా ఉండగా ఎకరాకు దిగుబడి 32 నుంచి 38 బస్తాల వరకు వస్తోంది. పంట నూర్పిళ్లు చేసి రోడ్లపైన ఇతర ప్రాంతాల్లో ఆరబెడుతున్నారు. మరోవైపు వర్షాలు వస్తుండటంతో నిల్వ చేయలేక ప్రస్తుత ధరలకు అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. కనీసం పెట్టుబడి చేతికందని పరిస్థితి.



ఈ ధాన్యాన్ని ఎఫ్‌సీఐ కొనుగోలు చేయాల్సి ఉందని, బుధవారం పౌరసరఫరాల మంత్రి పేషీ నుంచి వివరాలు అడగడంతో మండలాల వారీగా పంపినట్లు పౌర సరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ తెలిపారు.

**ఎగుమతులు లేవన్న సాకుతో..**

రైస్ మిల్లర్లు ఎంటీయూ 1010 రకం కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు. అదేమంటే ఎగుమతులు లేవని చెబుతున్నారు. పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.32 చొప్పున ఎగుమతిదారులు కొనుగోలు చేస్తున్నా వీటిని రూ.29లకు తీసుకునేందుకు కూడా ముందుకు రావడం లేదు. గతంలోనూ ఈ రకం ధాన్యానికి గిట్టుబాటు ధరలేక అన్నదాతలు అవస్థలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేయడంతో ఇబ్బందులు తప్పాయి.

**జిల్లాలో వరి రకం, సాగు హెక్టార్లలో..**

ఎంటీయూ1010 : 23,623
కేఎన్ఎం1638 : 4,186
ఏడీటీ43 : 1,770

# కొంగొత్తగా జంగిల్ బెల్స్!

అనంతగిరి: ప్రముఖ పర్యాటక విడిది ప్రాంతం 'తైడా జంగిల్‌బెల్స్' కొత్త రూపును సంతరించుకోనుంది. ఎకో టూరిజం ప్రాజెక్టు కింద దీన్ని సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు.

ఇక్కడ ఉడెన్, ఎరకాన్, ఇగ్లూ, బ్రిడ్జ్ వంటి 20 రకాల కాటేజ్‌లను నిర్మించారు. వీటిలో చాలావరకు ఉడెన్, ఎరకాన్ కాటేజ్‌లు పాడైపోయాయి. ఇగ్లూ కాటేజ్‌లు మరమ్మతులకు గురికాగా.. మరమ్మతులు చేపట్టారు. ఉడెన్, ఎరకాన్ కాటేజ్‌లు అలాగే ఉండిపోవడంతో పర్యాటకులు కాస్త ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వం వీటి నిర్మాణంపై పెద్దగా దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం వీటికి



కొత్త రూపు తీసుకొచ్చేందుకు దృష్టి సారించింది. పాడైన ఎరకాన్, ఉడెన్ వంటి 12 కాటేజ్‌లను తొలగించి వాటి స్థానంలో నూతనంగా టెంట్ కాటేజ్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జంగిల్‌బెల్స్ పర్యాటకులకు దట్టమైన అడవిలో వింత అనుభూతి ఇస్తుండగా.. తాజా మార్పులతో మరింతగా ఆకర్షించేందుకు ముస్తాబు అవుతోంది. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా వీటి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌ఛార్జి మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వర్చువల్‌గా వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

# ఉన్నత విద్యకు.. ఆర్థిక అండ

తిరుపతి : ఉన్నతవిద్యను అభ్యసించాలని ఉన్నా ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు 'పీఎం విద్యాలక్ష్మి' పథకం చేయూతనిస్తోంది. పథకం పరిధిలో మొత్తం 86 రకాల విద్యారుణాలు మంజూరు చేస్తున్నారు. దేశంలో పేరున్న 860 విద్యాసంస్థల్లో ప్రవేశం పొందినవారికి ఎలాంటి సెక్యూరిటీ, గ్యారంటీలు అవసరం లేదు. ప్రతిభావంతులైన విద్యార్థుల చదువు సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు సహకరిస్తున్నాయి.అన్ని బ్యాంకులు విధిగా విద్యారుణాలు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 35 బ్యాంకులు ఉండగా వాటి పరిధిలోని 402 శాఖల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.66.60 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి అదనంగా రూ.2.19 కోట్లు మంజూరు చేశాయి. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో 2025- 26 ఆర్థిక సంవత్సరానికి వీలైనంత ఎక్కువమందికి రుణాలు మంజూరు చేయాలనే ఉద్దేశంతో రూ.145.22 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. **రుణం ఇలా పొందొచ్చు**

తొలుత పీఎం విద్యాలక్ష్మి పోర్టల్‌లో నమోదవ్వాలి. తర్వాత దరఖాస్తు పూరించి చివరగా రుణం పొందాలనుకునే బ్యాంకును ఎంచుకోవాలి. ఒకేసారి గరిష్ఠంగా మూడు వేర్వేరు బ్యాంకుల్ని ఎంపిక చేసుకోచ్చు. ఆ ప్రక్రియ పూర్తయితే రుణానికి సంబంధించిన వివరాలు చరవాణి, ఈ-మెయిల్‌కు ఎప్పటికప్పుడు వస్తుంటాయి. అందుకు అనుగుణంగా ముందుకు సాగాల్సి ఉంటుంది. **అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో...** రూ.4 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా అన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రుణం పొందవచ్చు. రూ.7.5 లక్షల వరకు 5 శాతం మార్జిన్ చెల్లించాల్సి ఉంటుంది. ర్యాంకింగ్ ఉన్న వర్సిటీలు, విద్యాసంస్థలకు అనుగుణంగా రుణాలు పొందవచ్చు. విదేశాల్లో చదువుకునేవారు తప్పనిసరిగా సెక్యూరిటీ చూపించాలి.గుంటూరు రవికుమార్, ఎల్‌డీఎం

## మసూరి బియ్యం.. వ్యాపారి మస్కా

నంద్యాల : మసూరి బియ్యం తరలింపులో వ్యాపారులు మార్కెటింగ్ శాఖకు మస్కా కొడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగయ్యే కర్నూలు సోనా, నంద్యాల మసూరి బియ్యానికి ఎంతో ఆదరణ ఉంది.. సన్నగా ఉండే ఈ బియ్యం నాణ్యతగా.. రుచికరంగా ఉంటాయని పేరుంది. విదేశాల్లోనూ డిమాండ్ ఉంటోంది. దీంతో వ్యాపారులు ఇక్కడ బియ్యం కొనుగోలు చేసి విదేశాలకు రవాణా చేస్తున్నారు. తుంగభద్ర దిగువ, గాజులదిన్నె, కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్ఆర్బీసీ, హంద్రీనీవా కింద కర్నూలు, నంద్యాల సోనా రకాలు 2.07 లక్షల హెక్టార్లలో సాగు చేస్తుంటారు. కోతల సమయంలోనే ధాన్యాన్ని వ్యాపారులు కల్లాల వద్దకొచ్చి కొనుగోలు చేస్తారు. వీటిని మిల్లులకు తరలించి బియ్యంగా మారుస్తున్నారు. తర్వాత ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**సుంకాలు ఎగ్గొట్టి తరలింపు**

నిబంధనల ప్రకారం వరి ధాన్యం రవాణాకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. మార్కెట్ చెక్‌పోస్టుల వద్ద మాత్రం 2 శాతం పన్ను చెల్లించాలి. లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కుల్లో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా మార్కెట్



కమిటీలకు సమకూరుతున్న ఆదాయం అంతంతమాత్రమే. ప్రత్యేకించి నంద్యాల జిల్లా మీదుగానే ఈ అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచీ తరలుతుండటం గమనార్హం. ఈ విషయాన్ని అధికారులు ఇటీవల గుర్తించారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టి సెస్సు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

**రైతు పేరుతో దగా** నిబంధనల ప్రకారం బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలంటే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలి. వ్యాపారులు 20 శాతం మేర అధికారిక అనుమతులు తీసుకుని.. 80 శాతం అక్రమంగా తరలిస్తున్నారు. కేవలం వివరాలు చూపేందుకు మాత్రమే కొంత బియ్యానికి అధికారిక అనుమతులు తీసుకుంటున్నారు. వివిధ చెక్‌పోస్టుల వద్ద తనిఖీల సమయంలో సిబ్బందికి ఎంతోకొంత ముట్టజెప్పి అక్రమంగా రవాణా చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద మాన్యువల్ తనిఖీలే ఉండడం అక్రమార్కులకు కలిసివస్తోంది. నంద్యాల జిల్లాలో 22, కర్నూలు జిల్లాలోని 16 చెక్‌పోస్టులు ఉన్నాయి. బియ్యం పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా పట్టుకుని కేసులు నమోదు చేయడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది.

**ఎక్కడెక్కడంటే..**


కర్నూలు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో సేకరించిన మసూరి బియ్యాన్ని కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి మీదుగా దోర్నాల, మార్కాపురం, బద్వేలు మీదుగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఓడరేవుకు తరలిస్తున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి మీదుగా చెన్నై ఓడరేవుకు తరలించి అక్కడినుంచి విదేశాలకు తీసుకెళ్తున్నారు. మరికొంత సరకును నంద్యాల–ఒంగోలు రహదారి మీదుగా గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ ఓడరేవుకు తరలిస్తున్నారు.

**అంతా వారి కనుసన్నల్లోనే**

ఉమ్మడి జిల్లాలో సుమారు 20 మంది బడా బియ్యం వ్యాపారులు ఉన్నారు. నంద్యాలకు చెందిన ఆరుగురు, ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరుకు చెందిన కొందరు అక్రమ వ్యాపారాల్లో ఆరితేరారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైసుమిల్లుల్లో మర పట్టించి బియ్యం నిల్వ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని ఓడరేవులకు తరలిస్తున్నారు. బియ్యం వ్యాపారం పేరుతో వీరు అక్రమ రవాణా చేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలోనే కొన్ని రైస్‌మిల్లులు

## శనివారమొస్తే సెలవే!

యర్రగొండపాలెం : వై.పాలెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ కోసం గిరిజన విద్యార్థులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అటవీ ప్రాంతాల నుంచి కష్టపడి వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆవేదనతో వారు వెనుదిరుగుతున్నారు. యర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయానికి శనివారం వెంకటాద్రిపాలెం పంచాయతీ లోని అంకమ్మ చెంచుగూడేనికి చెందిన విద్యార్థి చెంచు గిరిజన బాలిక కుడుముల బుజ్జమ్మ బంధువును తోడు తీసుకొని వచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులు చిన్నతనంలో క్షయతో చనిపోయారు. సోదరుడు మద్యానికి బానిసగా మారడంతో గూడేనికి చెందిన రమణమ్మ అనే మహిళ బాలికను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదువుకు తోడ్పడుతోంది. ఇటీవల బుజ్జమ్మ ఇంటర్ పూర్తి చేసింది. చదువుకునే చెంచు గిరిజనుల పిల్లలకు ఆర్డీటీ సంస్థ సహకారం అందిస్తోంది.



ఈ విధంగానే ఈ బాలికకు 1వ తరగతి నుంచి ప్రతి ఏడాది చదువు కోసం ఆర్డీటీ సంస్థ బాలిక అకౌంట్‌లో కొంత నగదు జమ చేస్తోంది. ఈ విధంగా సమకూరిన రూ.15,000లను డ్రా చేసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చేరేందుకు బాలిక సిద్ధమైంది. అయితే ఆ నగదు తీసుకోవాలంటే ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్‌ను అవసరమని ఆర్డీటీ వారు తెలియజేయడంతో ఆ సర్టిఫికెట్ కోసం నెల రోజుల కిందట వెంకటాద్రిపాలెం సచివాలయంలో బుజ్జమ్మ దరఖాస్తు చేసుకుంది.. దీనిపై వీఆర్వో సంతకం చేయాలి. అప్పటి నుంచి దీనిపై సంతకం చేయాల్సిన వీఆర్వో చెన్నయ్య వారికి చిక్కడం లేదు. నెల నుంచి తాము సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పోతున్నామని బుజమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చామని, ఎవరూ లేకపోవడంతో వెళ్లిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ విషయంపై తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డికి ఫోన్ చేయగా ఆయన వెంటనే వీఆర్వో చెన్నయ్యకు చెప్పి చెక్ స్లిప్ మీద సంతకం చేయించి సర్టిఫికెట్‌ను అందజేస్తామని తెలియజేశారు.

# అటు చూడరు.. బెల్టు తీయరు!



అనంతపురం : అనంతపురంలోని అశోక్‌నగర్, రాంనగర్, పాతూరు, గుత్తిరోడ్డు, బళ్లారి బైపాస్ ప్రాంతాల్లో వైన్‌షాపుల నిర్వాహకులు అనధికార పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే తాగేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అనుమతులు లేకుండానే ప్రతి వైన్ షాపు వద్ద ఓ మినీ బార్ నిర్వహిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో మందుబాబులు స్వైరవిహారం చేస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, శెట్టూరుతో పాటు కళ్యాణదుర్గంలో బెల్టుషాపులు వెలిశాయి. ఆయా గొలుసు దుకాణాల్లో కర్ణాటక మద్యం సైతం విక్రయిస్తున్నారు. రాయదుర్గం ప్రాంతంలో స్థానిక నాయకుల కనుసన్నల్లో బెల్టుషాపులు నడుస్తున్నాయి.

కూడేరు మండలంలో వైన్‌షాపు నిర్వాహకులే ప్రతి గ్రామంలో ఒకరిని ఏర్పాటు చేసుకుని బెల్టుషాపులు నడుపుతున్నారు. ఏరోజుకు ఆరోజు అమ్మకాలను బట్టి వసూలు చేసుకుంటున్నారు.

పల్లెల్లో బెల్టుషాపుల దందా సాగుతోంది. మారుమూల ప్రాంతాల్లోనూ గొలుసు దుకాణాలు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. గ్రామాల్లోనే మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యానికి బానిసవుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి దోపిడి చేస్తున్నారు. సమయాన్ని బట్టి ఒక్కో సీసాకు రూ.30 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల అండతోనే గ్రామానికి ఒకరు చొప్పున బెల్టుషాపు ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**వైన్‌షాపులకు అనుబంధంగా..**

మండల కేంద్రాల్లో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటైన మద్యం దుకాణాలకు అనుబంధంగా ప్రతి గ్రామంలో బెల్టుషాపులు వెలిశాయి. ఒక్కో వైన్‌షాపు పరిధిలో 10 నుంచి 25 వరకు గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్‌శాఖ నిద్ర నటిస్తోంది. మొదట్లో తనిఖీల పేరుతో హడావుడి చేసిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు.. అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అడపాదడపా పట్టుకున్నా రాజకీయ ఒత్తిళ్లతో కేసులు కట్టకుండా వదిలేస్తున్నారు.

**కిరాణా దుకాణాల్లోనే..**

గ్రామాల్లో పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. వైన్‌షాపుల నుంచి నిత్యం ఆటోలు, బైకుల ద్వారా మద్యం సీసాలు తెప్పించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టుషాపుల వద్దే ప్రత్యేకంగా గుడిసెలు ఏర్పాటు చేసి అక్కడే తాగేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పల్లెల్లో రాత్రి వేళల్లోనూ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

# షిప్‌యార్డు నూతన సీఎండీ ఎవరో?!




సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నియామక ప్రక్రియ పూర్తికాలేదు. సంస్థ సీఎండీగా ప్రస్తుతం కమొడోర్ హేమంత్‌ఖత్రీ వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీ కాలం వచ్చే నెలాఖరు వరకు ఉంది. కేంద్ర ప్రభుత్వ కంపెనీ నిబంధనల ప్రకారం ఆర్నెల్ల కిందటే కొత్త నియామక నోటిఫికేషన్ వెలువడింది. దేశవ్యాప్తంగా పలు కంపెనీల నుంచే కాకుండా భారత నౌకాదళంలో అధికారులుగా పనిచేసిన పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

ఇటీవల నియామక బోర్డు ఇంటర్వ్యూలను ఇప్పటికే నిర్వహించింది. తుది జాబితాలో 12 మందికి చోటు దక్కింది. వీరిలో ఇద్దరు భారత నేవీకి చెందిన అధికారులు కూడా ఉండటం విశేషం. ప్రస్తుతం సీఎండీగా ఉన్న కమొడోర్ హేమంత్ ఖత్రీ కూడా షిప్‌యార్డుకి తొలుత వ్యూహాత్మక ప్లానింగ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత సీఎండీగా నియమితులయ్యారు. ఇప్పటికీ కొత్త సీఎండీ ఎవరనేది తేల్చకపోవడం ఒకింత ఊహాగానాలకు తెరలేపుతోంది. ప్రస్తుత సీఎండీ హేమంత్ ఖత్రీనే మరో రెండేళ్లపాటు పొడిగించే అవకాశాలు లేకపోలేదని ఉద్యోగవర్గాల్లో చర్చసాగుతోంది.

**సాగర తీరాన సరికొత్త లోకం**

నగర పర్యాటకంలో కైలాసగిరి కీలకపాత్ర పోషిస్తోంది. ఇక్కడికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వారిని అలరించడానికి గతంలో తెదేపా హయాంలో రోప్‌వే అందుబాటులోకి తెచ్చారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కైలాసగిరిని పట్టించుకోలేదు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ఏర్పాటు కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తోంది. ఇటీవల వీఎంఆర్డీఏ స్కై సైక్లింగ్, జిప్‌లైనర్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు పర్యాటకులను మరింత ఆకర్షించడానికి తేలియాడే గాజు వంతెనకు శ్రీకారం చుట్టింది.

**రూ.6కోట్ల వ్యయంతో:** కైలాసగిరిపై గతంలో టైటానిక్ వ్యూ పాయింట్ ఉండేది. అక్కడి నుంచి చూస్తే సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని చూడటానికే ఇక్కడికి పర్యాటకులు వచ్చేవారు. తర్వాత అది శిథిలమైంది. ప్రస్తుతం దాని స్థానంలో తేలియాడే గాజువంతెన నిర్మిస్తున్నారు. దీనికి రూ.6కోట్లు వెచ్చిస్తున్నారు. వంతెన పొడవు 50 మీటర్లు ఉంటుంది. ఒకేసారి 40మంది వరకు ఎక్కవచ్చు. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయి. జులై నెలాఖరుకు అందుబాటులోకి వస్తుందని వీఎంఆర్డీఏ అధికారులు చెబుతున్నారు.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు: పశ్చిమబెంగాల్, ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు స్కైసైక్లింగ్, జిప్‌లైనర్, రోప్‌వే, అద్దాల ఏసీ రైలుబండికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వీటి ద్వారా వీఎంఆర్డీఏకు ఆదాయం కూడా సమకూరుతోంది. ఇప్పుడు కొత్తగా గాజు వంతెన ఏర్పాటైతే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.


**రాష్ట్రంలో తొలిసారి:** తేలియాడే గాజు వంతెన దక్షిణ భారతదేశంలో కేరళ రాష్ట్రంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విశాఖ నగరంలో ఏర్పాటు చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే దేశంలోనే అతి పొడవైన గాజు వంతెనగా పేరు పొందుతుంది. దీనిపైకి ఎక్కిచూస్తే చుట్టూ ఎత్తయిన కొండలు, కింది భాగంలో లోయ, కనుచూపు మేరలో సాగరం కనిపిస్తాయి. గాల్లో తేలియాడుతున్నట్లు, కొత్త లోకంలో విహరిస్తున్న భావన పర్యాటకులకు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

**జులై నెలాఖరుకు అందుబాటులోకి:** ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గత ఏడాది నవంబరులో ప్రారంభమైంది. ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురావాలని అనుకున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పనులకు అంతరాయం కలిగింది. వర్షాలతో ఆటంకం కలగకుంటే జులై నెలాఖరుకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈ మేరకు నిర్మాణం చేస్తున్న ప్రైవేటు సంస్థతో చర్చిస్తున్నాం. పర్యాటకుల నుంచి వసూలు చేసే రుసుములో 45శాతం వీఎంఆర్డీఏకు వస్తుంది.

బలరామరాజు, ఎస్ఈ, వీఎంఆర్‌డీఏ

# కదలక.. మెదలక

కోట : డాలర్ల పంట రొయ్య.. సాగుదారులకు నష్టాలు మిగులుస్తోంది. అమెరికా సుంకాల దెబ్బకు కుదేలై కొంతకాలం ఇబ్బందులు పడ్డారు. పరిస్థితులు కుదుటపడి ధరలు పెరగడంతో ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో తెల్లమచ్చ వ్యాధితో నష్టపోతున్నారు. జిల్లా పరిధిలోని కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల్లో ఆరువేల హెక్టార్లలో రొయ్యలు సాగు చేస్తున్నారు. అనధికారికంగా మరో ఐదు వేల హెక్టార్లలో సాగు ఉంది. ఎకరా సాగుకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఈక్రమంలోనే వాతావరణంలో పెనుమార్పులు వచ్చాయి. వాతావరణం చల్లబడింది. ఈ కారణంతో వంద నుంచి 110 రోజులకు 40 కౌంట్ వరకు పెరుగుదల ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 140 రోజులు పడుతోంది. ప్రస్తుతం సాగు 60 రోజులకు చేరింది. ఈ క్రమంలోనే బరువు 10 గ్రాముల నుంచి 12 గ్రాములకు చేరాలి. తెల్లమచ్చ వ్యాధితో చెరువుల్లోని రొయ్య లు 5 గ్రాముల బరువుకే పరిమితం అవుతున్నాయి. శరీరంపై తెల్లటి మచ్చలతో కదలడం లేదు. నీటిలో తేలుతూ చురుకుదనం లేకుండా కనిస్తున్నాయి. ఆహారం సక్రమంగా తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే రైతులు ముందుగానే విక్రయిస్తూ ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పైగా నష్టపోతున్నారు.



**ఆరు ఎకరాల్లో సాగు చేశా** ఆరు ఎకరాల్లో రొయ్యలసాగు చేశా. ఇప్పటికే 60 రోజులైంది. తెల్లమచ్చ వ్యాధితో ఎదుగుదల లేకుండాపోయింది. 12 గ్రాములు ఉండాల్సిన రొయ్య 5–6 గ్రాములు మాత్రమే ఉన్నాయి. వ్యాధి ముదిరితే మృతి చెందుతాయని ముందే విక్రయిస్తూ రూ.లక్షల్లో నష్టపోయా.

జానకిరామ్‌రెడ్డి, దొరువుకట్ట**వాతావరణంలో మార్పులే కారణం** వాతావరణంలో మార్పులు కారణంగానే తెల్లమచ్చ తెగులు వస్తుంది. దీనికి నివారణ మేలైన పిల్లలు వేయడమే. మేతలో నిబంధనలు పాటించాలి. నిపుణులు సూచనలు పాటిస్తూ సాగు చేయాలి. అప్పుడే అధిక దిగుబడులు పొందుతారు. నష్టాలు ఉండవు. రెడ్యానాయక్, ఎఫ్‌డీవో

## 55 ఏళ్ల ప్రాజెక్టు ప్రశ్నార్థకం!

తిరుపతి : తిరుపతిలోని అఖిల భారత పందుల పరిశోధన స్థానం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా పాలనలో పరిశోధనలపై జరిగిన నిర్లక్ష్యాన్ని గుర్తించిన ఐసీఏఆర్ ఏడాది కిందట నిధులు నిలిపివేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అసలే ఆర్థికంగా కుదేలైన పశువైద్య వర్సిటీకి ఈ పరిశోధనా స్థానం నిర్వహణ అదనపు భారంగా పరిణమించింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) దేశవ్యాప్తంగా పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అఖిలభారత స్థాయిలో పరిశోధనా ప్రాజెక్టుల్ని 1970లో మంజూరు చేసింది. ఆ మేరకు 1971లో స్థానిక పశువైద్య కళాశాల ఆవరణలో పందుల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. యూకేకు చెందిన లార్జ్ వైట్ యార్క్‌షైర్ అనే తెల్లజాతి పందితో స్థానిక పందులను సంకరపరిచారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పోషణ, మేలుజాతి పందుల ఉత్పత్తి, దేశవాళీ జాతుల పరిరక్షణ వంటి అనేక అంశాల్లో ప్రగతి సాధించారు. తిరుపతి–17 జాతిని సైతం ఆవిష్కరించారు. ఏటా ఐసీఏఆర్ నుంచి రూ.30 లక్షల వరకు నిధులు అందడంతో షెడ్ల నిర్వహణ, దాణా,



పరిశోధనలు, సిబ్బంది జీతభత్యాలకు ఎటువంటి ఢోకా ఉండేది కాదు. ప్రస్తుతం పరిశోధనా స్థానంలో 150 వరకు పందులు ఉండగా వాటికి అవసరమైన దాణా, సిబ్బంది జీతభత్యాలకు రూ.11 లక్షల వరకు విశ్వవిద్యాలయం భరిస్తోంది.

**ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం:** ఏటా 500 వరకు సంకరజాతి పిల్లల్ని ఔత్సాహిక రైతులకు విక్రయించేవారు. ఇలా కేంద్రానికి ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వెయ్యిమంది వరకు ఔత్సాహికులకు పందుల పెంపకంలో శిక్షణ ఇచ్చేవారు. తిరుపతి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులు ఉండగా తిరుపతికి మాత్రమే నిధులు ఆపడం గమనార్హం. వైకాపా హయాంలో వర్సిటీ అధికారులు ప్రాజెక్టు ఫలితాలపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు ఆరోపణలున్నాయి. ప్రాజెక్టుల జాబితా నుంచి తిరుపతి పేరు ఇంకా తొలగించలేదని, త్వరలో నిధులు సాధిస్తామని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

## 'ఐదేళ్లు'.. గుండెల్లో గుబులు!

విశాఖపట్నం : వైద్యుల బదిలీలకు సంబంధించి... ఐదేళ్లు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 17వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తవనుంది.

**ఏఎంసీ పరిధిలో... :** కొత్త నిబంధన ప్రకారం.. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు 59 మంది వరకు ఉన్నట్టు లెక్క కట్టారు. వారిలో 15 మంది ప్రొఫెసర్లు, 9 మంది సహ ప్రొఫెసర్లు, 35 మంది సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు. ఏఎంసీ పరిధిలో కేజీహెచ్‌తో సహా ఏడు ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల సర్వీసును బట్టి, బదిలీలకు అర్హులుగా నిర్ణయించారు.


**ఓ ప్రొఫెసర్..** భిన్నవాదనలు: మెడిసిన్ విభాగంలో ఏళ్ల నుంచి ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఓ వైద్యుడి విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ వైద్యుడు కొవిడ్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు విజయవాడలో సేవలు అందించారు. నాటి ప్రభుత్వం దాన్ని బదిలీగా పరిగణించి, 2023లో జీఓ ఇచ్చింది. అయితే కేజీహెచ్‌లో వేతనం తీసుకుని, విజయవాడలో పని చేసినంత మాత్రాన.. అది బదిలీ కిందకు రాదని, కేవలం డిప్యుటేషనే అవుతుందని మిగిలిన వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు ఆయన బదిలీకి అర్హుడే అని వారు వాదిస్తున్నారు. కానీ, ప్రభుత్వం జీఓ జారీ చేసినందుకు ఆయన పని చేసిన కాలాన్ని డిప్యుటేషన్‌గా పరిగణించలేమని, అది బదిలీ కిందకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ మేరకు ఆయన 2023 నుంచి ఏఎంసీ పరిధిలో కొనసాగుతున్నట్టు తేల్చి, బదిలీల జాబితాలో పేరు చేర్చలేదు.

**ఉరుకులు.. పరుగులు..**

బదిలీకి అవకాశం ఉన్న వైద్యులంతా ఇప్పుడు ప్రజా ప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమను ఏదో విధంగా ఏఎంసీకి అనుబంధంగా ఉండే కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో కొనసాగించేలా చూడాలని విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం బదిలీల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వరాదని, జీఓ ప్రకారం బదిలీ చేయాల్సిందేనని తేల్చి చెబుతోంది. భార్యాభర్తలు ఒకే చోట పని చేస్తున్నా, దివ్యాంగులైనా, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నా... అలాంటి వారికి కాస్త వెసులుబాటు ఇస్తున్నారు.

## బెత్త విత్తనాల పట్టివేత!

నర్సీపట్నం : తేదీలేని కాంపౌండింగ్ ఫండ్ రసీదుతో వ్యాన్‌లో తరలిస్తున్న బెత్త (రట్టన్) విత్తనాలను అటవీ అధికారులు గొలుగొండ మండలం చీడిగుమ్మల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు మండలం అన్నవరం, కన్నవరం, నల్లబిల్లి, పెద అగ్రహారం, చీడిపల్లి గ్రామాల్లో సేకరించిన ఈ విత్తనాలను ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకు తీసుకువెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బెత్త పిక్కలను మెడలో ధరించే



పూసలుగా తయారు చేసి విక్రయిస్తుంటామని నిందితులు అధికారులకు వివరించారు. ఈ విత్తనాలను మొక్కలుగా పెంచి ఒడిశాకు తరలిస్తుంటారని సమాచారం. ఈ చెట్ల నుంచి వచ్చే కలప ఎంతో నాణ్యమైందిగా చెబుతున్నారు. లాఠీలు, కేన్ ఫర్నీచర్ మాదిరి గృహోపకరణాలు తయారు చేయవచ్చని, కొన్ని రకాల ఔషధాల్లోనూ వినియోగిస్తారని సమాచారం. పట్టుబడిన విత్తనాల విలువ రూ.40 వేల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా. తేదీ లేకుండా పట్టుబడిన రసీదు అల్లూరి జిల్లాలోని ఓ రేంజ్ అధికారి పేరున ఉంది. కావాలని తేదీ వేయలేదా... ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. రాత్రి ఈ విత్తనాలు పట్టుబడగా, వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకు తరలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి లక్ష్మీనర్స్ వెల్లడించారు.

# ర్యాంకులో పురోగతి.. సౌకర్యాలు అధోగతి

దువ్వాడ : దువ్వాడ రైల్వేస్టేషన్ అటు ఆదాయంతో ఇటు ప్రయాణికుల సంఖ్యను కూడా రోజురోజుకు పెంచుకుంటోంది. ర్యాంకు కూడా మెరుగుపర్చు కుంటూ ముందుకెళ్తోంది. అయితే సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఈ లోటు కూడా భర్తీ చేస్తే ఇంకా మెరుగైన ర్యాంకుకు చేరుకునే అవకాశం లేకపోలేదు. **10వ ర్యాంకు సాధించే..:** దువ్వాడ రైల్వేస్టేషన్ 2023-24లో ఈస్టుకోస్ట్ రైల్వే పరిధిలో 13వ ర్యాంకులో ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 10వ ర్యాంకు కైవసం చేసుకుంది. 2023-24లో రూ.27.19 కోట్ల ఆదాయం రాగా.. 2024-25కు రూ.37.53 కోట్లకు పెరిగింది. స్టేషన్ నుంచి ప్రయాణించేవారి సంఖ్య 9.85 లక్షల నుంచి 12.47 లక్షలకు చేరుకుంది. గత ఏడాది 13వ ర్యాంకులో ఉండగా.. శ్రీకాకుళం రోడ్డు, రాయగడలను అధిగమించి 10వ స్థానానికి చేరింది. అటు ప్రయాణికులు, ఇటు ఆదాయం పరంగా మంచి పురోగతి సాధించింది.

**ఇలా సాధ్యమయ్యే..:** దువ్వాడ చుట్టుపక్కల పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందింది. ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్న వారి రాకపోకలు పెరిగాయి. దీంతో నివాసాలు విస్తృత మయ్యాయి. గాజువాక, పశ్చిమ, పెందుర్తి నియోజక వర్గాలకు చెందిన ఎక్కువ మంది ప్రజలు తమ రైలు ప్రయాణాలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌నే ఆశ్రయిస్తున్నారు. దువ్వాడ




నుంచి ప్రధాన రైల్వేస్టేషన్‌కు రైళ్లు చేరుకోవడానికి చాలా సమయం తీసుకుంటుండంతో ఎక్కువమంది దువ్వాడ స్టేషన్‌లో దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్ని రైళ్లు ప్రధాన స్టేషన్‌కు వెళ్లకుండానే దువ్వాడ నుంచి వెళ్లిపోతుండటంతో వల్ల కూడా ఈ స్టేషన్‌కు రద్దీ పెరిగింది.

**మరి అభివృద్ధి ఏది?:** ఆదాయం, ప్రయాణికుల సంఖ్యను బట్టి ర్యాంకులు మెరుగుపడుతున్నా.. ఆ స్థాయిలో సౌకర్యాలు ఉండటం లేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా కేటాయించిన రూ.26.31 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి.ప్రధాన భవనం నుంచి నాలుగో ప్లాట్‌ఫామ్ వరకు 12 మీటర్ల వెడల్పుతో చేపడుతున్న నడక వంతెన నిర్మాణ పనులు పడకేశాయి. కేవలం 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇనుప స్తంభాలు మాత్రమే ఏర్పాటుచేశారు. డ్రాయింగ్ సవరణ జరగాల్సి ఉంది.కార్లు, ద్విచక్ర వాహనాల కోసం నిర్మించాల్సిన పార్కింగ్ షెడ్ల ఊసేలేదు. మొదటి ప్లాట్‌ఫామ్ వైపు పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండ, వానల్లోనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. పార్కింగ్ ఫీజుల మోత మోగిస్తున్నా షెడ్ల నిర్మాణంపై దృషి సారించడంలేదు. ప్రస్తుతం స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ఒక్క లిఫ్టు కూడా తరచూ మొరాయి స్తుండడంతో మెట్ల మార్గాన్నే ఆశ్రయించాల్సి వస్తోంది. కొత్త నడక వంతెనకు అనుసంధానంగా మరో మూడు లిఫ్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. నాల్గో ప్లాట్‌ఫామ్‌ను అనకాపల్లివైపు 90 మీటర్లు విస్తరించాల్సి ఉంది. కూడా అసంపూర్తిగానే ఉన్నాయి.

# డంపింగ్ యార్డులకు మోక్షం

పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగరపాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, కుప్పం పురపాలికలను స్వచ్ఛంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. నగరపాలికలు, పురపాలికల్లో పోగయ్యే వ్యర్థాలను జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు డంపింగ్ యార్డుల్లో రీసైక్లింగ్ చేస్తున్నారు.. వ్యర్థాల నుంచి కంపోస్టు మట్టి, రాళ్లు, ప్లాస్టిక్ వస్తువులను యంత్రం ద్వారా వేరేచేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.. మొదట విడతలో రెండు నగరపాలికలు, మూడు పురపాలికల్లో చేపట్టేందుకు ఏప్రిల్ 24న మున్సిపల్ కమిషనర్లతో డీఎంఏ అధికారులు సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఘన వ్యర్థాలను నెల్లూరులో నెలకొల్పనున్న ఐటీసీ ప్లాంట్‌కు తరలిస్తారు. తిరుపతి జిల్లా పుత్తూరు పురపాలికలో ప్రస్తుతం రీసైక్లింగ్ ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే చిత్తూరు, తిరుపతి నగర పాలికలకు ఘనవ్యర్థాల రీసైక్లింగ్ చేపట్టారు. పుత్తూరులో తాజాగా ప్రారంభం కాగా, శ్రీకాళహస్తి, కుప్పంలో రీసైక్లింగ్‌కు సంబంధించి యంత్రాలు అమర్చుతున్నారు. దీనికితోడు తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారు. డివిజన్లు, వార్డుల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను, యార్డుకు తరలించి తడి, పొడి వ్యర్థాలు వేరుచేస్తున్నారు. తడి, పొడి వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు వేరు చేసే పనులు గతంలో ప్రారంభించినా అప్పటి వైకాపా ప్రభుత్వం ఆ పనులను అర్థాంతరంగా నిలిపివేసింది.

**కూటమి ప్రభుత్వం దృష్టి**



కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేందుకు ఉపక్రమిస్తోంది. ఎన్జీటీ మార్గదర్శకాలు పాటిస్తూ యంత్రాల ద్వారా వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను వేరు చేసే కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబరు 30 నాటికి పూర్తి స్థాయిలో వ్యర్థాలను శుభ్రం చేసి ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన పార్కుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో శుద్ధి చేసే యంత్రాన్ని తెప్పించి పనులు చేపడుతున్నారు. ఎరువును రైతులకు అందించనున్నారు.

**ప్రజల సహకారంతోనే..**

పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం కోసం చేపడుతున్న ఈ పనులకు ప్రజల సహకారం ఎంతో అవసరం. స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా ఈ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. తద్వారా భవిష్యత్తులో వ్యర్థాల గుట్టలు కనిపించవు. డంపింగ్‌యార్డులకు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. భవిష్యత్తులో డంపింగ్‌యార్డులు ఆహ్లాదాన్ని పంచనున్నాయి.

విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# సూది.. దారమూ కరవే!



అనంతపురం : ఉచితంగా మెరుగైన వైద్యం అందుతుందన్న ఆశతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్న రోగులకు అరకొర సేవలే అందుతున్నాయి. రోజూ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి 1,200 మంది వస్తుంటారు. అందులో ఆర్థో విభాగం ఓపీకి 200, అడ్మిషన్లు 10 వరకు ఉంటాయి. రోజూ 7 నుంచి 10 వరకు శస్త్రచికిత్సలు జరుగుతుంటాయి. అందుకు అవసరమయ్యే సూది, దారంతో పాటు ఇతర సామగ్రి బయట కొనుగోలు చేసి తీసుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు సరైన మంచాలు లేక వాటి కింద ఇటుకలు ఉంచాల్సిన దుస్థితి. కాళ్లు విరిగినవారు మరుగుదొడ్డి వెళ్లాలంటే నానా అగచాట్లు పడుతున్నారు. రోగులను తరలించడానికి సిబ్బంది డబ్బులు డిమాండు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బెడ్‌షీట్లు సైతం సక్రమంగా మార్చడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కొన్ని సరఫరా కావడం లేదు**

డాక్టర్ ఆత్మారాం, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఆర్థో విభాగంలో శస్త్రచికిత్సలకు అవసరమయ్యే దారం (ప్రోలిన్) ఆరు నెలలుగా సరఫరా చేయటం లేదు. కొన్నింటిని బయట తెచ్చుకోవాలని రాసిస్తున్నాం. మోకాళ్ల శస్త్రచికిత్స ఎన్టీఆర్ వైద్యసేవ కిందకు రావు. ఇన్‌ప్లాంట్స్ బయట తెచ్చుకుంటే శస్త్రచికిత్స చేసి అమరుస్తాం. మంచాల కింద ఇటుకలు ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఏర్పాటు చేశాం. ఎవరైనా సిబ్బంది డబ్బులు అడిగినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

**చీటీ రాసిస్తున్నారు**

నాగేంద్ర, కుందుర్పి

నా భార్య మోకాలిపై గడ్డరావటంతో ఆర్థోవిభాగంలో చేర్చా. శస్త్రచికిత్స చేసేందుకు అవసరమయ్యే సూది, దారంతో పాటు ఇతర సామగ్రి లేదని వైద్యుడు చీటీ రాసివ్వటంతో ప్రైవేట్‌గా కొనుగోలు చేసి అందజేశా. సెలైన్ అయిపోతే కనీసం వచ్చి తీసేయటం లేదు. ఆపరేషన్‌కు తీసుకెళ్లేముందు రోగికి అందించే దుస్తులు ఉతికి ఇవ్వటం లేదు. సర్జరీ తరువాత రోగి సహాయకులే దుస్తులు ఉతికి ఇవ్వాలని చెబుతున్నారు.

**రూ.లక్ష ఖర్చు అవుతుందంట**

సేవానాయక్, ఓబులనాయణపల్లి తండా

నా భార్యకు మోకాళ్లనొప్పులు రావటంతో ఆసుపత్రికి వచ్చాం. వైద్యులు పరీక్షలు చేసి ఆర్థో వార్డులో చేర్చారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు. వారం రోజులు వార్డులో ఉన్నా వైద్యం అందించలేదు. మోకాళ్ల శస్త్రచికిత్స చేయాలంటే రూ.లక్ష ఖర్చు అవుతుందని వైద్యుడు చెప్పారు. అంత మొత్తం ఉంటే ఇక్కడికి ఎందుకు వచ్చేవాళ్లం.

# కదిలిస్తే చాలు.. ఇంటింటా కన్నీళ్లు



పుట్టపర్తి : బీడీ కాల్చకుండానే కార్మికుల బతుకులు పొగచూరిపోతున్నాయి. తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నా.. వారి తలరాతలు మారడం లేదు. ఫ్యాక్టరీ యజయమాని, కార్మికుడి మధ్య ఏజెంట్లదే పెత్తనం. ఫలితంగా బాల్యం మొదలు వృద్ధాప్యం వరకు పొగాకుతో సహవాసం చేస్తూ అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో కదిరి, తాడిపత్రి, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో 18 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు. వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదు. బీడీ కార్మికులు, ఫ్యాక్టరీ(గడంగ్)లకు మధ్య ఏజెంట్లు దళారీలుగా వ్యవహరిస్తున్నారు. 40-50 ఏళ్లుగా బీడీలే చుడుతున్నా అసంఘటిత కార్మికులుగానే ఉండిపోయారు. కదిరిలో సుమారు 10 వేలమంది ఈ వృత్తిలో ఉండగా 11 మందికి మాత్రమే కార్మికశాఖ గుర్తింపు కార్డులు ఉన్నాయంటే పరిస్థితి అర్థమవుతోంది. తాడిపత్రిలో 7,800 మంది మహిళలు ఉన్నారు. గుర్తింపులేక ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు, గృహాలు, పింఛను, బీమా సదుపాయాలు దూరమయ్యాయి. ఒక్కోచోట ఒక్కోలా కూలి ఇస్తున్నారు. కిలో ఆకు, రెండుసేర్ల పొగాకుతో 2 వేల బీడీలు తయారు చేయాలి. అందులో తగ్గిన ప్రతి వంద బీడీలకు రూ.20 కూలిలో కోత పెడుతున్నారు. సంక్షేమ పథకాల అమలు కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పేదరికం.. జబ్బుల వేధింపు**

ప్రతి కుటుంబంలోనూ ఎవరో ఒకరు జబ్బుకు గురైన పరిస్థితులున్నాయి. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులు అధికంగా సంక్రమిస్తున్నాయి. ఎక్కువ కాలం పనిచేసిన పెద్దలు ఎంతోమంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. కుటుంబ పెద్ద మృతి, వారసులకు జబ్బు సోకినా ఉదర పోషణకు ప్రత్యామ్నాయం లేక బీడీలు చుట్టాల్సిందే. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మందులు దొరక్క, ప్రైవేటులో కొనే స్తోమత కొరవడి జీవన పోరాటం సాగిస్తున్నారు.

**50 ఏళ్లుగా పని చేస్తున్నా..**

షేక్ దిల్షాద్, నిజాంవలీ కాలనీ, కదిరి

పదేళ్ల వయసు నుంచే బీడీలు చుడుతున్నా.. 60 ఏళ్లు దాటాయి. కొడుకు, కూతురుకి పెళ్లిళ్లు కావడంతో వేరుగా ఉంటున్నారు. వృద్ధాప్యంతో పనిచేయడానికి ఓపిక లేదు. శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతున్నా. కళ్లు కనిపించటం లేదు. భర్త పక్షవాతంతో ఏపనీ చేయలేని స్థితి. మా అన్న టీబీతో మృతి చెందాడు. మేమిద్దరం రోజుకు 800 బీడీలకు మించి చుట్టలేని స్థితి. వృద్ధాప్య పింఛను రూ.4 వేలే జీవనాధారం.

**రోజుకు రూ.150..**

అక్తర్, నిజాంవలీ కాలనీ

రోజుకు రూ.150 మించి కూలి రావడం లేదు. భర్త ఐదేళ్ల క్రితం ప్రమాదానికి గురై మృతి చెందాడు. నలుగురు పిల్లల భారం మోస్తున్నాను. అనారోగ్య సమస్య ఉంది. మందులకు నెలకు రూ.3 వేలు ఖర్చవుతోంది. డబ్బుల్లేక సగం మందులే తెచ్చుకుంటున్నా. ఉండటానికి ఇల్లు లేదు. అధికారులు స్పందించి గుర్తింపు కార్డులివ్వాలి.

# నష్టాన్ని తగ్గించి.. నిరంతర సరఫరా అందించి..

గురుద్వారా : వర్షాకాలం వచ్చిందంటే పెను తుపాన్ల కారణంగా వృక్షాలు, స్తంభాలు కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలపై పడి విద్యుత్తు వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. దీంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు రూ. కోట్లలో నష్టం వాటిల్లుతోంది. ఇటువంటి ప్రకృతి విపత్తులను దీటుగా ఎదుర్కొని సాధ్యమైనంత వరకు విద్యుత్తు అంతరాయాలు లేకుండా ఉండేలా వర్షాకాలంలో ముందుగా నిర్వహించే 'మాన్‌సూన్' ప్రక్రియను ఏపీఈపీడీసీఎల్ ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తగరపువలస నుంచి అనకాపల్లి వరకు 'మాన్‌సూన్' పనుల నిమిత్తం రూ.2.9 కోట్లు నిధులు మంజూరు చేశారు.

**నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ..**

నగరంలోని 43 విద్యుత్తు కార్యాలయాల్లో జూనియర్, సహాయ జూనియర్ లైన్‌మెన్లతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు మీదుగా ఏపుగా పెరిగిన చెట్లు కొమ్మలు తొలగించడం, 33, 11 కేవీ సబ్‌స్టేషన్లు ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ నెట్వర్క్, ఇతరచోట్ల దెబ్బతిన్న విద్యుత్తు తీగలు, స్తంభాలు మార్చడం వంటివి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరిగే పనులను సకాలంలో పూర్తి చేయడమే గాక పనితీరుపై నిత్యం ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ధ్యేయంగా సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే



90 శాతం పనులు పూర్తికాగా మిగతా 10 శాతం పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా కార్యాచరణ జరుగుతుందని ఎస్‌ఈ శ్యామ్‌బాబు అన్నారు. అనుకోకుండా విద్యుత్తు అంతరాయాలు సంభవిస్తే వినియోగదారులు 1912కు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

# పోగుకు భౌగోళిక పాగా

ఎమ్మిగనూరు: మగ్గమే ఇల్లు.. నరాలే దారాలు.. శ్రమనే పెట్టుబడి.. చెమట చుక్కలే రంగులు.. అలుపు మరచి అహర్నిశలు కష్టపడుతున్న శ్రమజీవి విలువ 'గుర్తింపు'నకు అడుగులు పడుతున్నాయి. సహజ సిద్ధమైన రంగులు.. మృదువైన వస్త్రం.. విభిన్న డిజైన్లతో మార్కెట్లో 'పోటీ' తట్టుకొని దేశవిదేశాల్లో ఆదరణ పొందుతున్న చేనేతపురి ఉత్పత్తుల గుర్తింపునకు మార్గం సుగమమైంది. కంటికి కనిపించని పోగులను మగ్గంపై అతికించి ఎమ్మిగనూరు చేనేత వనితలు తమ నైపుణ్యాన్ని చాటుతున్నారు. వీరి చేతిలో రూపుదిద్దుకున్న బర్డ్సై తువ్వాళ్లు, జిందగి దుప్పట్లు, చేతిరుమాలు, తువ్వాళ్లు, దోమతెరలు, న్యాప్‌కిన్స్ వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ మహిళా శక్తిని చాటుతున్నారు. వీటిలో అత్యంత ఆదరణ పొందిన బర్డ్సై తువ్వాళు, జిందగి దుప్పట్లకు భౌగోళిక గుర్తింపు తీసుకురావడానికి రెసల్యాట్ బీ2బీ సంస్థ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు.

**'దారం'లో దాగిన ప్రత్యేకత**

పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో ఎమ్మిగనూరు చేనేత సహకార పరపతి సంఘాన్ని స్థాపించారు. సంఘం ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా గుర్తించిన నూలు దారాలు వినియోగిస్తారు. తమిళనాడులోని కోయంబత్తూరు,



కర్ణాటకలోని దావణగేరి డిపోల ద్వారా నూలు సరఫరా అవుతోంది. ఏటా రూ.3 కోట్ల మేరకు లావాదేవీలు సాగుతాయి. హైదరాబాద్, రాయచూర్, గుల్బర్గ, కాకినాడ, విజయవాడ, అమరావతి, అనంతపురం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. " భౌగోళిక గుర్తింపు వస్తే సంఘం మరింత అభివృద్ధి దిశగా సాగుతుందని కొత్తవారికి ఉపాధి లభిస్తుందని" చేనేత జౌళీ శాఖ సహాయ సంచాలకులు అప్పాజీ అన్నారు.తువ్వాళ్ల తయారీలో మేటి ఈమె పేరు లక్ష్మమ్మ.. 60 ఏళ్ల వయసు.. భర్త ఈరన్నతో కలిసి చేనేత మగ్గం పని చేస్తుంటారు. నిత్యం 4 నుంచి 6 తువ్వాళ్లు నేస్తుంటారు. చిన్నప్పటి నుంచి తువ్వాళ్ల తయారీలో మేటిగా నిలుస్తున్నారు.

**జిందగి దుప్పట్లు**

జిందగి దుప్పట్లు ఎమ్మిగనూరు చేనేత సహకార సంస్థ నుంచి ఉత్పత్తి అవుతుంటాయి. ఒక్కోదాని పొడవు 2.29 మీటర్లు, వెడల్పు 1.52 మీటర్లు, బరువు 1.5 కిలోలు ఉంటుంది. వీటి తయారీకి కావాల్సిన ముడిసరకును విజయవాడ ఎన్‌హెచ్‌డీసీ ద్వారా కొనుగోలు చేసుకుంటారు. 2/70 కౌంట్ యారాన్ వినియోగిస్తారు. దుప్పటి, బెడ్‌షీట్ రెండు రకాలుగా వినియోగం ఉంటుంది. సొసైటీ ద్వారా డైయింగ్ చేసి రంగులు వేస్తారు. డిజైన్లు, కలర్లను సంస్థ చేస్తోంది. పర్యావరణహిత రంగులు వాడతారు. 16 చెక్క తొక్కుడు మగ్గాలపై నేస్తారు, ఈ దుప్పట్లు మృదువుగా ఉంటాయి. ఏడాదికి 300 వరకు ఉత్పత్తి చేస్తుంటారు.

**బర్డ్సై తువ్వాళ్లు భలే.. భలే**

తొక్కుడు చెక్క మగ్గాలపై బర్డ్సై తువ్వాళ్లు నేస్తారు. రెండు పోగుల నూలు పురిదారాలు ఉంటాయి. తయారైన తువ్వాళ్లు చూస్తే "పక్షి కన్ను" రూపంలో కనిపిస్తాయి. ఇవి మృదువుగా ఉండటంతోపాటు వెంటనే నీటిని పీల్చుకొనే గుణం ఉంటుంది. వీటికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నూలును ఎన్‌హెచ్‌డీసీ ద్వారా 2-20 దారాలను (పురిదారాలు) కొనుగోలు చేస్తారు. బండిల్ 4.5 కిలోల బరువు ఉంటుంది. ఒక కండీ ధర రూ.1,515. ఎమ్మిగనూరు సొసైటీ డైయింగ్ సెక్షన్లలో పర్యావరణ పరిరక్షణ కాపాడే రంగులను వినియోగిస్తారు. మూడు రోజులపాటు దారాలు ఆరబెట్టిన తర్వాత చేనేతలకు ఇస్తారు. వీటితో మగ్గాలపై తువ్వాళ్లు తయారు చేస్తారు. 1.60 మీటర్ల పొడవు, 0.74 మీటర్ల వెడల్పు ఉంటుంది. వీటికి 200 గ్రాముల నూలు ఉపయోగిస్తారు. ఏటా 6-7 వేల తువాళ్ల వరకు ఉత్పత్తి చేస్తుంటారు.

# క్రిసిటీపై సీఎం ప్రత్యేక దృష్టి

గూడూరు : కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిసిటీ) పనులు కొలిక్కి వస్తున్నాయి. వైకాపా హయాంలో ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల అమరావతిలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పియూష్ గోయల్‌తో చర్చించారు. ఆరు పారిశ్రామిక పార్కుల్లో మొదటి దశలో రూ.1,448 కోట్లతో చేపట్టనున్న మౌలిక వసతుల పనులకు ఈ వారంలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న ఈ పార్కు నిర్మాణం వేగంగా పూర్తిచేసి రూ.6000 కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి.



**మారనున్న రూపురేఖలు:** కృష్ణపట్నం పోర్టు నుంచి ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రూ.3,229.31 కోట్లతో 116.63 కి.మీ నాలుగు రహదారులు నిర్మించడం తెలిసిందే. నాయుడుపేట-తూర్పుకనుపూరు, చిల్లకూరు-తూర్పు కనుపూరు పనులు ఇప్పటికే సగం వరకు పూర్తిచేశారు. ఎన్‌వీ రోడ్ల నుంచి పండూరు వరకు ఇటీవల ప్రారంభమయ్యాయి. గూడూరు-దుగరాజపట్నం భూసేకరణ దశలో ఉంది. ఇవన్నీ పూర్తయితే ఇక్కడి రూపురేఖలు మారనున్నాయి. రెండేళ్లలో పూర్తిచేసేలా స్వయంగా సీఎం పర్యవేక్షిస్తున్నారు.

## ఎడారిలో ప్రభాస్ హీరోయిన్ వెతుకులాట దేనికోసం?

పట్టం పోలె అనే సినిమాతో నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మాళవిక మోహనన్ ఆ తర్వాత కన్నడ, హిందీ, తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీ అయిపోయారు. తెలుగులో మాళవిక ఇప్పటివరకు ఏ సినిమా చేయకపోయినా ఆమె నటించిన సినిమాలు తెలుగులో డబ్బింగ్ అవడం ద్వారా అమ్మడు టాలీవుడ్ ఆడియన్స్ కు పరిచయస్తురాలే. అయితే మాళవిక సినిమాలతోనో, ఫోటో షూట్‌ల ద్వారానో లేదా మరేదైనా విషయం వల్లనో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్న మాళవిక మోహనన్ రీసెంట్ గా తన రాజస్థాన్ టూర్ నుంచి కొన్ని ఇంట్రెస్టింగ్ ఫోటోలను ఇన్‌స్టాగ్రమ్ స్టోరీల్లో పోస్ట్ చేశారు. అందులో మాళవిక చాలా రెగ్యులర్ గా డ్రెస్సప్ అయి కనిపించారు. ఈ ఫోటోల్లో మాళవిక



మరింత ఎట్రాక్టివ్ గా కనిపించగా, ఆమె ఫ్యాన్స్ ఆ ఫోటోలను, ఆమె వైబ్ ను ఇష్టపడుతున్నారు. ఈ ఫోటోల్లో ఎలాంటి గ్లామర్ యాంగిల్ లేదు. ఫిల్టర్లు కానీ, గ్లామర్ ఎట్రాక్షన్స్ కానీ ఏమీ లేకుండా చాలా సింపుల్ గా రాజస్థాన్ లో జీప్ లో ట్రావెల్ చేస్తూ మాళవిక షేర్ చేసిన ఈ ఫోటోలు ప్రతీ ఫ్రేమ్ చాలా కొత్తగా కనిపిస్తోంది.

రెగ్యులర్ ఫోటోషూట్‌లా కాకుండా మాళవిక ప్రతీ షాట్ లోనూ ఓ కొత్తదనాన్ని చూపించడంతో ఆ ఫోటోలు మరింత స్పెషల్ గా మారాయి. ఇక సినిమాల విషయానికొస్తే మాళవిక ప్రస్తుతం ఇద్దరు టాప్ స్టార్లతో నటిస్తున్నారు. టాలీవుడ్లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో రాజా సాబ్ సినిమాను చేస్తున్న మాళవిక, మలయాళంలో హృదయపూర్వంలో మోహన్ లాల్ తో కలిసి స్క్రీన్ ను షేర్ చేసుకుంటున్నారు. ఈ రెండు సినిమాల నుంచి టీజర్లు రాగా, వాటిలో మాళవిక క్యారెక్టర్, స్క్రీన్ ప్రెజెన్స్ అందరినీ ఆకట్టుకుంది.

## బాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తున్న డ్రాగన్ బ్యూటీ..?

ఒక్క సినిమా హీరోయిన్ ఫేట్ మార్చేస్తుంది అని చాలా మంది కథానాయికల కెరీర్ లో ప్రూవ్ అయ్యింది. ఇప్పుడు అదే తరహాలో ఒక హీరోయిన్ ని ఓవర్ నైట్ స్టార్ ని చేసింది. అంతకుముందు నుంచి సినిమాలు చేస్తున్నా కూడా ఒక సినిమాలో అది కూడా ఆమె చేసిన సెకండ్ హీరోయిన్ రోల్ తో సూపర్ పాపులర్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే డ్రాగన్ బ్యూటీ కయదు లోహార్ అని తెలుస్తుంది. కోలీవుడ్ లో పలు సినిమాల్లో నటించిన అమ్మడు శ్రీవిష్ణు చేసిన అల్లూరి సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఐతే అప్పుడు అసలేమాత్రం జనాల దృష్టిలో పడని కయదు రీసెంట్ గా ప్రదీప్ రంగనాథ్ చేసిన డ్రాగన్ సినిమాతో అదరగొట్టేసింది. సినిమాలో ప్రదీప్ ఫస్ట్ హాఫ్ అనుపమని లవ్ చేస్తాడు సెకండ్ హాఫ్ లో కయదుతో పెళ్లికి రెడీ అవుతాడు. డ్రాగన్ సినిమాలో కయదు



ఎంట్రీ మామూలుగానే అనిపించినా సినిమా నడుస్తున్నా కొద్దీ ఆమె నచ్చేస్తుంది. ఒకదశలో కయదుతో ప్రేమలో పడేలా చేస్తుంది. ఇక అమ్మడి గ్లామర్ షోకి కూడా కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. సో అలా కయదు లోహార్ డ్రాగన్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా రిలీజ్ తర్వాత ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా బీభత్సంగా పెరిగారు. మరోపక్క కయదు లోహార్ తెలుగులో విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది.

ఆ సినిమాతో అమ్మడు మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది. ఐతే సౌత్ ఆడియన్స్ ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తున్న ముంబై మేకర్స్ కయదు మీద ఉన్న ఈ బజ్ చూసి ఆమెని అక్కడ సినిమాల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ఓ విధంగా ఇది గొప్ప విషయమని చెప్పొచ్చు. డ్రాగన్ సినిమాతో కయదు నిజంగానే తన సత్తా చాటి అదరగొట్టే ఛాన్స్ లు అందుకుంటుంది. అమ్మడు ఇటు సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా ఛాన్స్ అందుకుంటే మాత్రం అక్కడ ఆడియన్స్ ని కూడా తన బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పొచ్చు. నిజంగానే కయదు బాలీవుడ్ షిఫ్ట్ అయితే మాత్రం అక్కడే టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ లు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.




## రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ రొమాంటిక్ మెలోడీ!



జాన్వీ కపూర్ టాలీవుడ్ డెబ్యూ 'దేవర'లో గ్లామరస్ పాత్రలోనే కనిపించింది. కానీ తంగ పాత్రలో నటనకు అంతగా స్కోప్ కనిపించలేదు. హీరోతో కాంబినేషన్ సన్నివేశాలు కూడా చాలా పరిమితంగానే ఉన్నాయి. అలా తారక్ తో జాన్వీకి రొమాంటిక్ సన్నివేశాలు చేసే ఛాన్స్ కు దూరమైంది. కానీ 'పెద్ది'లో మాత్రం రామ్ చరణ్ తో రొమాన్స్ కి ఏమాత్రం కొదవలేదన్నది తాజా అప్డేట్. బుచ్చిబాబు కూడా రొమాంటిక్ డైరెక్టరే. హీరోయిన్లను అందంగా ఆవిష్కరించంలో దిట్టే అని తొలి సినిమా 'ఉప్పెన'తోనే ప్రూవ్ చేసాడు. కృతి శెట్టిని వెండి తెరపై అందంగా ఆవిష్కరించిన తీరుకు యువత ఫిదా అయింది. సినిమాలో హీరో-హీరోయిన్ మధ్య మాంచి రొమాంటిక్ సాంగ్ కూడా ఉంటుంది. ఇప్పుడా ఛాన్స్ పెద్దిలో కూడా తీసుకున్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్ హైదరాబాద్ లోనే జరుగుతోంది. తాజా షెడ్యూల్ లో కొంత టాకీ తో పాటు ఓ పాట షూటింగ్ కూడా నిర్వహిస్తున్నారట. ఇది రామ్ చరణ్-జాన్వీకపూర్ మధ్య వచ్చే ఓరొమాంటిక్ మెలోడీ సాంగ్ అట. రెహమాన్ ఈ పాటను ఎంతో హృద్యంగాను డిజైన్ చేసాడట. ప్రేమికుల మధ్య విరహ వేదనను పాటలో హైలైట్ చేయబోతున్నారట. మొత్తానికి ఈ మాస్ కంటెంట్ ఉన్న సినిమాలో రొమాంటిక్ గీతాలకు కూడా బుచ్చిబాబు పెద్ద పీట వేసినట్లు కనిపిస్తుంది. ఈ పాట విషయంలో బుచ్చిబాబు చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. యువత హృదయాల్ని దోచేలా ఈ పాట ఉంటుందని భావిస్తున్నాడట. ఈ ప్రాజెక్ట్ లో రెహమాన్ భాగమయ్యారు? అంటే అందుకు కారణం కేవలం బుచ్చిబాబు పట్టుదలతోనే. టాలీవుడ్ లో ఎంతో మంది మ్యూజిక్ డైరెక్టర్లు ఉన్నా? వాళ్లందర్నీ కాదని మరీ చరణ్ ని ఒప్పించి రెహమాన్ కావాలని పట్టుబట్టి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ కోసం రెహమాన్ కూడా అంతే కసిగా పని చేస్తున్నారు. రెహమాన్ కూడా తెలుగు సినిమాకు సంగీతం అందించి చాలా కాలమవుతోంది. మధ్యలో వచ్చిన కొన్ని అవకాశాలు వదులుకున్నా పాన్ ఇడియా స్టార్ రామ్ చరణ్ చాన్స్ ను మాత్రం మిస్ చేసుకోలేదు. మ్యూజికల్ గా ఈ సినిమా సంచలనమవుతుందని అంచనాలైతే పీక్స్ లోనే ఉన్నాయి.

## 'మరణమాస్' టాక్: ఓటీటీ రెస్పాన్స్ ఎలా ఉంది?




ట్రైలర్ తోనే పాజిటివ్ బజ్ క్రియేట్ చేసిన మలయాళ సినిమా 'మరణమాస్'. ఇటీవల %బు% సోనీ లివ్ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. శివ ప్రసాద్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ డార్క్ కామెడీ, కేరళలో ఒక నైట్ బస్సులో జరిగే అనూహ్య సంఘటనల చుట్టూ తిరుగుతుంది. బనానా కిల్లర్‌గా పిలిచే ఓ సీరియల్ కిల్లర్, స్థానిక ట్రబుల్‌మేకర్ లూక్ (బాసిల్ జోసెఫ్), అతని గర్ల్‌ఫ్రెండ్ జెస్సీ (అనిష్మ అనిల్‌కుమార్)తో సహా పలు పాత్రలు ఈ బస్సు ప్రయాణంలో చిక్కుకుంటాయి. సినిమా కథలో లూక్, ఓ వృద్ధుడి మరణంతో బస్సులో చిక్కుకుని, అనుమానిత కిల్లర్‌తో కలిసి ఈ రాత్రిని ఎలా గడుపుతాడనేది ఆసక్తికరంగా సాగుతుంది. బాసిల్ జోసెఫ్ తన డిఫరెంట్ పాత్రలో అద్భుతంగా నటించాడని, అతని కామెడీ టైమింగ్ సినిమాకు ప్లస్ అయ్యిందని ప్రేక్షకులు చెబుతున్నారు. అనిష్మ అనిల్‌కుమార్ కూడా జెస్సీగా తన వైబ్రంట్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంది. సిజు సన్నీ, రాజేష్ మాధవన్ పాత్రలు కూడా బాగున్నాయని, కానీ బాబు ఆంటోనీ పాత్రను మరింత బాగా ఉపయోగించుకోవచ్చని కొందరు అభిప్రాయపడ్డారు. ట్రైలర్‌లోనే హైలైట్ అయిన డార్క్ హ్యూమర్, సినిమాలో కూడా ప్రేక్షకులను నవ్వించింది. ఈ సినిమా సీరియస్‌గా కనిపించే అంశాలను కూడా కామికల్‌గా చూపించడం బాగుంది, ముఖ్యంగా బస్సు జర్నీలో మధ్య భాగం ఆసక్తికరంగా సాగింది అని నెటిజన్లు అంటున్నారు. నీరజ్ రెవి వైబ్రంట్ విజువల్స్, జెకె సంగీతం సినిమా క్విర్కీ టోన్‌కు సరిపోయాయని, కానీ సంగీతం లాంగ్ లాస్టింగ్ ఇంప్రెషన్ ఇవ్వలేదని కొందరు అభిప్రాయపడ్డారు. స్క్రీన్‌ప్లే కొన్ని చోట్ల నీరసంగా, డైలాగ్స్ సాగదీతగా ఉన్నాయని కొంతమంది విమర్శించారు. సినిమా మొదటి గంట కాస్త నెమ్మదిగా సాగినప్పటికీ, బస్సు జర్నీ మొదలైన తర్వాత కథలో వేగం, ఆసక్తి పెరిగాయని అంటున్నారు. లూక్-జెస్సీల రిలేషన్‌షిప్‌ను ఒకే రాత్రిలో సరిచేయడం కొంత ఒప్పించలేదని, ఎమోషనల్ డెప్త్ లోపించిందని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే, సీరియల్ కిల్లర్ ఎస్కే, కండక్టర్ కథ, స్మశానంలో జరిగే సన్నివేశాలు ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రేక్షకులు చెప్పారు. మొత్తంగా, 'మరణమాస్' ఒక టైమ్‌పాస్ డార్క్ కామెడీగా అందరినీ ఆకట్టుకుంది. మొదటి భాగం నెమ్మదిగా ఉన్నప్పటికీ, మధ్యలో డార్క్ హ్యూమర్, టెన్షన్‌తో సినిమా ఆసక్తికరంగా సాగుతుందని, అల్లరిగా సాగే డార్క్ కథలు ఇష్టపడే వారికి ఈ సినిమా నచ్చుతుందని పబ్లిక్ టాక్ నడుస్తోంది.

## అమ్మడిలో ఆ బెంగ కనపడట్లేదే..?

ఉప్పెనతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి అంతకుముందు మోడలింగ్ లో మెప్పించింది. ఐతే ఒక సినిమా చేసే దాకా ఆమెకు పెద్దగా గుర్తింపు రాలేదు. ఐతే ఎప్పుడైతే ఉప్పెన బ్లాక్ బస్టర్ అయ్యిందో అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ ఫ్లోలో వరుస క్రేజీ ఛాన్స్ లు అందుకుంది. తొలి సినిమా హిట్టు పడితే ఆ పాజిటివిటీ వేరేలా ఉంటుంది. ఐతే అదొక్కటే ఉంటే సరిపోదు తర్వాత సినిమాలు ఆడియన్స్ ని ఎంగేజ్ చేయాలి. ఒకటి కాకపోతే మరొకటైనా అదే రేంజ్ సక్సెస్ సాధించాలి. కానీ బ్యాడ్ లక్ ఏమో కానీ ఉప్పెన హిట్ తర్వాత శ్యాం సింగ రాయ్, బంగార్రాజు సినిమాలతో పర్వాలేదు అనిపించుకున్న కృతి శెట్టి ఆ తర్వాత చేసిన సినిమాలన్నీ కూడా నిరాశ పరిచాయి. కృతి శెట్టి చేస్తున్న సినిమాలన్నీ ఫెయిల్ అవ్వడంతో ఆమె గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. లాస్ట్ ఇయర్ శర్వానంద్ తో మనమే



సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమా తో కూడా అమ్మడు పెద్దగా మెప్పించలేదు. సినిమా ఫలితాలు ఎలా ఉన్నా నటిగా కృతి శెట్టి కూడా అంత గొప్ప పర్ఫార్మెన్స్ లు ఇచ్చింది లేదు. అందుకే మిగతా హీరోయిన్స్ లానే ఆమెను కూడా లైట్ తీసుకున్నారు ఆడియన్స్. ప్రేక్షకులు ఆసక్తి చూపిణట్లేదు కాబట్టే దర్శక నిర్మాతలు కూడా ఆమెను తీసుకోవట్లేదు. ఐతే తెలుగులో వర్క్ అవుట్ కావట్లేదని తమిళ్ కి షిఫ్ట్ అయ్యింది కృతి శెట్టి. ప్రస్తుతం అక్కడ ఎల్.ఐ.కె, జినీ సినిమాలు చేస్తుంది కృతి. ఐతే సినిమాల ఛాన్స్ లు ఎలా ఉన్నా తన సోషల్ మీడియా ఫోటో షూట్స్ విషయంలో వెనక్కి తగ్గట్లేదు కృతి శెట్టి. మొదట్లో గ్లామర్ షో విషయంలో డౌట్ పడ్డ కృతి శెట్టి ఈమధ్య రెచ్చిపోయి మరీ గ్లామర్ షో చేస్తుంది. ఐతే ఈ షోల వల్ల ఏమైనా అవకాశాలు వస్తాయా లేదా అన్నది చూడాలి. ఐతే అవకాశాలు రావట్లేదు అనే బెంగ ఏమాత్రం తనలో కనిపించకుండా ఫోటో షూట్స్ తో మెప్పిస్తుంది కృతి శెట్టి. మరి అమ్మడు తిరిగి టాలీవుడ్ లో ఎప్పుడు కంబ్యాక్ ఇస్తుందో చూడాలి. కోలీవుడ్ లో మాత్రం చేస్తున్న రెండు సినిమాల మీద కృతి శెట్టి చాలా హోప్స్ పెట్టుకుంది. మరి ఈ సినిమాలతో అమ్మడి ఫేట్ మారుతుందేమో చూడాలి.

## ప్రభాస్ తో చేసినా లక్ కలిసి రాలేదు..!

మోడల్ గా రాణించి ఆ తర్వాత హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కెరీర్ మొదట్లో అవమానాలు ఎదుర్కొని ఆ తర్వాత వరుస విజయాలతో అదరగొట్టింది అందాల భామ కృతి సనన్. మోడలింగ్ లో ఆమె రేంజ్ వేరు అనిపించుకున్న తర్వాత తెలుగులో సూపర్ స్టార్ మహేష్ తో 1 నేనొక్కడినే సినిమాతో ఆమె సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చింది. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు ఆ తర్వాత తెలుగులోనే నాగ చైతన్యతో దోచెయ్ సినిమా చేసింది కృతి సనన్. ఐతే అలా చిన్నగా బాలీవుడ్ షిఫ్ట్ అయ్యి అక్కడ వరుస ఛాన్స్ లు అందుకుంది. సినిమాలు వెబ్ సీరీస్ లు ఇలా హిందీ ఆడియన్స్ ని మెప్పిస్తూ వచ్చింది. ఐతే ఏమైందో ఏమో కానీ సడెన్ గా అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోయింది. బాలీవుడ్ లో ఆమెకు ఉన్న క్రేజ్ ని చూసే రెబల్ స్టార్ చేసిన ఆదిపురుష్ సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అందులో సీత పాత్రలో కృతి సనన్ ఇంప్రెస్ చేసింది. ఐతే ఆ సినిమా కూడా డిజాస్టర్ అవ్వడం వల్ల కృతి సనన్ మరింత ఇబ్బందుల్లో పడింది. ఆదిపురుష్ తర్వాత మరో రెండు సినిమాలు చేసినా



లాభం లేకుండా పోయింది ఐతే లాస్ట్ ఇయర్ వచ్చిన క్రూ సినిమాతో కాస్త బెటర్ అనిపించుకుంది కృతి సనన్. ప్రస్తుతం అమ్మడు తెరె ఇష్క్ మైన్ సినిమాలో నటిస్తుంది. ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాతో మరోసారి బాలీవుడ్ లో తన స్టామినా ప్రూవ్ చేసుకోవాలని చూస్తుంది కృతి సనన్. ఈ సినిమా టీజర్ తోనే ఆడియన్స్ కి షాక్ ఇచ్చేలా చేశారు మేకర్స్. కృతి సనన్ తో పాటు ఈ సినిమా ధనుష్ కి కూడా సంథింగ్ స్పెషల్ గా ఉంటుందని అనిపిస్తుంది. కృతి సనన్ మాత్రం ఈ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది. తప్పకుండా అమ్మడు తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఐతే ప్రభాస్ కృతి సనన్ జోడీ బాగుంది వాళ్లు చేసిన ఆదిపురుష్ ని పక్కన పెట్టి మళ్లీ ప్రభాస్ తో ఒక యాక్షన్ సినిమాలో కృతి సనన్ ని హీరోయిన్ గా ఫిక్స్ చేస్తే బాగుంటుందని ఆడియన్స్ అంటున్నారు. అలా జరిగితే మళ్లీ సౌత్ లో అదే ముఖ్యంగా తెలుగులో కృతి సనన్ కి మళ్లీ మంచి క్రేజ్ కొనసాగే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536